

పల్లా కొండల్

ముక్కోణపు
కాగడాపాట్యం

MB02 & 946

శతావధానాలు

ప్ర:-72
ము:-4.8

ముక్కామల నాగభూషణం

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రంబిల్డింగ్సు విజయవాడ-520004

ప్రచురణ నెం. : 888

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 1978

ప్రతులు : 2,000

వెల : రు. 3-50

రజతోత్సవ సంవత్సర ప్రచురణ

ముద్రణ :

'స్వతంత్ర'

విజయవాడ-520004.

విషయానుక్రమణిక

శతవతారాలు	1
రామాయణం - మహాభారతం	4
మానవ వికాస పరిణామక్రమంలో ప్రధాన యుగాలు	19
మానవాళి విస్తరణ - స్త్రీ పురుష సంబంధాలలో మార్పులు	23
దేవతలు - కొలుపులు - క్రతువులు	37
సింధు నాగరికత	55
భారతం	60
బ్రాహ్మణ, క్షత్రియవర్ణాలమధ్య పోటీ	69
బౌద్ధ, వైదిక మతాలమధ్య పోటీ	75
శైవ, వైష్ణవ మతాలమధ్య పోటీ	82

θ^{7}

శతావతారాలు

ఆస్తికుల నెవరినడిగినా దేవు డొకడే వుంటారు. పలువు రున్నారని యెవరూ చెప్పరు.

భగవంతుడు నామ, రూప రహితుడు అవాఙ్మానస గోచరుడు, ఆది మధ్యాంత రహితుడని మతగురువులు చెపుతూంటారు. కాని, ఇతరుల మతం కంటే మా మతం గొప్పది. వారి దేవునికంటే మా దేవుడు గొప్పవాడని ఘనంగా చెప్పుకుంటారు.

"హిందువులు అనేక దేవుళ్ళను, దేవతలనే పూజిస్తారు. మేం ఒకే దేవుని ప్రార్థిస్తాం" అంటారు క్రైస్తవులు. అలాగే మహమ్మదీయులూ అంటారు. ఆ మాట నిజం కావంటారు హిందువులు.

"మేం పూజిస్తున్న భగవంతుడొకడే. ఆయన సర్వాంతర్యామి. విశ్వమంతా భగవంతుని స్వరూపమే. ఆయన కొక పేరు లేదు, రూపం లేదు. కాబట్టి, ఏ పేరుతో ప్రార్థించినా, యే రూపంలో పూజించినా, ఎవరో గనుక, రక రకాల రూపాలలో, అనేక పేర్లతో భగవంతుని పూజిస్తున్నవారు, మా మతంలో వున్నారు. ఇదొక విశాలమైన దృష్టితో సాధించిన సమన్వయం. ఇతర మతాలలో, ఈ విశాలదృష్టి, సమన్వయం లేవు" అంటారు హిందువులు.

భగవంతుడున్నాడని నాస్తికు లొప్పుకోరు. ఈనాడే కాదు ఆస్తిక-నాస్తిక వాదాలు రెండూ ఋగ్వేదకాలం నుండీ వున్నాయి.

ఆస్తిక – నాస్తికుల మధ్య గతంలో అనేక చర్చలు, ఘర్షణలు జరిగాయి. "నాస్తికులు పాషండులు, మూర్ఖులు, నీతి నియమాలు లేని వారు" అని ఆస్తికులు తిట్టి పోస్తే, "ఆస్తికులు బిడుగులు, సోమరిపోతులు పరాన్న భుక్కులు మోసగాళ్ళు" అని నాస్తికులు తిట్టిపోశారు.

అధర్మాన్ని పెంచి, పాపంతో నరకాన్ని నింపి, స్వర్గంలో వత్తిడి తగ్గించేందుకు,గౌతమ బుద్ధుడు అవతరించాడని వైదికులు ప్రచారంచేశారు.

"కోతిని, పందిని, ఎలుకను కుక్కనే గదా వైదికులు పూజిస్తున్నది?" అని బౌద్ధులు విమర్శించారు.

మీరు గోవు మాంసం తింటారంటే, మీరు పందిమాంసం తింటారని దెప్పు కున్నారు. ఒకరు అవునంటే, మరొకరు కాదన్నారు.

ఇలాంటి దూషణలు, ఘర్షణలు భౌతిక వాదులైన లోకాయతికులకు (చార్వాకులకు), ఆధ్యాత్మిక వాదులైన వైదికులకు మధ్య జరిగాయి. ఆ పైన బౌద్ధ - వైదిక మతావలంబికుల మధ్య జరిగాయి. నేటికీ భౌతిక-ఆధ్యాత్మికవాదుల మధ్య వాద, ప్రతివాదనలు సాగుతూనేవున్నాయి.

వివిధ మతాల మధ్య ఘర్షణలు భారతదేశంలో మాత్రమే జరగలేదు. అవి ప్రపంచ మంతటా జరిగాయి.

ఒకరినొకరు తిట్టుకోవడం, ఒకరి మీద వొకరు నిందా ప్రచారం చేయడంతోనే ఆగలేదు. హిందువులు బౌద్ధులమీద విరుచుకు పడ్డారు. వీరశైవులు జైనులను చంపారు. క్రైస్తవ - ఇస్లాం మతస్తుల మధ్య ఏళ్ళు తరబడి యుద్ధాలు జరిగాయి.

ఒకే మతంలోగల శాఖల మధ్యగూడ ఘర్షణలు రేగాయి. శైవులకు-వైష్ణవులకు; రోమన్ కాథలిక్కులకు-ప్రొటెస్టాంట్స్‌కు ; షియాలకు సున్నీలకు ; హీనయాన బౌద్ధులకు-మహాయాన బౌద్ధులకు మధ్య నెనోన్నో కలతలు, కొట్లాటలు సంభవించాయి.

నేటికీ ప్రపంచంలో వర్ణ భేదం, మత దురహంకారం ప్రబలంగానే ఉన్నాయి. ఒక వైపున విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు వృద్ధి పొందుతోంటే, మరో వైపున ఛాందసం పెరుగుతోంది.

భారతఉపఖండం చీలిపోవడానికి మతోన్మాదం కారణం గాదా? ఈ విభజనవల్ల అమాయకులైన లక్షలాది హిందూ, ముస్లిం ప్రజలు పలు బాధ లనుభవించలేదా? నేడుకూడా, దక్షిణాఫ్రికా, రొడీషియావంటి చోట్ల వర్ణ దురహంకారం రాజ్య మేలడంలేదా ?

ఈ దురహంకారం ప్రబలితే కష్టనష్టాల పాలయ్యేది సామాన్య ప్రజలు మాత్రమే! వీటిని రెచ్చగొట్టే పెద్దలకే బాధా వుండదు. కనుకనే

రకరకాల పద్ధతులలో ప్రజలను రెచ్చగొడుతుంటారు. సామాన్య ప్రజలను పట్టి పీడిస్తున్న ఆర్థిక, సాంఘిక సమస్యలనుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు అనేక ఎత్తుగడలు వేస్తుంటారు.

వివిధ మతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టడంతోపాటు, వివిధ వర్ణాలమధ్య, కులాల మధ్య ప్రాంతాల మధ్యకూడా విభేదాలనురెచ్చగొడతారు. కొట్లాటలను ప్రోత్సహిస్తారు. "శ్రీరాముడు అవతారమూర్తి" అని కొందరు కీర్తిస్తే, "రావణాసురుడు గొప్పవాడు" అని కొందరు మెచ్చుకుంటారు. రామలీలలకు పోటీగా రావణలీలలు ప్రదర్శిస్తారు. వీనాదోసమసి పోయిన ఆర్య–ద్రవిడ భేదాల వంటి వాటిని తిరగదోడి ప్రచారం జేస్తారు. ఇలాంటి ఎత్తుగడల ద్వారా, సమాజంలో తమకు గల ఆధిక్యతను సుస్థిరం జేసుకోవడానికి ప్రయత్నిస్తారు.

వీరి చేతుల్లో ప్రచార సాధనాలున్నాయి. వందల కొలది గ్రంథాలు ప్రాసి ప్రజలను మభ్య పెట్టగల పండితులున్నారు. వారికి దండిగా ముట్టచెప్పటానికి తగినంత ధనబలం వుంది. వేల సంవత్సరాలనుండీ వచ్చి వృక్షాలుగా పెరిగిన పురాణాలున్నాయి. ప్రజల మనస్సుల్లో పాతుకు పోయిన కర్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతంలాంటివి వున్నాయి.

ఒకవైపున విజ్ఞాన, సాంకేతికశాస్త్రాభివృద్ధిని తమ స్వలాభంకోసం వినియోగించుకుంటూ, ఆధునాతన సౌకర్యాలను అనుభవిస్తూ, మరోవైపున తాంత్రిక, మాంత్రికులను పొగడుతూ ప్రచారం చేస్తారు.

ఏదైనా ఒక గాథ కల్పితమా? చారిత్రకమా? అని పరిశీలించడం వీరికి గిట్టదు. వెంటనే నాలుగువైపుల నుండీ నలుగురు లేస్తారు. మన పురాణాలను, ధర్మ గ్రంథాలను దుయ్యబడుతున్నారని గోలపెడతారు. ప్రజలను రెచ్చ గొట్టేందుకు ప్రయత్నిస్తారు.

కాబట్టి, ప్రగతిని కాంక్షించే వారు దూషణ, భూషణ తిరస్కారాల పొంతకు పోకూడదు. రామాయణ, భారత గాథలను పరిశీలించ దలచుకున్నచో, చారిత్రక దృష్టితో తులనాత్మకంగా పరిశీలించాలి. కనుక సాధ్యమైనంత వరకూ చారిత్రక సత్యాలను పాఠకుల ముందుంచడమే నా యీ ప్రయత్నంలోని ముఖ్యోద్దేశమని మనవి జేస్తున్నా. తప్పులున్నచో క్షమించి, నాకు తెలుపవలసిందిగా విజ్ఞప్తి జేస్తున్నాను.

రామాయణం–మహాభారతం

ఇతిహాసము, సంహిత, ఆఖ్యానమను పేర్లు రెంటికీవున్నాయి. జయను పేరు రామాయణమీకు లేదు. కాని, అష్టాదశ పురాణాలతోపాటు, రామాయణ, మహా భారతములు కూడా జయనామాన్ని కలవేనని భవిష్యత్పురాణంలోనే వ్రాశారు.

ఈ ఇతిహాసాలలో ఏది ముందు? ఏది వెనుక? అసలివి ఎప్పటివి? చారిత్రకాధారాలేమైనా వున్నాయా? లేవా? అనే విషయాలపై అనేకులనేక విధాలుగా చెపుతున్నారు.

భారతం కంటే రామాయణమే ముందువని జాకోబి అభిప్రాయపడ్డారు. ఇదే అభిప్రాయాన్ని 'వెలిబుచ్చుతూ శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు రచించిన సంస్కృతవాఙ్మయచరిత్ర -లౌకిక వాఙ్మయం" అన్న గ్రంథంలో చూపిన ఆధారాలు చూడాం.

"రామాయణం ఆది కావ్యం. ఆర్షము వేదసమ్మతము. ఏకనాయక మగు రామాయణం పరిక్రియ యనెడి ఇతిహాసం. బహునాయకమైన భారతం పురాకల్పమనెడి ఇతిహాసం"

"రామాయణ కథ త్రేతాయుగంలోనిది, భారతకథ ద్వాపరాంతం నాటిది. అందలి కథానాయకుడు రాముడు. ఇందలి కథా ప్రవర్తకుడు కృష్ణుడు."

"సప్తమహర్షులలోని అత్రి, భరద్వాజ, వసిష్ఠ, విశ్వామిత్రులకు రామ కథతో సంబంధమున్నది. భారతంలోని ప్రధాన కథకో ఆ మహర్షులకు సంబంధం లేదు."

"ఏకనాయక కావ్యము ముందు పుట్టుటయు, బహునాయక కావ్యము తరువాతి దగుటయు సహజమే. మొదటి కథ సరళంగా నుండడం, తరువాతి కథ తికమకలుగా నుండడం గూడ సహజమే."

"శ్రీరామునకు సనాతన ధర్మ నిష్ట యెక్కువ. రాజ నీతిజ్ఞత తక్కువ. ధర్మరాజు ధర్మవర్తనుడయ్యు, రాజనీతి పారంగతుడై, కార్యం వడపినవాడు."

"సీతకు లోకజ్ఞానము లేదు. ద్రౌపది కున్నది."

"భరత, లక్ష్మణులు రాముని మాట జవదాటలేదు. భీమార్జును లొక్కొక్కప్పుడు ధర్మరాజును నిందించారు."

"సంగ్రామ నియమములు, వ్యూహములు రామాయణ కాలమునె కంతగా లేవు. అవి కురుక్షేత్ర యుద్ధంనాటి కున్నాయి."

"రామాయణ కాలంనాడు దక్షిణ భారతదేశం గాఢారణ్యమయం - భారతకాలము నాటికి, కొంచెము నాగరికత గాంచిన జనపదము లేర్పడినాయి."

"భారతమున రామోపాఖ్యానము కనబడుతున్నదిగాని, రామాయణ మందెక్కడా, భారత ప్రధాన కథలోని పాత్ర లేవీ కనుపించడంలేదు."

ఈ వాచనను వ్యతిరేకిస్తూ, రామాయణం కంటే భారతమే ముందుగా రూపొందించనేవారు, ఈ క్రింది ఆధారాలను చూపిస్తున్నారు.

"ఆర్యులు పంజాబ్ ప్రాంతాలలో నుండగా కురుక్షేత్ర యుద్ధం జరిగింది. ఆ తరువాతనే ఆర్యులు అయోధ్య, మిథిలా నగరాల వరకు విస్తరింప గలిగారు. కాబట్టి, రామాయణగాథ కంటే భారతమే ముందు దని చెప్పవచ్చు."

"హస్తినాపుర ప్రత్నకాలలో పురాతన శిథిలాలు. పాక్యాధారాలు కొన్ని దొరికాయి. అయోధ్యలో ఇంతవర కలాంటివి దొరకలేదు."

"భారతం పంచమ వేదం. రామాయణం వేదసమ్మతం మాత్రమే.

"భారతం తరువాతనే రామాయణం రూపొందింది.కనుకనే భారతంలో కంటే, రామాయణంలో కావ్యభాషా లక్షణాలధికంగా వున్నాయి"

"మాతృస్వామిక దశనాటి లక్షణాలు భారతంలో వున్నాయి. ద్రౌపదికి ఐదుగురు భర్తలుండడానికి కారణమదే. సమాజం పితృస్వామిక దశలో ప్రవేశించిన పిమ్మటిదే రామాయణం."

రామాయణ రచన కంటే, భారత రచన ముందుగా జరిగిందని వాదించే వారిలో వాష్‌బర్న్ హాస్కిన్స్ ముఖ్యుడు.

"భారతంలోని పాత్రలు పచ్చిగా ఉన్నందున, వాటికి భిన్నమైన పాత్రలను తీసికొని, వాల్మీకి రామాయణం వ్రాశాడు" అని శ్రీ యస్. ఎ. డాంగే అభిప్రాయపడ్డారు.

"భారతం తరువాతనే రామాయణం రూపొందింది. కనుకనే రామాయణ గాథ లంకవరకూ విస్తరించింది. అటాగాక, వ్యావహారిక దశ ప్రారంభమైన సమయంలోనే రామాయణం రూపొంది వుంటే, అది, భారతంకంటే ముందుదే అయివుండేది. ఆ స్థితిలో రామాయణం వింధ్యకు ఉత్తరాన జరిగిన ఘటనలకే పరిమితమని చెప్పక తప్పదు." అంటున్నారు డా॥ రోమిలా థాపర్.

రామాయణ, మహాభారతములలో మొదటిదే ముందుగా రూపొందింది. కాని, భారతం ముందుగా గ్రంథస్థం కాగా, తరువాత కొంత కాలానికి రామాయణం గ్రంథస్థమైనవని పలువురు పరిశోధకులు నిర్ణయిస్తున్నారు.

"వైదిక భాష, కావ్య భాషగా పరిణామం చెందుతున్న దశలో భారతాన్ని గ్రంథస్థం చేశారు. కావ్య భాష వొక రూపాన్ని ధరించిన సమయంలో రామాయణాన్ని అక్షర బద్ధంచేశారు." అని జాకోబి చెప్పిన మాటను పలువురు పండితులు సమర్థిస్తున్నారు.

భారతం కంటే రామాయణమే ముందుగా రూపొందిందని నమ్ముతున్నవారు మరికొన్ని ఆధారాలు చూపుతున్నారు.

రామాయణంలో లేని రథ, గజ, తురగ సైన్యాల పోరాట వివరాలు భారతంలో ఉండడమే గాక, ఇనుముతో తయారు చేసిన కత్తులు కత్తుల వంటి ఆయుధాలు నెక్కువగా కురుక్షేత్ర యుద్ధంలో వాడినట్లుగా కనబడుతోంది కాబట్టి, ఇనుమును అలుగులకు, నాగటి కర్రులకు ఉపయోగించిన ధశలో రామాయణం రూపొందిందని, ఇనుముతో రక

శకాల ఆయుధాలను, పనిముట్లను తయారు చేస్తున్న దశలోనిది భారత మని చెప్పవచ్చు.

కందమూల ఫలాదులపైన, వేటపైన ఆధారపడి జీవించడం కష్ట మైపోగా, పశువుల మందలను పెంచి, వాటి మేతకొరకు వ్యవసాయం ప్రారంభించిన దశలోనిది రామాయణం. వ్యవసాయం కొంతవరకు వృద్ధిపొందిన దశలోనిది భారతం.

క్షత్రియులపైన, బ్రాహ్మణుల ఆధిక్యత ప్రబలంగా ఉన్న దశ లోనిది రామాయణం. విశ్వామిత్రు డెదురు తిరిగి బ్రహ్మర్షియై శ్రీరాము నకు అస్త్ర శస్త్ర విద్యలనేర్పి, పరశురాముని గర్వభంగం చేయించిన పిదప, బ్రాహ్మణాధిక్యత కొంత తగ్గింది. కనుకనే రామాయణంలో కను పించే బ్రాహ్మణాధిక్యత భారతంలో కనుపించడంలేదు.

రామాయణ కాలంలో పురోహితులే మంత్రులు. భారత కాలంలో రాచకార్యాలు చక్కబెట్టిన వారు సూతులు.

రామాయణం నాటికంటే, భారతం నాటికి ఆర్యుల రాజ్యాలుఅధిక మయ్యాయి. ఆర్యులలో ఒకరి రాజ్యాన్ని మరొకరు ఆక్రమించడం రామా యణకాలంలో లేదు. అది మహాభారత కాలంలో ప్రారంభమైంది.

రామాయణకాలంలో బెలూచిస్తాన్, సింధ్, గుజరాత్ ప్రాంతాలలో గల రాక్షస, దానవ తెగలతోను, ద్రావిడులతోను పోరాడిన ఆర్యులు భరతఖండంలోని తూర్పు దక్షిణ ప్రాంతాలలోనున్న నాగులతో పోరాడ లేదు. ఆ అవసరం తూర్పు, దక్షిణ దిశలుగా ఆర్యులు విస్తరించిన పిమ్మట కలిగింది. అట్టి సమయంలో రూపొందినదే భారతం.

"రామకథను, వాల్మీకివి పేర్కొని రామాయణంలోని కొన్ని శ్లోకాలను భారతంలో చేర్చారు. అలాగని, భారతంలోని శ్లోకాలను రామాయణంలో చేర్చలేదు."

ఈ విధంగా ఎవరికి తోచిన ఆధారాలను వారు చూపెడుతున్నారు. ఒకరు రామాయణగాథ ముందువంటే, మరొకరు భారతగాథ ముందు దంటున్నారు. అసలీ రెండుగాథలూ కల్పితాలేనని మరికొంద రంటున్నారు.

రామకథ కల్పితం కావచ్చుగాని, భారతకథ కల్పితం కాదనేవారు కొందరున్నారు.

"అయోధ్య, విదేహ, సీతవంటి మాటలు వేదాలలోనివే. "సీత" అనగా భూమి. నాగలి అని కూడా అర్థం. "విదేహ" అనగా, నిర్గుణము రూపరహితము. కాగా, నాగలిని కనిపెట్టి, వ్యావసాయకదశలో ప్రవేశించిన ఆర్యులు, దక్షిణాభిముఖంగా విస్తరిస్తున్న సమయంలో, వేదాలోని మాటలను ఆధారంగాచేసుకొని రామాయణగాథ నల్లారు" అని డాక్టర్ మజుందార్ అభిప్రాయపడ్డారు.

"జనకుడొక తెగకు నాయకుడు. చంద్రవంశ క్షత్రియుడు. వ్యవసాయక దశలో ప్రవేశించిన సూర్యవంశ క్షత్రియులు మిథిలానగర ప్రాంతంలో వ్యవసాయాన్ని ప్రవేశపెట్టారు. వేటాడి, ఆహారాన్ని సంపాదించుకోవలసిన అవసరం లేకుండా, వ్యవసాయం చేసుకునేందుకు తగినవాగులివి తయారుచేయడం, దున్నడం జనకునకు నేర్పారు. అంతటితో వేటకు పనికివచ్చే ఆటవికుల విల్లుకుగల ప్రాముఖ్యత పోయింది. కనుక శ్రీరాముడు శివధనస్సును విరిచినట్లుగా వర్ణించారు. వ్యవసాయానికి పనికివచ్చే నాగలి, జనకునకు లభించింది. కాబట్టి, జనకునకు సీత దొరికిందన్నారు. సీత (నాగలి) ద్వారా సూర్యవంశ, చంద్రవంశ క్షత్రియుల మధ్య బాంధవ్యం పెరిగింది.

"ఈ విధంగా వ్యవసాయం విస్తరిస్తూ, ఒక తెగ పెంట మరొక తెగ, ఏదో ఒక విధంగా, సూర్యవంశ క్షత్రియుల పెత్తనం క్రింద చేరిపోతున్న దశలో రామాయణం ప్రారంభమైంది. కాబట్టి, దానిలో కొద్దిగా చారిత్రక సత్యాలు, ఎక్కువగా కల్పిత గాథలున్నాయని చెప్పవచ్చును" అన్నారు డా॥ పుసాల్కర్.

వింధ్యకు ఉత్తరాన జరిగిన పోరాటాలు, వింధ్యకు దక్షిణాన జరిగినట్లుగా భావించి, చిత్రించడం వల్లనే రామ రావణ యుద్ధము, లంకాదహనం వంటి అసంబద్ధమైన గాథలు, రామాయణంలో వున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు.

రామాయణంలో పేర్కొనబడిన లంక, శ్రీలంక కాదని, వింధ్యకు ఉత్తరానగల యేదో ఒక చిన్న పట్టణమై ఉండవచ్చునని, సుప్రసిద్ధ చరిత్రకారుడైన జాకోబి అభిప్రాయపడ్డారు.

అయితే, అటువంటి చిన్న పట్టణ మెక్కడున్నట్లు ?

"జబల్‌పూర్ వద్ద గాని, అమరకంటక్ దగ్గరగాని, లంకా పట్టణం వుండేవని రూఢిగా చెప్పవచ్చు" నన్నారు సుప్రసిద్ధ భూగర్భ శాస్త్రవేత్త డా॥ శంకాలియా.

డాక్టర్ హుసాల్కర్ కూడా "రామాయణం గాథంతా ఉత్తర భారతదేశంలో జరిగిన ఘటనలకు సంబంధించినదే" నన్నారు

కార్తవీర్యార్జను డొకప్పుడు, తన భార్యా బిడ్డలను, పరివారమును వెంటబెట్టుకొని వెళ్ళి రేవానదివద్ద విడిదిచేసి నదికి అడ్డంగా కట్ట వేయించా డట. అందువల్ల నదిలోని నీటిమట్టం పెరిగి, రావణాసునీ లంకలో పరిషేశించగా రావణు డుగ్రుడై కార్తవీర్యార్జునునిపై దాడిచేశాడనీ, ఆ యుద్ధంలో కార్తవీర్యార్జునుడు,రావణాసురు నోడించి,మాహిష్మతీపురానికి తీసుకుపోయి, నాలుగు తన్ని విడిచి పెట్టాడనే కథ కూడా వుంది.

"సేతు. అనగా పెద్దకొలను సరస్సు అనే అర్థాలున్నాయి. కాని, వంతెన అనే అర్థంకూడా వాడుకలో వుంది. కనుకనే సేతు బంధనం అనే మాటను తీసుకొని, ధనుష్కోటినుండి శ్రీలంకకు వారధిని నిర్మించినట్లుగా భావించి. రావణవధ, లంకాదహనం మొదలైన గాథలను చిత్రించారు" అన్నారు డా॥ శంకాలియా.

"పెద్ద పెద్ద బండరాళ్ళతోను, కొండలతోను సాల వృక్షాలతోనూ సేతు బంధనం చేసినట్లుగా రామాయణంలో వుంది. అలాంటి బండలు, కొండలు, సాల వృక్షాలు ఛోటా నాగపూర్ ప్రాంతంలో వున్నాయేగాని, రామేశ్వరంవద్ద లేవు"

"దక్షిణ భారతదేశంలోని వివిధ పర్వత ప్రాంతాలు గాని, ప్రజల ఆచార వ్యవహారాలు గాని వాల్మీకి మహర్షికి తెలియవు. రామునిచే వధింప బడిన వాలి దహనక్రియలు, ఆర్యుల సంప్రదాయం ప్రకారం జరిగినట్లుగా వాల్మీకి వర్ణించడాన్ని బట్టిచూస్తే వాలి సుగ్రీవుల వ్యవహార మంతా ఉత్తర భారతదేశంలో జరిగిందే కాని దక్షిణ భారతదేశంలో జరిగింది కాదులదు" అంటూ డా॥ శంకాలియా ఒక వ్యాసం వ్రాసి ప్రకటించారు.

"సింధునాగరికతకు కేంద్రమైన మొహంజొదారోను జయించేందుకు ఆర్యులు చేసిన యుద్ధం చుట్టూ రామ కథను అల్లారు" అని భావిస్తున్నారు.

సుప్రసిద్ధ చరిత్ర కారుడు, చారిత్రక ఘటనల క్రమాన్ని రూపొందించే సంస్థకు డైరెక్టరు అయిన శ్రీ యస్. బి. రాయ్.

ఈ గాథ లేనాటివి ?

ఈ గాథల వెనుక నేటికి నా చారిత్రక సత్యమున్నదా? లేదా? అనే విషయం సరిగా తేలనట్లుగానే, అసలీ గాథ లేనాటివి?అనే విషయం కూడా తేలడం లేదు.

త్రేతాయుగంలో రామరావణ యుద్ధం, ద్వాపర యుగాంతంలో భారత యుద్ధం జరిగి నట్లుగా వీటిలో వ్రాశారు. కాని, ఆ వ్రాతలకు తగిన ఆధారం కనుపించడం లేదు.

- రామరావణ యుద్ధం త్రేతాయుగం మధ్యలో జరిగినట్లా? చివరిలో జరిగినట్లా? పోనీ, త్రేతా యుగాంతంలోనే జరిగిం దనుకుందాం. అయినా, నాటినుండి నేటివరకు పిన్న వేల సంవత్సరాలు గడచినట్లు?
- ద్వాపరయుగ ప్రమాణం 8,64,000 సంవత్సరాలు, కలి యుగంలో 5076 సంవత్సరాలు గడచిపోయాయి. అనగా, ఎనిమిది లక్షల డెబ్భై వేల సంవత్సరాల క్రితం రామ రావణ యుద్ధం జరిగినట్లా?
- అయితే, ఆ నాటి మానవులే దశలో వున్నారు? ఆర్య లెక్కడ వున్నారు? అయోధ్యలో వున్నారా? అని ఆలోచిస్తే, రామాయణ కథ త్రేతాయుగం నాటిది కాదని సులభంగా తేలిపోతుంది.

ఇకపోతే, భారత గాథ క్రీస్తు పూర్వం 3100 సంవత్సరాల నాటి దని కొందరు, 1400 సంవత్సరాల నాటిదని కొందరు, 900 సంవత్సరాల నాటిదని పలువురు చెపుతున్నారు.

కలియుగం ప్రారంభమై 653 సంవత్సరాలు గడచిన పిమ్మట, కురు పాండవులు జన్మించారని రాజ తరంగిణిలోవుంది. దీనిని బట్టి చూస్తే, క్రీస్తు పూర్వం 2447 వ సంవత్సర ప్రాంతంలో కురు పాండవులు జన్మించి వుండాలి.

క్రీస్తు పూర్వం మూడువేల సంవత్సరాల క్రితం, కురు–పాంచాల (హరియానా, ఉత్తర ప్రదేశ్‌లోని కొంత ప్రాంతం) భూములు, కీకారణ్యమయమని, 1400 బి సి. నాడు ఆ ప్రాంతాలలో, పట్టణ నాగరికత

లేదని, 900 బి. సి. నాటికి, ఆవుల మందలను మేపుకుంటూ, ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తిరిగిన సంచార తెగల వారు, కొత్త వ్యవసాయం కూడా ప్రారంభించినట్లుగా, సాక్ష్యాధారాలు (కార్బన్ 14• నిర్ణయాల ప్రకారం) లభించాయని, శ్రీ జగత్ పతి జోషి (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) ప్రకటించిన వ్యాసంలో వివరించారు.

ఈ అభిప్రాయాలలో ఏది విజమైనా, ఏది కాకపోయినా, కురుక్షేత్రసంగ్రామం ద్వాపర యుగాంతంలో జరిగినట్లుగా చెప్పుతున్న పురాణ గాథలను నమ్మడానికి వీలు లేదుకదా?

పోనీ, కురుక్షేత్ర సంగ్రామం క్రీస్తుపూర్వం• తొమ్మిది వందల సంవత్సరాల క్రింతం జరిగిం దనుకుందామా?

"కురుక్షేత్ర యుద్ధం జరిగిన తేదీల విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ అభిప్రాయాలమధ్య రెండువేల సంవత్సరాలతేడా కనుపిస్తోంది కాబట్టి కురుక్షేత్రయుద్ధం వట్టి అభూత కల్పనే అని చెప్పవచ్చు" నంటున్నారు డా॥ సర్కార్.

"క్రీస్తుపూర్వం తొమ్మిది వందల సంవత్సరాలనాడు, కురుక్షేత్ర యుద్ధం జరిగినట్లుగా భావించగల అవకాశంలేదు" అన్నారు డా॥ శంకాలియా.

"భారతయుద్ధం యథార్థతకు, దాని ప్రాచీనతకు సంబంధించిన ఆధారాలు, వైదిక వాఙ్మయంలో ఉన్నాయి" అని వాదిస్తున్నారు డాక్టర్ మిరాషి.

"మహాభారత యుద్ధం క్రీస్తుపూర్వం తొమ్మిదివందల ప్రాంతంలో జరిగినట్లుగా సాక్ష్యాధారాలు లభించా" యంటున్నారు ప్రొఫెసర్ బి. బి. లాల్.

"ఇంతవరకు పాంచాల ప్రాంతంలో కొన్ని రాగిరేకులు, హస్తినాపురప్రాంతంలో కొన్ని బూడిదరంగు మట్టి పాత్రలు దొరికాయి. వీటిని బట్టి 1400 బి సి. నాటికే ఆ ప్రాంతంలో పట్టణ నాగరికత కలదని నిరూపించడానికి గాని, 900 బి.సి నాడు కురుక్షేత్ర యుద్ధం జరిగి దని చెప్పడానికిగాని, సాధ్యపడదు" అన్నారు జగత్పతి జోషి.

రామాయణ, మహాభారత గాథలకు ఏవైనా చారిత్రక ఆధారాలున్నాయా, లేవా, అనే విషయాన్ని పరిశీలించేందుకు ఉత్తరప్రదేశ్ ఆర్కియాలాజికల్ డిపార్టుమెంటు, జీవాజీ యూనివర్సిటీ, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియావారు కలసి, ఒక పెద్ద కార్యక్రమాన్ని చేపట్టారు.

భారత గాథకు సంబంధించిన హస్తినాపురం. మధుర, కురుక్షేత్ర ప్రాంతాలలో కొన్ని త్రవ్వకాలు జరిగాయి. రామాయణ గాథకు సంబంధించిన అయోధ్య, శృంగవరపురం మున్నగు చోట్లకూడా త్రవ్వకాలను ప్రారంభించారు. కాని, రామాయణ, భారత గాథల విషయంలో ఇవమిత్థంగా తేల్చి చెప్పడానికి తగిన సాక్ష్యాధారాలు ఇంతవరకూ లభించలేదట.

ముందు త్రవ్వకాలు పూర్తి కావాలి. ఆపైన శ్రీ జగత్పతి జోషి చెప్పినట్లుగా, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు సమావేశమై, సముచితమైన నిర్ణయాలు చేయాలి. అలాంటి నిర్ణయాలు మన చరిత్రను తెలుసుకోడానికి ఉపయోగపడతాయి.

అయినా, అప్పుడుకూడా కొందరు ఆ నిర్ణయాలతో ఏకీభవించక పోవచ్చు పురాణాలపైన నమ్మకమున్నవాడు, శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిరూపించిన వాటిని సహితం అంగీకరించకపోవచ్చు.

శతావధానాలు

పైగా రామాయణం, మహాభారతం కూడా అనేక రూపాలు ధరించాయి. వాటిలో అనేక ప్రక్షిప్తాలున్నాయి. రాతియుగం నాటి ఏశేషాలనుండీ క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దం నాటి విశేషాలవరకూ, వాటిలో కనుపిస్తున్నాయి. రెండింటిలోనూ అభూత కల్పనలున్నాయి. వీటిని అక్షరాలా నమ్ముతున్నవారున్నారు.

శతకోటి శ్లోక పరిమితమైన రామాయణం, దేవగంధర్వాదిలోకములందు యాభై కోట్లు, పదికోట్లు, ఒక కోటిగా వ్యాపించి, మానవలోకంలో ఇరవైనాలుగువేల శ్లోకములతో కూడిన గ్రంథం మాత్రమే విస్తరించిందని బ్రహ్మాండ పారాశర్యోప పురాణాలను చూపించి వాదిస్తున్నవారున్నారు.

హనుమంతుడు ధనుష్కోటిలో ఎగిరి లంకలో దూకాడని, ఆ సమయంలో ఆయన శరీరం నుండి జారి సముద్రంలో పడిన చెమట బొట్టును ఒక చేప మింగగా, దానికి మత్స్య వల్లభుడు పుట్టాడని నమ్మి తున్న వారు, దేనినైనా నమ్ముతారు గదా!

రామాయణం ఇరుపది నాలుగువేల శ్లోక పరిమితమని, గాయత్రీ మంత్రములోని ఇరవైనాలుగు అక్షరములు క్రమముగా ఒక్కొక్క శ్లోక సహస్రము మొదట నున్నాయని, గాయత్రీ రామాయణంలో వున్నది. అంతేకాని, శతకోటి శ్లోక ప్రస్తి దానిలో లేదు.

సంస్కృత రామాయణంలోని ఇరవైనాలుగువేల శ్లోకాలలోను, కేవలం పదివేల శ్లోకాలు మాత్రమే వాల్మీకి మహర్షివని, తక్కిన పదిన మిదివేల శ్లోకాలు ఇతరులు వ్రాసి రామాయణంలో చేర్చినవని జాకోబి, వైద్యా ప్రభృతులు ఎత్తి చూపించారు.

పైగా, సంస్కృత రామాయణంలో అనేక పాఠభేదా లున్నాయి. ఇతర పాఠాల విషయమలా వుంచినా, ముఖ్యమైన బొంబాయి పాఠానికి, కాశ్మీర్ పాఠానికీ, బెంగాల్ పాఠానికీ మధ్య అనేక భేదాలున్నాయి.

"వీటిలో దాదాపు ఎనిమిదివేల శ్లోకాల వరకూ ఒక పాఠంలో నున్నవి. మరొక పాఠంలో లేవు. ఒకదానిలోనున్న సర్గలు మరొకదానిలో లేవు" అని జాకోబి రుజువు చేశారు.

వాల్మీకి రామాయణంతోపాటు భవభూతి రచించిన ఉత్తర రామ చరిత. భాస్కర రామాయణం, రంగనాథ, వరవరాది, మొల్ల, కంబ కృత్తిదాస, తులసీ రామాయణా లంటివి అనేక మున్నాయి. కాళిదాసు రచించిన రఘువంశముంది.

మహేశ్వర తీర్థులు, గోవిందరాజు, కందాళ రామానుజుడు, వనమ బ్రహ్మ విద్యాధ్వరి, అహోబల సూరి,విశ్వనాధ దీక్షితులు, రంగాచార్యులు వెంకటసూరి మున్నగు పండితులు రచించిన వ్యాఖ్య లున్నాయి.

అధ్యాత్మ రామాయణ కీర్తనలు, రామహృదయం, రామగీత లున్నాయి.విదేశీయుల అనువాదా లున్నాయి. అనుకరణ లున్నాయి. రక రకాల రామకథ లున్నాయి.

రామాయణ మొక కావ్యం కాదిట్టి నిజా నిజాలతో నిమిత్త లేకుండా, ఎవరికివారే తమ కిష్టమైన రీతిలో రచనలు చేశారు. కనుక ఒక రచనతో మరొక రచన భేదిస్తోంది.

నేడు కూడా "ఔచిత్యం" పేరుతో రకరకాల రామాయణాలు, అందుకు సంబంధించిన కథలు వెలువడుతున్నాయి.

కాగా వాల్మీకి రామాయణం అనేక రూపాలు ధరించింది. బాల్య, కౌమార, యౌవ్వన దశలు దాటేటప్పటికే ఒక మహా వటవృక్షంలా పెరిగింది. ఏది మొదలో ? ఏవి ఊడలో ? తెలియరానంతగా విస్తరించింది. జైన కథలలో, బౌద్ధ గాథలలో, పురాణాలలో చొరబడింది. పలు దేశాలకు ప్రాకిపోయింది.

ఇంతవరకూ, నారాయణుడు తొమ్మిది అవతారా లెత్తాడట. ఇక ముందెప్పుడో పదో అవతారం ఎత్తుతాడట ; కాని, రామాయణం ఇప్పటికే శతావతారా లేత్తింది.

రామాయణం మాత్రమే కాదు. భారతం కూడా ఇలాంటిదే. ఒక మంవంతరంలోని భారతంతో మరొక మండలంలోని భారతం సరిపోలదు.

వాల్మీకి రామాయణానికి ఉత్తర రామాయణాన్ని చేర్చినట్లే, భారతానికి, శాంతిపర్వముతో సహా ఏడు పర్వాలను చేర్చారు. రామాయణంలోని బాలకాండ వలెనే, భారతంలోని అరణ్యపర్వాన్ని విస్తరించారు.

భారతంలో భగవద్గీతను చేర్చితే, రామాయణంలో రామ గీతను చేర్చారు. కృష్ణ భక్తులు హరివంశాన్ని సృష్టిస్తే, రామభక్తులు ఆధ్యాత్మ రామాయణాన్ని సృష్టించారు.

వాల్మీకి పేరనున్న రామాయణంలో నాలుగింట మూడువంతుల వరకూ ఇతరులు రచించి మూల పాఠానికి చేర్చినట్లుగానే వేద వ్యాసుని పేర చెల్లుతున్న మహాభారత లో డెబ్భై ఆరు వేల శ్లోకాలను రచించి మూల పాఠంలో కలిపారు. ఎలాగైతేనేం? రామాయణం ఇరవై నాలుగువేల శ్లోక పరిమితమైతే, మహాభారతం లక్ష శ్లోక పరిమితమై కూర్చుంది.

రామాయణం వలెనే భారతం కూడా కొంతకాలంవరకూ గ్రంథస్థం కాలేదు. రామకథను కుశలవులు గానం చేసినట్లుగానే, భారత కథను

సూతులు చెప్పారు. తరువాత కొంత కాలానికి భారతం గ్రంథస్థమైంది. అటు పిమ్మట రామాయణం కూడా గ్రంథస్థమైంది.

గ్రంథస్థమైన పిమ్మట కూడా భారత, రామాయణాలు రెండూ పలు విధాలుగా మారాయి. కారణం? ఇవి రెండూ కథలే. పురాణాలే. కాని, చరిత్రలు కావు. కనుకనే ఎవరి ఇష్టం వచ్చినట్లుగా వారు వాటిని మార్చివేశారు. మాప్పులు, చేర్పు లన్నింటినీ అటు వాల్మీకి మహర్షికీ, ఇటు వేదవ్యాసునకూ అంటగట్టారు.

• మహాభారత గ్రంథకర్త ఎవరు ? •

వ్యాసుడా? వ్యాసుడనునది బిరుదు నామంగదా? వేదవిభజనచేసిన వ్యాసుడందామా? అలాంటి వేద వ్యాసులు ఇరవై ఎనిమిది మందున్నారు. పరాశర పుత్రుడైన వేదవ్యాసుడందామా? పరాశరులు ముగ్గురున్నలుగురున్నారు కదా?

గంగానదీ ద్వీపంలో పరాశరునకు, మత్స్య గంధికి జన్మించిన కృష్ణద్వైపాయనుడను పేరుగల వేదవ్యాసుడే, భారత గ్రంథ కర్తయని పలువురు విశ్వసిస్తున్నారు.

కాని, ఇరవై ఆరవ ద్వాపర యుగంలోని పరాశరునకు ఇరవై యెనిమిదవ ద్వాపర యుగంలో ద్వైపాయనుడు జన్మించాడని ఎలా చెప్పగలరు? పోనీ పరాశర ద్వైపాయనులు బ్రహ్మర్షులు కాబట్టి చిరకాలం జీవించగలిగారంటారా? ద్వైపాయనుని కన్నతల్లియైన సత్యవతి మాటేమిటి? ఆమెకూడా మూడు ద్వాపర యుగాలు గడచి సుదీర్ఘ కాలం నవయౌవ్వనవతిగా జీవించిందా?

పోనీ, సి.వి. వైద్యావంటి పండితులు ఊహించి నట్లుగా, తైత్తిరీయారణ్యకంలో పేర్కొనబడిన పారాశర్య వ్యాస, వైశంపాయనులు భారత రచన ప్రవచనకర్తలని అంగీకరించవచ్చునా: అంటే అదీ కుదరడం లేదు.

"తైత్తిరీయారణ్యకంలో పారాశర్య వ్యాసుడని ఉన్నదే కాని, కృష్ణ ద్వైపాయను డనేమాట కనుపించటం లేదు. పైగా, భారత సంహిత తైత్తిరీయారణ్యకం నాటి దేనిని రుజువు చేయడం కష్టం" అన్నారు. శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రి.

కొంచెమైనా భారత గ్రంథ కర్తయైన వారెవరో సరిగా చెప్పడంసాధ్యమైన పని.

వాల్మీకి మహర్షి ఎప్పటి వాడు?

ఇంత సంధిగ్ధంగా లేనప్పటికీ, రామాయణ కావ్య కర్తయైన వాల్మీకి ఎవరు? ఏ కాలం వారు? అని కూడా కొంత సందేహం కలుగక మానదు.

ఇరవై నాల్గవ వేదవ్యాసుడు, వాల్మీకి అనే పేరుగల ఋషిగని, ఇరవై ఎనిమిదవ వ్యాసుడు కృష్ణ ద్వైపాయనుడని విష్ణు పురాణంలో స్పష్టంగా వుంది. కూర్మ పురాణంలో ఋషి, భార్గవ నామములకు బదులుగా వాల్మీకి పేరు కనిపిస్తున్నది. తైత్తిరీయోపనిషత్తును చూస్తే, వరుణవంశమువాడు, భృగు వంశమువాడు అయిన వాల్మీకి ఒకడేనని తెలుస్తోంది. పైగా, "కుశీలవుడు" అనగా వాల్మీకి అని కూడా నిఘంటువులు చాటుతున్నాయి.

వైవస్వత మన్వంతరంలోని ఇరవై నాల్గవ ద్వాపరంలో వాల్మీకి జన్మించి, వేద విభజన చేసి, వేదవ్యాసుడుగా వినుతి కెక్కడమే గాక, రామాయణ మహాకావ్యాన్నికూడా రచించి వున్నట్లయితే, ఆ పని జరిగి నేటికి దాదాపు కోటి డెబ్భై అయిదు లక్షల సంవత్సరాలు గడిచి వుండాలి. ఇది అంగీకరించ దగిన విషయమేనా? పైగా? ఆయన గారొక ప్రాకృత వ్యాకరణమునుకూడా రచించెనని త్రివిక్రమ, హేమచంద్ర, సింహరాజ, లక్ష్మీధర శాస్త్రి వంటి పండితులు చెప్పారు కదా?

రామాయణ మహా కావ్యం అత్యంత ప్రాచీన మైనదని చెప్పుకునేందుకై వాల్మీకి మహాకవి ఇరవై నాలుగవ ద్వాపరం లోనో, అంతకు మరికొంత ముందుగానో, జన్మించాడని కథ లల్లారు. ఇరవై ఎనిమిదవ ద్వాపరంలో పారాశరుడు జన్మించి, వేద విభజన చేసి, ఆ పైన పంచమ వేద మనదగిన భారత సంహితను రచించాడని అందరు పండితులు వ్రాస్తే, వాల్మీకిమహర్షి ఇరవై నాలుగవ

ద్వాపరంలోనే జన్మించి, వేదవిభజన చేయడంతోపాటు, రామాయణ మహాకావ్యాన్ని కూడా రచించాడని మరికొందరు పండితులు వ్రాశారు.

భారతం అరవై లక్షల శ్లోక పరితమంటే, రామాయణం శతకోటి శ్లోక పరిమిత మన్నారు.

ఇలా ఒకదానితో ఒకటి పొసగని వ్రాతల ఆధారంతో, భారత యుద్ధ యథార్థతను, దాని ప్రాచీనతను డా॥ మిరాషిగాని మరొకరు గానీ ఋజువు చేయ గలరా? రామకథ త్రేతాయుగం నాటిదని నిరూపించగలరా? వైదిక వాఙ్మయంలోనే అన్నీ వున్నాయని చెప్పినంత మాత్రాన సరి పోతుందా?

రామాయణంగాని, మహాభారతంగాని ఎప్పుడు పుట్టాయో? ఎలా పెరిగాయో? వాటిలోని కథలు వాస్తవమో? కాదో? తెలుసుకోవాలంటే, కేవలం వేదాలపైనా, పురాణాల పైనా ఆధార పడినంత మాత్రాన ప్రయోజన ముండదు.

వీటిని తెలుసుకోవాలంటే, పూర్వ రాతియుగం నుండి నేటివరకూ ఉత్పత్తి సాధనా లెలా పెరిగాయో చూడాలి. ఆహార సేకరణ దశనుండి మానవుడు ఆహారోత్పత్తి దశకు చేరగలిగిందెప్పుడో గమనించాలి. అటవిక దశలోనున్న తెగల సంఘ నియమాలు, ఆచారాలు, అనాగరిక దశలో నున్న తెగల వృత్తులు, ఆచారాలు ఎలాంటివో గ్రహించాలి. నాగరిక దశలో అడుగిడి పురోగమిస్తున్న జాతుల సంప్రదాయాలు,ధర్మసూత్రాలు ఎలా మారి పోతున్నాయో అర్థం చేసుకోవాలి. లేనిచో, సరిౖెన నిర్ణయాలు చేయడం సాధ్యపడదు.

ఎందువల్లనగా? "జీవనాధార వస్తువుల విస్తరణా, మానవజాతి పరిణామక్రమంలోని ప్రధాన యుగాలూ, యించుమించుగా కలిసి వున్నాయని చెప్పవచ్చు" అన్నారు మోర్గన్.

కాబట్టి, ఆయా యుగాలలోని దశలను,ఆ దశలలో జరిగిన అవసర వస్తువుల ఉత్పత్తిని, స్త్రీ, పురుష సంబంధాలను, తత్వ సూత్రాలను ముందు పరిశీలిద్దాం.

• మానవ వికాస పరిణామ క్రమంలో ప్రధాన యుగాలు

అమ్ఘతమేధాశక్తి సంపన్నుడైన మోర్గన్, మానవజాతి చరిత్ర నొక క్రమపద్ధతిలో రచించడానికి చాలా శ్రమించారు. 1875 వరకూ వివిధ ఖండాలలో నివసిస్తున్న తెగల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, విశ్వాసాలను నిశితంగా పరిశీలించారు. ఆటవిక యుగం నుండి, అనాగరిక యుగంద్వారా, నాగరిక యుగంలో అడుగిడిన మానవుడు పొందగలిగిన క్రమవికాసంపై అనేక పరిశోధనలు చేశారు. ఆ అనుభవంతో "ప్రాచీన సమాజం" అన్న గ్రంథాన్ని రచించారు.

జీవశాస్త్రానికి పరిణామ సిద్ధాంతం ఎంత ముఖ్యమైనదో, అర్థశాస్త్రానికి అదనపు విలువ సిద్ధాంతం ఎంతముఖ్యమో, పితృస్వామిక సమాజానికి ముందు మాతృస్వామిక సమాజ ముండేదని, మోర్గన్ కనిపెట్టిన విషయం కూడా అంతముఖ్యమైనదే. కనుకనే, కుటుంబ వ్యవస్థయొక్క పరిణామ క్రమంలో వచ్చిన ప్రధాన దశలను ఆయన సవివరంగా చిత్రించగలిగారు.

సమశీతోష్ణ మండలాలలో పుట్టి పెరిగిన మానవుడు తన రక్షణ కొరకు, కొన్నివేల సంవత్సరాలపాటు చెట్లమీదను, గుహలలోను నివసించాడు. పళ్ళు, కాయలు, ఆకులు, దుంపలు తిని బ్రతికాడు. క్రమంగా శబ్దోచ్చారణలో విస్పష్టతను సాధించి, విజయ మందాడు. ఇదే మానవ జాతియొక్క శైశవదశ. ఈ దశనే ఆటవిక యుగంలోని ప్రథమ దశగా మోర్గన్ పేర్కొన్నాడు.

అడవులు మండిపోతోంటే, తప్పించుకోలేక, కాలిపోయిన జంతువుల మాంసాన్ని, మానవుడు రుచి చూచాడు. ఒరిపిడిద్వారా నిప్పు

పుట్టించాడు. పిండి పదార్థం, ఎక్కువగా లభ్యమయ్యే దుంపలను, కుమ్మలో ఉడకబెట్టి భక్షించాడు. చేపలను కాల్చుకు తిన్నాడు. రాతి పనిముట్లను తయారు చేయడం నేర్చుకున్నాడు. ఆ పైన గదను, ఈటెను తయారు చేశాడు. వాటితో జంతువులను వేటాడాడు. ఆహారం లభించనప్పుడు, ఉగ్ర దేవతలకు బలులు సమర్పించినప్పుడు నర మాంస భక్షణకుకూడా సిద్ధపడ్డాడు నదుల వెంట, సముద్రాల వెంటబడి పోతూ సుదూర ప్రాంతాలకు విస్తరించాడు. మోర్గన్ నిర్ణయం ప్రకారం ఇది ఆటవిక యుగంలోని ద్వితీయ దశ.

విల్లూ, అంబూ కనిపెట్టడంతో ఆటవిక యుగంలోని తృతీయ దశ ఆరంభమైంది. ఈదశలో మానవుడు కర్రతో పనిముట్లు,పాత్రలు తయారు చేయడం నేర్చుకున్నాడు. పదునుగల రాతి పనిముట్లను రాతి గొడ్డలిని సంపాదించుకున్నాడు. వడపలతో బుట్టల నల్లుకున్నాడు. ఇుర్రదోనెలను తయారుచేయడం, వాసాలతో దూలాలతో ఇళ్లు కట్టడం నేర్చుకున్నాడు. చెట్ల బెరడు నుంచి నారతీసి, నార బట్టలు తయారు చేసుకున్నాడు. అటు పైన కుండలు తయారు చేయడం కూడా నేర్చుకొని అనాగరిక యుగపు ప్రథమదశలో అడుగుపెట్టాడు.

పశువులను మచ్చిక చేసి, మందలను పెంచడంతో అనాగరిక యుగపు ద్వితీయ దశ ఆరంభమైంది. పశు సంపదను సమకూర్చుకున్న వారు ఇతరులకంటే బాగా వృద్ధి పొందగలిగారు. పాలు, వెన్నా, మాంసము వారికి సమృద్ధిగా లభించాయి.అవే వారికి పుష్టి నిచ్చాయి.

అంతవరకూ మానవ సమాజం మాతృస్వామిక దశలోనే ఉండిపోయింది. తనకవసరమైన దాని కన్నా మానవుడు అధికంగా ఉత్పత్తి చేయగలిగేంతవరకూ, మాతృస్వామిక సమాజమే కొనసాగింది.

పితృ స్వామిక సమాజానికిముందు మాతృస్వామిక సమాజ మున్నదనే సత్యాన్ని "ప్రమీలార్జునీయం" కథ రుజువు చేస్తోందిగదా? కేరళలో నేటికీ మాతృస్వామిక సమాజ చిహ్నాలు కొన్ని కనిపిస్తున్నాయి గదా ?

పశువుల పెంపకం ప్రారంభమైన దశలో, మందలన్నీ గణ సభ్యుల ఉమ్మడి ఆస్తిగా వుండేవి. అలా కొంతకాలం గడిచిన పిమ్మట

జనాభా పెరిగింది. పశువుల మందలు పెరిగాయి. పెరిగిన మందలను ఉమ్మడి కుటుంబాలవారీగా పంచుకున్నారు. అంతటితో సాముదాయక పశు సంపద, ఉమ్మడి కుటుంబ సంపదగా మారిపోయింది.

ఆ దశలో ఇంటిపనులు స్త్రీలు చేస్తోంచే, బయటి పనులు పురుషులు చేసేవారు. అవిధంగా, మానవజాతి చరిత్రలో మొట్టమొదటి సారిగా స్త్రీ- పురుషుల మధ్య శ్రమ విభజన జరిగింది.

వంట చేయడం, బట్టలు తయారు చేసుడం, ఇంటి దగ్గరలో పండ్ల మొక్కలు పెంచడం స్త్రీల పని. పశువులను మేపడం, వాటిని కాపాడడం, పాలతోపాటు విదురు బియ్యం,కొండతేనె, వేటమాంసంలాంటి ఆహార పదార్థాలను సమకూర్చడం పురుషుల పని. కాగా, ఆ దశలో ఇంటి పైత్తనం స్త్రీలదైనప్పటికీ, ఆహారోత్పత్తికి అవసరమైన పశువులు, పనిముట్లు, రక్షణకు అవసరమైన ఆయుధాలు పురుషుల చేతుల్లో వుండేవి.

కాబట్టి, వాటిని తమకు పుట్టిన బిడ్డలకే ఇచ్చుకోవాలన్న కాంక్ష పురుషులకు కలిగింది. కాని, మాతృ స్వామిక సమాజంలో అదెలా సాధ్యమౌతుంది? పిల్లల తల్లి ఎవరో తెలుస్తుంది, కాని తండ్రి ఎవరో తెలిచ్చుదు గదా? అందుచేత స్త్రీ-ఒకే పురుషునితో కాపురం చేయాలన్న నిబంధనను పశుపాలకులు ప్రవేశపెట్టారు. పురుషులకు మాత్రం అలాంటి నిబంధన లేవీ లేవు సరిగదా, పోషించగల పురుషుడు ఎందరు స్త్రీలనైనా పొందగలిగేవాడు.

ఈవిధంగా సంపదగల పురుషులు విధించిన నిబంధనను సంపద లేని స్త్రీలు ఆమోదించవలసివచ్చింది. ఏంగెల్స్ చెప్పినట్లుగా, స్త్రీలకు చరిత్రాత్మకమైన ఓటమి సంభవించిం దీ దశలోనే.

అప్పటినుండీ స్త్రీలు, పురుషుల అదుపు ఆజ్ఞలలో వుండిపోయారు. పిల్లల తండ్రి ఎవరో తెలుసుకోవడానికి వీలయింది. వంశ పరంపరను తండ్రివైపు నుండి గుర్తించారు. మాతృస్వామిక సమాజం, పితృస్వామిక సమాజంగా మారిపోయింది.

తన కవసరమైన ఆహారాన్ని మానవుడు స్వయంగా ఉత్పత్తి జేసుకోవడం పశువుల మందల పెంపకంతోనే ప్రారంభమైంది. ఆహార

పదార్థాలను ఉత్పత్తి చేయగలగడం వల్లనే, ఉత్పత్తి వనరులపైన ఇతర జీవరాసులకు లేని ఆధిక్యత మానవునకు లభించింది.

తన కవసరమైన దానికన్నా అధికంగా మానవుడు ఉత్పత్తి జేయగలగడంతో సంపద పెరిగింది. సంపదపై యాజమాన్యం గల పురుషులు, స్త్రీలను వెనుకకు నెట్టారు. స్త్రీ-పురుషుల మధ్య శ్రమ విభజనతోపాటు, ఆస్తిపాస్తుల పంపకం ప్రారంభమైంది.

ఇసుమును కనిపెట్టడంతో అనాగరిక యుగత్రుతీయ దశ ప్రారంభమైంది. నాగటిని తయారు జేసుకొని వ్యవసాయం ప్రారంభించిన వారు పంటలకు అనువైన ప్రాంతాలలో స్థిరపడ్డారు. వారి పంట పిరి, పశు సంపద పెరిగాయి. వాటిని వెనుకబడిన తెగలవారు దోచుకోకుండా కాపాడు కునేందుకు వల్లెల చుట్టూ ప్రాకారాలు నిర్మించారు. క్రమంగా ప్రాకారాల మధ్య పట్టణాలు వెలశాయి. అవే నగరాలు. నగర ప్రజల సంస్కృతే నాగరికత; ఆవిధంగా నాగరికయుగ ప్రాంగణంలో కృషీవలులు తమ పాదం మోపారు.

ఆ దశలో సిరి సంపదలు గల పురుషుడూ, శత్రువులతో పోరాడి ఓడించగలిగిన వీరుడు పలువురు భార్యలనుచేసుకున్నారు.ఉపపత్నులనుంచు కున్నారు.తాము సంపాదించకున్న ఆస్తిని,తమకు నచ్చినవారికిచ్చుకున్నారు. ఎవరికీ ఇవ్వకుండా చనిపోయిన వాని సంపద, వాని పెద్ద కొడుకుకు దక్కింది. అటు తరువాత బిడ్డలందరికీ సంక్రమించింది. మరి కొంతకాలం గడిచేటప్పటికి మగపిల్లలున్న ఇంట్లో ఆడపిల్లలకు వాటా లేకుండా చేశారు. ఈనాడు పితృ వంశ పరంపరగా సంక్రమిస్తున్న వారసత్వపు హక్కు ఆ విధంగా ప్రారంభమైనదే.

కాబట్టి, కనీసం పశుసంపదైనా వృద్ధి పొందక్షమించు రామాయణ, మహాభారత గాథలకు మూలమైన రాజ్యకాంక్షకు అవకాశం లేదనట. స్పష్టమేగదా?అయినా,వాటిలో ఆటవికుల ఆచారసంప్రదాయాలు ఆలోచనా ధోరణులు, ఆయుధాలు, ప్రకృతిశక్తులు, వాటిపూజలు అనాగరికుల బహు భర్తృత్వం, దేవరన్యాయం.అతిథి మర్యాదలాంటి వెన్నో కనిపిస్తున్నాయి. కాబట్టి రామాయణ మహాభారతాలపై అనేక విమర్శ లొచ్చాయి.

"రామాయణం రంకు, భారతం బొంకు"అని నిందించేందుకు కూడా కొంచెం వెనకాడడం లేదు.

• మరొక దృక్పథం గల వారున్నారు. వీరెంత వరకూ ప్రాచీన మానవ సమాజ చరిత్రను విడిచిపెట్టి, ప్రతివిషయాన్నీ దేవునకు, దేవతలకు, శాపాలకు వరాలకు ముడి పెడుతుంటారు. వర్తమాన కాలంకంటే, గతించిన కాలమే మంచివని వాదిస్తుంటారు. రాను, రాను పాపం పెరిగి పోతోందని బాధ పడుతుంటారు.

కాబట్టి, రామాయణ, మహాభారత గాథలను సరిగా అర్థం చేసుకోవాలంటే ఆటవిక యుగం నుండీ నేటి వరకూ స్త్రీ పురుష సంబంధాలలో ఎలాంటి మార్పులు జరిగాయో; తత్వ శాస్త్రంలో భావవాద సిద్ధాంతా లెలా పెరిగాయో; తెలుసు కోవడం అవసరం.

మానవావిర్భావం-

స్త్రీ-పురుష సంబంధాలలో మార్పులు

"దాదాపుగా రెండు వందల కోట్ల సంవత్సరాల క్రితం సముద్ర జలాలలో జీవరాసి ఆవిర్భవించింది. సాగర జీవరాసులనుండి, భూమిపై నివసిస్తున్న పశు, పక్షి. ఫణ్యాదులు ప్రభవించాయి. అల్లా ప్రభవించిన వానర జాతులలో కొన్నింటి రూపాలు, పరిణామ క్రమంలో మారి మారి మానవ రూపాలుధరించాయి"అని పరిణామసిద్ధాంత వేత్తలు చెపుతున్నారు. అలా ప్రతిఫలించినవారే ఆది మానవులు. వారే మన పూర్వులు.

ఆది మానవులు చాలా బలహీనులు. రక్షణకు అవసరమైన రాతి గొడ్డలివంటి ఆయుధాలైనా వారికి లేవు. కనుకనే వారు గుంపులు, గుంపు లుగా కలసి జీవించారు.

ఆనాడు, వారికి వావి వరుసలు లేవు. అన్నా-చెల్లెలూ అనే విచక్షణ లేదు. వివాహాలు లేవు. పిల్లలకు తండ్రి ఎవరో? తెలుసుకునే అవకాశం లేదు. తల్లి మాత్రమే తెలుసు. కొబ్బి ఒక తల్లి బిడ్డలు, ఆమె కుమార్తెల బిడ్డలు, మనుమరాళ్ళ బిడ్డలు కలసి నివసించారు. తల్లి మాట విన్నారు.

గుంపు మరీ పెద్దదైనప్పుడు రెండుగా చీలిపోయేది. చీలిపోయిన గుంపుకు మూలమైన మరొక వృద్ధ వనిత నాయకత్వం వహించేది.

గుంపుల సంఖ్య పెరిగినప్పుడు, రక్త సంబంధం గల గుంపులన్నీ కలసి ఒక తెగగా జీవించాయి. గుంపుపేరు "గణం"గా మారింది. గణ పెద్దయైన వృద్ధ వనితతో పాటు ప్రకృతి శక్తులను పూజించే గణాచారిణికి కూడా అధికృత లభించింది.

ఏవైనా సమస్యలు పొడసూపినప్పుడు, గణంలోని స్త్రీ పురుషులందరూ కలసి చర్చించి గణవ్యవహారాలను పరిష్కరించేవారు. వారు చేసిన నిర్ణయాలను అమలు పరచడానికి గణపెద్దకు తోడుగా మరికొంచరు పెద్దలను ఎన్నుకునేవారు అలా ఎన్నుకోబడిన పంచాయతీకి తగినంత అధికారముండేది. మొత్తం తెగకంతకూ సంబంధించిన సమస్యలను పరిష్కరించవలసి వచ్చినప్పుడు వివిధ గణాల పెద్దలంతా కలసి నిర్ణయాలు చేసేవారు.

ఆది మానవులు ఈ దశకు చేరడానికి కొన్ని వేల సంవత్సరాల కాలం పట్టింది. సుదీర్ఘమైన ఈ కాలంలో మానవాళి విస్తరించిన కొలదీ స్త్రీ-పురుష సంబంధాలలో కొన్ని కట్టుబాట్లొచ్చాయి. ముందు మొదటి తరం వారికీ, రెండవ తరం వారికీ మధ్య, తరువాత సోదరీ-సోదరుల మధ్య లైంగిక సంబంధాలను నిషేధించారు,-మరి కొంతకాలానికి ఒకే గణంలోని స్త్రీలకు - పురుషులకు మధ్య లైంగిక సంబంధాలుండడం మంచిది కాదని, కొన్ని తెగల వారు నిర్ణయించారు.

ఒకే గణంలోని స్త్రీ-పురుషుల కలయికవల్ల మంచి బిడ్డలు పుట్టరనీ, వేరు వేరు గణాలలోని స్త్రీ-పురుషుల కలయిక వల్ల దృఢగాత్రులు బుద్ధికుశలులైన బిడ్డలు పుడతారనీ భావించి, వారలా నిర్ణయించారు. ఆ నిర్ణయం మంచి ఫలితాల నిచ్చింది.

కాగా, ఒక గణంలోని స్త్రీలు, తమ తెగలోనే మరో గణానికి చెందిన పురుషులను ఆహ్వానించేవారు. పురుషులు స్త్రీల వద్దకు పోయి నివసించేవారు.

ఈ విధంగా, మాతృ స్వామిక సమాజంలో విధించబడిన నిషేధాలు, ఈనాటి సపిండ, సగోత్ర వివాహాల నిషేధానికి మూలమైనాయి.

ఒకే గణంలోని స్త్రీ-పురుషుల మధ్య సంబంధాలను కొన్ని తెగలు నిషేధించ లేదు. కాని, పితృ స్వామిక సమాజ మేర్పడిన పిమ్మట మేనరికాన్ని నిషేధించారు. ఒకే రక్తంగల సోదరీ-సోదరుల మధ్య లైంగిక సంబంధాలను నిషేధించి నట్లే: వారి బిడ్డలమధ్య సంబంధాలను కూడా నిషేధించడం పంచిదనుకున్నారు. అలాంటి తెగలలో అన్న చెల్లెళ్ళ బిడ్డల మధ్య సంబంధాలు కొన సాగాయి. అదే అంతర్వివాహ పద్ధతి.

ఒక గణంలోని స్త్రీలు-మరొక గణంలోని పురుషులు భార్యా భర్తలుగా వుండే పద్ధతి, బహిర్వివాహ పద్ధతి. ఈ పద్ధతుల ప్రకారం అన్నదమ్ముల బిడ్డల మధ్య, అక్కచెల్లెళ్ళ బిడ్డల మధ్య సంబంధాలుండ కూడదు. కాని, సోదరీ సోదరుల బిడ్డల మధ్య సంబంధాలు విషిద్ధం కాదు.

ఇలాంటి వివాహాలు, నిషేధాలు ఈ నాటికీ మన దేశంలో ఉన్నాయి గదా?

అన్నదమ్ముల బిడ్డల మధ్య సంబంధాలను నిషేధించిన వారు కూడా, కొన్ని సందర్భాలలో వాటిని అనుమతించారు. ఇలా అనుమతించడం పితృ స్వామిక సమాజ ఏర్పడిన పిమ్మట జరిగింది. ఉమ్మడి కుటుంబంలోని అన్నదమ్ములలో ఒకరికి ఆడ పిల్లలు మాత్రమే ఉన్నప్పుడు,ఆయనవాటా ఆస్తి, బయటివారికి దక్కకుండాచేసేందుకు, కుటుంబ సంపద చీలి పోకుండా చూసేందుకు, అలా అనుమతించారు.

ఇజ్రాయేలు తెగలో యోసేపు గోత్రం (గణం) లోనివాడైన "సెలోపెహాదు" అనుపేరుగలవానికి పుత్ర సంతానం లేదు. కాని, ఐదుగురు ఆడపిల్లలున్నారు. ఈ ఆడపిల్లలు మరొక గోత్రంలోని వానిని పెళ్ళి చేసుకుంటే, తమ ఆస్తి చేరిపోతుందనీ, ఆస్తిలో కొంత భాగం, ఈ ఆడపిల్లలను చేసుకున్న వారికి దక్కుతుందనీ, యోసేపు గోత్రం వారు బాధపడ్డారు. కాబట్టి సెలోపెహాదు కుమార్తెలు యోసేపు గోత్రంలోనే, తమకిష్టమైనవారిని పెళ్ళి చేసుకోవాలని, మోషే ఆజ్ఞాపించారు. కాను చెప్పింది ధైవసమ్మతమన్నారు, అంతట వారైదుగురూ తమ తండ్రి సహోదరుని కొడుకులను చేసుకున్నట్లుగా పాత నిబంధన గ్రంథంలో ఉంది.

సన్నిహిత రక్త సంబంధంగల వారిమధ్య, వివాహం మంచిది గాదనే విజ్ఞాన సూత్రాన్ని, సంపదపైనగల మమకారం ఏ విధంగా త్రోసి పుచ్చిందో, పై కథ పెల్లడిస్తోందిగదా?

సంపదపైనగల మమకారానికి వంశ గౌరవం తోడైంది. తమ ఆస్తి తమ రక్త సంబంధీకులకే దక్కాలనే కోరిక, దగ్గరి సంబంధమైతే, బిడ్డలు సుఖపడతారనే నమ్మకం పెరిగాయి. అన్నదమ్ముల బిడ్డలమధ్య,

సోదరీ సోదరుల సంతానం మధ్య ఇప్పటికీ వివాహాలు జరగడానికి ఇవే కారణం.

• ఒకప్పుడు ఒకే తండ్రికి పుట్టిన రాకుమారుడు, రాకుమార్తె వంపతులై, రాజు, రాజ్యాధికారం పట్టాభిషిక్తులవడానికి కూడా రాజ భోగాలపైగల వ్యామోహం, తప రక్తం గొప్పదనే దురహంకారం కారణమయ్యాయి. ఇందుకొక ఉదాహరణగా క్లియోపాత్రా వంశచరిత్రను తీసుకోవచ్చు. ఈ ఆచారం ఒకప్పుడున్నది గనుకనే, రాముడు, సీత అన్నాచెల్లెలై నట్లుగా చిత్రించిన రామకథ ఒకటి వెలువడింది.

ఈ విధంగా చారిత్రక సత్యాలను చాటే కథలు, గాథలెన్నో మన పురాణాలలోనూ వున్నాయి. కాని, భావవాదుల చేతుల్లో పడి అవి తమ సహజ రూపాన్ని కోల్పోయాయి.పరిణామ సిద్ధాంతాన్ని గానీ, పితృస్వామిక సమాజానికి ముందు మాతృ స్వామిక సమాజ మున్నదనే సత్యాన్ని గానీ, అంగీకరించని వారు వాటిని మార్చి వేశారు. ప్రతిగాథకు ఏదో ఒక శాపాన్ని లేదా వరాన్ని జోడించారు. పరిణామ సిద్ధాంతాన్ని క్రోసి పుచ్చటానికి అవతారాల సిద్ధాంతాన్ని రూపొందించారు. ఆటవిక, అనాగరిక యుగాలలోని సామాజిక ధర్మాలు,ఆచారాలు పచ్చిగావున్నాయని శాసించిన వారు కూడా భావ వాదులకు తోడ్పడ్డారు.

• సముద్రాలలో పుట్టిన జీవరాసులు, సముద్రజలాలలో మాత్రమే జీవించగలిగిన దశకు, పరిణామ సిద్ధాంత వేత్తలు "మత్స్యదశ" అని పేరు పెట్టారు. ఆ జీవరాసులు కొలది కాలం పాటు సముద్ర తీరాలలో కూడా బ్రతగలిగిన దశకు "కూర్మదశ" అని పేరు పెట్టారు. ఆ జీవరాసుల నుండి పశు, పక్షిజాతులు పరిణతి చెందిన పిమ్మటి దశను "వరాహదశ" అన్నారు మృగరూపం నుండి మానవ రూపం పరిణతి చెందుతున్న దశను "నరసింహ దశ" అన్నారు. ఆది మానవుడు ఆవిర్భవించిన దశను "వామన దశ" అనగా "మరుగుజ్జు" దశగా వర్ణించారు.

ఈ విధంగా పరిణామ సిద్ధాంత వేత్తలు విభజించిన పరిణామ దశలను, వారి సిద్ధాంతాలను భావవాదులు వ్యతిరేకించారు. మత్స్య,కూర్మ, వరాహాది పురాణాలు వ్రాశారు. రామలక్ష్మణుల, రావణ కుంభ కర్ణుల,

శుకు, పాండవుల జన్మలకు కూడా అవతారాల సిద్ధాంతాన్ని జోడించారు. అయినా, సత్యాన్ని పూర్తిగా కప్పి పెట్ట లేకపోయారు.

"జీవరాశి మొట్ట మొదట సముద్ర జలాలలో ఆవిర్భవించింది" అనిగదా పరిణామ వాదులు చెప్పింది?

పాల కడలిలో వట పత్ర శాయియై, యోగనిద్రా ముద్రితుడైన శ్రీమహావిష్ణువు, తన నాభి కమలం నుండి బ్రహ్మ దేవుని సృష్టించాడు. ఆ బ్రహ్మదేవుడు చరాచర ప్రపంచ మంతటినీ సృష్టించాడు.అని పురాణాలలో వ్రాశారు.

"దేవుని ఆత్మ జలములపైన అల్లాడు చుండెను .... దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి, వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నపుడు జీవాత్మ ఆయెను" అని, పాత నిబంధన గ్రంథం (బైబిల్)లో ఉంది.

అయితే ఈ ఆది మానవునకు లేదా? ఆ బ్రహ్మదేవునకు భార్య ఎవరు? వారి సంతానం ఎలా విస్తరించినట్లు?

"సృష్టికర్తయైన బ్రహ్మదేవుని దేహం రెండుగాచీలిపోగా అందొక భాగంనుండి స్వాయంభువ మనువును, మరొక భాగంనుండి శతరూప అను కన్యయూ జన్మించారు. వారిరువురకూ ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు పుట్టారు" అని భాగవతంలో వ్రాశారు.

"ఆదాము ప్రక్కఎముకనుండి ఒకముక్క తీసి యెహోవా అవ్వను సృష్టించాడు, ఆదాము అవ్వలకు ఇరువురు కుమారులు జన్మించారు." అని బైబిల్‌లో వ్రాశారు.

అయినా సోదరీ సోదరుల సంబంధాలను. తండ్రీ,కూతుళ్ళ సంబంధాలను కప్పిపెట్టలేక పోయారు.

"రుచి ప్రజాపతి" అనువాని భార్య పేరు "యాకూతి". వారికి "శ్రీయజ్ఞుండు" అను కుమారుడు, "దక్షిణ"యను కూతురు జన్మించారు. వారిరువురూ యుక్త వయస్కులైన పిమ్మట వివాహం చేసుకున్నారు. అయితేనేం? విష్ణుమూర్తి శ్రీయజ్ఞుండుగా, లక్ష్మీదేవి దక్షిణగా జన్మించి నందున వారిరువురి పరిణయం నిషిద్ధంకాదని భాగవతంలో వివరించారు.

అబ్రహాము భార్య శారా, వారిద్దరికీ తండ్రి ఒకడే. కాని, తల్లులు మాత్రం వేరు. అయినా, వారి సంబంధం తప్పుకాదు. ఎందువల్లవంటే ఆరోజుల్లో అలాంటి సంబంధాలున్నాయి. కాబట్టి, వాటి నెవరూ దాచి పెట్టలేదు. కాని, అబ్రహాము, శారా లిరువురూ యెహోవా అనుగ్రహం పొందగలిగిన వారని మాత్రం పాత నిబంధన గ్రంధంలో వివరించారు.

మన పురాణాలలోనూ, భారత రామాయణాలలోను సర్వత్రా అధ్యాత్మికవాదుల అవతార సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, దేవదానవుల పుట్టుకలు, పోరాటాలు కన్పిస్తాయి. బైబిల్‌లో ఈ సిద్ధాంతాలు కనిపించవు. భగవంతుడైన యెహోవా ఆయన దూతలు మాత్రమే కనిపిస్తారు కనుకనే, మానవ సమాజ చరిత్రను తెలుసుకోడానికి పురాణాలకంటే బైబిల్ బాగా ఉపయోగపడుతోంది.

అబ్రహాము-శారాల సంబంధంతోపాటు "లోతు" కుమార్తె లిరువురూ లోతుతోనే శయనించి కొడుకులను కన్న విషయం కూడా బైబిల్‌లో స్పష్టంగా వుంది.

అబ్రహాము తమ్ముడి కుమారుడైన లోతు,కారణాంతరాల వలన తన ఇరువురు కుమార్తెలతోను కలసి, కొండల్లో నివసించవలసి వచ్చింది. ఆ సమయంలో ఆయన పెద్దకూతురు సంతానార్థియై వేరొక పురుషుని పొందు లభ్యమయ్యే అవకాశం లేక, కన్న తండ్రితోనే శయనించింది. అంతట, మోయాబీయుల మూల పురుషుడైన "మోయాబు" జన్మించాడు ఆ తరువాత లోతు చిన్నకూతురు కూడా ఆయనతో శయనించగా, అమ్మోనీయుల మూల పురుషుడైన "బెన్నమ్మి" జన్మించాడు. ఇంత జరిగినా తన కుమార్తెలతో శయనించిన విషయం లోతుకు తెలియదట. ఎందువల్లనంటే? లోతుకు మస్తుగా ద్రాక్షరసమిచ్చిన పిమ్మటనే, ఆయన కుమార్తెలాపని చేశారట. ఎలా గైతేనేం?మానవజాతి విస్తరణకు అపని తోడ్పడింది గదా?ఆకాలంలో ఆదే ముఖ్యం.ఎందువల్లనంటే. మానవాళి విస్తరణ అంత సులభంగా జరగలేదు. ఎన్నో ఆటు పోటుల నెదుర్కొనవలసి వచ్చింది.

అంటు వ్యాధుల బారిపడి నశించడమేగాక, ఆటవిక యుగంలోని మానవులు, ఆహారంకొరకు అలమటించి పోయేవారు.ప్రకృతి ప్రసాదించిన

ఆహారాన్ని సేకరించి, భుజించడం మాత్రమే వారికి తెలుసు. ధాన్యం, పళ్ళు, పాలు మున్నగు ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడం వారికి తెలియదు. కాబట్టి ఆహారం కరువైన ప్రాంతాల నుండి, ఆహారం లభించే ప్రాంతాలకు వలస పోయేవారు. అలా వలస పోయిన ప్రాంతాలలో జన సంచారం లేక పోతే ఏ బాధా వుండేది కాదు. కానీ అప్పటికే ఏదో ఒక తెగవారు అక్కడ నివసిస్తోంటే, వారికీ, కొత్తగావలస వచ్చిన వారికీ మధ్య పోరాటాలు జరిగేవి. గెలిచిన వారు ఓడిన వారిని ఊచకోత కోసి పారేసేవారు. ఎందువల్లనంటే ఉభయ పక్షాల వారూ జీవించి వుంటే, ప్రకృతి ప్రసాదించిన ఆహారం చాలదు కాబట్టి అలా చంపేసేవారు.

అందువల్ల, ప్రకృతి ప్రసాదించిన ఆహారానికి అనుగుణంగానే జనాభా వుండేది. ఇతరజీవరాసు లన్నింటి వలెనే మానవుడు కూడా ప్రకృతిపైన పూర్తిగా ఆధారపడి జీవించేవాడు.

పశువులను మచ్చిక జేసి మందలను పెంచడం, అటుపైన వ్యవసాయం ప్రారంభించటంతో ఆహార పదార్థాలు పుష్కలంగా లభించాయి కాని, మందలను మేపడానికి, వ్యవసాయం చేయడానికీ ఎక్కువ మంది కావలసి వచ్చారు. కాబట్టి, యుద్ధంలో గెలిచిన వారు, ఓడి పోయిన వారిని చంపకుండా, బానిసలుగా పట్టుకొని పని చేయించు కున్నారు. అందువల్ల ఓడిపోయిన వారు కూడా బ్రతికారు. కాని వారి బ్రతుకు బానిస బ్రతుకు మాత్రమే. అయినా జనాభా పెరిగింది. పితృ స్వామిక సమాజం విస్తరించింది.

ఆ దశలో స్త్రీల పరిస్థితి

పితృస్వామిక సమాజం ప్రారంభమైనదశలో స్త్రీలగతి అధోగతిగా మారిపోయింది. వారి హక్కులన్నీ హరించి పోయాయి. కాని, బాధ్యతలు మాత్రం మిగిలిపోయాయి.

పితృస్వామిక సమాజంలో, తనకిష్టమైన స్త్రీని వివాహం చేసుకునే హక్కు పురుషునకు లభించినప్పటికీ, తన కిష్టమైన పురుషుని వివాహం చేసుకునే హక్కు స్త్రీకి లభించలేదు.

ఒకే పురుషునితో కాపురం చేయాలనుకున్న కన్య, తనపై మక్కువగల పురుషుల కోర్కె తీర్చిన పిమ్మటనే, వివాహం చేసుకోవాలని గణంలోని మగవాళ్ళు పట్టు బట్టారు. ఇలా పట్టు పట్టడం పితృస్వామిక సమాజం ప్రారంభమైనప్పుడు జరిగింది. కాని, అటు పిమ్మట ఆ నిబంధనను కొంత సడలించారు. గణ పెద్దలతో శయనించిన పిమ్మట, తనకు నచ్చిన పురుషుని పెళ్ళి చేసుకో వచ్చునన్నారు. మరి కొంతకాలం గడచిన పిమ్మట మత పెద్దతోనో, కుల పెద్దతోనో శయనిస్తే చాలునన్నారు. అలా శయనించినప్పటికీ కన్యాత్వం చెడదన్నారు. ఇలా శయనించినందు వల్ల సంతానం కలిగినప్పటికీ కన్యాత్వం చెడలేదని చెప్పేందుకు ఏవేవో కారణాలు చూపుతున్న కథలు భారతంలో వున్నాయి.

ఒక గణంలోని స్త్రీలు, మరొక గణంలోని పురుషులందరికీ భార్యలుగా వుండే ధర్మాన్ని, మతపెద్దతో శయనించడం ద్వారా పాటించి నట్లవుతుందని సంతృప్తి చెందడంతో, ఇదొక ఆచారంగా తయారైంది. కొన్ని దేశాలలో ఈ ఆచారాన్ని రాజులు నిషేధించారు.మరి కొన్ని దేశాలలో ఇలా శయనించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. అయినా, కొన్ని చోట్ల ఈ ఆచారం నిన్న మొన్నటి వరకూ కొనసాగింది.

వివాహం చేసుకునే హక్కుకొరకు కన్యలు, గణ పెద్దలతో శయనించ వలసిరావడమే కాదు. అంతకంటే ఘోరమైన అన్యాయాలు జరిగాయి.

బలంగలవారు బలహీనులపై దాడి చేసి, వారిని బానిసలుగా పట్టు కొచ్చినప్పుడు, వారిలో అందమైన కన్యలను ఉపపత్నులు (ఉంపుడు కత్తెలు) గా ఉంచుకునే వారు. గ్రీకుల వీరయుగంలో ఇలాంటి పనులు జరిగాయి.

ఒక్కొక్కప్పుడు కేవలం అందమైన కన్యలకొరకు దాడులు జరిగేవి. అలా పట్టి తెచ్చిన కన్యలను వివాహం చేసుకోవడం రాక్షస వివాహ ధర్మంగా భావించేవారు. కాశీరాజు కుమార్తెల స్వయంవర సమయంలో దాడిచేసిన భీష్ముడు, పలువురు రాజులనోడించి, అంబిక, అంబాలికలను పట్టి తెచ్చి,తన తమ్ముడైన విచిత్ర వీర్యునికిచ్చి వివాహం చేయడం

త్తమోత్తమమైన ధర్మమన్నారు గదా? రుక్మిణీదేవిని కృష్ణుడు వివాహ మాడినది కూడా రాక్షస వివాహ ధర్మ పద్ధతిలోనే కదా? ఈరాక్షస వివాహానికి సంబంధించిన ఆచారం ఇప్పటికీ మన దేశంలో కొందరు గిరిజనులలో వుంది.

కొన్ని సందర్భాలలో యుద్ధంలో గెలిచిన వారు ఓడినవారి ఆస్తులను కొల్లగొట్టేవారు. వారి గ్రామాలను, పట్టణాలను తగులబెట్టే వారు. కన్యలను చెరపట్టి, తిరిగినవారినందరినీ హతమార్చేవారు. ఇలా చెరబట్టి, హతమార్చినగాథలు పాత నిబంధన గ్రంథలో వున్నాయి.

ఇలాంటి దాడులను బలవంతులు మాత్రమే సాగించలేదు. అడవిని కొట్టి, పొదను కుదిరినప్పుడు అటవికులు కూడా అభివృద్ధి చెందినవారిమీద ఆకస్మికంగా విరుచుకుపడేవారు. సాధ్యమైనంత ఆస్తిని దోచుకు పోయేవారు. వీలైతే స్త్రీలను కూడా ఎత్తుకు పోయేవారు. పట్టణాలను పల్లెలను తగులబెట్టేవారు.

ఈ విధంగా దాడులు, ఎదురు దాడులు జరగటం వలన స్త్రీలు, ముఖ్యంగా కన్యలు నరకబాధ లనుభవించారు. కొన్ని తెగలకు తెగలే సర్వనాశనమయ్యాయి.

ఆ స్థితిలో పుత్ర పౌత్రాభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరూ తహ తహ లాడారు. జనాభా ఎంత అధికంగా వుంటే అంత గట్టి రక్షణ ఉంటుం దనుకున్నారు. కనుకనే సంతానం లేకుండా ఎవరూ సన్యసించ కూడ దన్నారు. సన్యసిస్తే. అతని పితృపితామహు లందరకూ పున్నామ నరకం తప్పదన్నారు. ఇందుకు సంబంధించిన కథలు మన మహాభారతంలో వున్నాయి.

ఆ జన్మాంతం బ్రహ్మచారిగా ఉండాలనుకున్న జరత్కారుడు, ఆస్తీకుండు పుట్టేంత వరకు నాగ కన్యతో సంసారం చేశాడు. పరాశరుడు, మత్స్యగంధి (సత్యవతి)తో శయనించి వేద వ్యాసుని కన్నాడు. కాబట్టి పరాశరుని వంశం నిలిచింది. పరాశరుని కొక కొడుకును కన్నప్పటికి, సత్యవతి కన్యాత్వం చెడలేదన్నారు. అమె శంతనుని వివాహం చేసుకోగలిగింది.

దేవరన్యాయం

తామర తంపరగా పుత్ర పౌత్రాభివృద్ధి లేనివారికి సిరిసంపదలను పెంచుకోవడం, ఆస్తిపాస్తులను రాజ్యాలను రక్షించుకోవడం సాధ్యమయ్యేదిగాదు. కాబట్టి సంతానాభివృద్ధి కొరకు తహతహలాడారు. దేవరన్యాయాన్ని ప్రవేశపెట్టారు. క్షేత్రజులను (వివాహమైన స్త్రీకి–పరపురుషునకు పుట్టిన బిడ్డలను) కానీనులను (వివాహం గాని కన్యలకు పుట్టిన వాళ్ళను) దత్తత చేసుకున్న వాళ్ళను కూడా, ఔరస పుత్రులతో సమంగా పరిగణించారు.

"ఉత్పత్తి రెండు రకాలు. మొదటిది ప్రజోత్పత్తి, రెండవది అవసరవస్తువుల ఉత్పత్తి. ఈ రెంటికీ అవినాభావ సంబంధముంది" అన్నారు ఏంగెల్స్,

కనుకనే ఆహారపదార్థాలు కొరతగా వున్నప్పుడు యుద్ధంలో ఓడిన వారిని గెలిచినవారు చంపేశారు

పశుపోషణ, వ్యవసాయం ప్రారంభమైన పిమ్మట జీవితావసర వస్తువుల ఉత్పత్తి పెరిగింది. పశువులను సాకడానికి, వ్యవసాయం చేయడానికీ, ఇతర పనులకూ ఎక్కువమంది అవసరమయ్యారు. కాబట్టి, యుద్ధంలో ఓడిపోయిన వారిని చంపకుండా బానిసలుగా పట్టుకొని, వారితో పని చేయించుకున్నారు.

సిరి, సంపదలు బాగా పెరిగినప్పుడు వాటిని రక్షించుకునేందుకు స్వజనం కావాలిగదా? కనుకనే కానీనుల నుండి క్షేత్రజులవరకూ ఔరసపుత్రులుగానే భావించి పెంచుకున్నారు. కొన్ని సందర్భాలలో, బానిస పిల్లలను కూడా దత్తత చేసుకున్నారు.

సంతానం లేకుండా చనిపోయిన వారి వంశాన్ని, సంతానయోగ్యతలేని వారి వంశాన్ని కూడా నిలబెట్టడానికి "దేవర న్యాయం" విధివిహిత మన్నారు.

దేవర న్యాయం ప్రకారం విచిత్ర వీర్యుని భార్యలతో వేదవ్యాసుడు శయనించగా ధృతరాష్ట్ర, పాండురాజులు పుట్టారు. రాజ్యం శంతన వంశంవారి ఆధీనంలోనే వుండిపోయింది.

సంతాన యోగ్యతలేని పాండురాజు వంశాన్ని విలబెట్టేందుకు ఆయన భార్యలు కుంతి, మాద్రి, దేవతల నాహ్వానించి పంచపాండవులను కన్నట్లుగా భారతంలో వుంది గదా? ఈ విధంగా పుట్టిన పాండవులు క్షేత్రజులే, అయినా ధర్మ సంతానం కిందనే లెక్క.

ఇలాంటి అవసరం తిరిగి కలగకుండా వుండాలనే తలంపుతో భీష్ముడు అనేక రాజులను జయించి, నూరుగురు కన్యలను తెచ్చి అంధుడైన ధృతరాష్ట్రునకిచ్చి పెళ్ళిచేశాడు. అలాచేస్తే పదివురు బిడ్డలు పుడతారని భావించాడు. అలాగే నూరుగురు కొడుకుల్ని పుట్టారు. రాజులు, సామంతులు సేనాధిపతులు మున్నగువారు పదివురు భార్యలను పరిణయమాడడానికి, అధిక సంతానాపేక్షకూడా ఒక కారణమైంది.

యూదా పెద్దకొడుకు, సంతానము కలగక ముందే చనిపోయాడు. మరది ధర్మం నెరవేర్చుటకు నియోగింపబడిన రెండో కొడుకు కూడా కపటంగా ప్రవర్తించి చనిపోయాడు. మూడో కొడుకు చిన్నవాడు. కాబట్టి యూదా తన కోడలిని పుట్టింటికి పంపాడు. తన చిన్నకొడుకు పెద్దవాడవగానే, మరది ధర్మం నెరవేర్చడానికి పంపుతానన్నాడు. కాని, యూదా తన మాటను నిలబెట్టుకోలేదు. తనకోడలికోశయనిస్తే పెద్దకొడుకులు ఇద్దరూ చనిపోయినట్లే, చిన్న కొడుకుకూడా చనిపోతాడని భయపడ్డాడు. కాగా, ఆయన కోడలొక యుక్తిపన్ని ఆయనతోనే శయనించింది. అలా తనతో శయనించిన స్త్రీ, తన కోడలేనని యూదాకు తెలియదట. ఆమె ఎవరో వేశ్య అనుకున్నాడట. ఏమైతేనేం? ఆమెకు కవలపిల్లలు పుట్టారు. వారిలో పెద్దవానిపేరు "జేరహా" చిన్నవానిపేరు పెరసు" (పాతనిబంధన గ్రంథం. ఆదికాండం, 38 అధ్యాయం) ఈ పెరసు వంశము లోనివాడే దావీదు, సోలమన్ రాజులు.

ఇలాంటి గాథలనేక మున్నాయి. వంశాన్ని నిలుపుకునేందుకే గాక ఆస్తిని,రాజ్యాన్ని కాపాడుకునేందుకు కూడా దేవర న్యాయం(మరదిధర్మం) ధర్మ సమ్మతంగా భావించారు. క్షేత్రజులను, కానీనులను జారసపుత్రులతో సమంగా భావించి పెంచుకున్నారు. నేటికీ మనదేశంలో కొన్ని తెగలలో దేవర న్యాయం ఉంది.

బహుభార్యాత్వం—బహుభర్తృత్వం

సిరిసంపదలు గలవారు, వీరులు, రాజులు పలువురుస్త్రీలను పెళ్ళాడుతోంటే, పెద్దగా సంపద లేనివారు ఒక్కొక్క స్త్రీని మాత్రమే చేసుకునేవారు. మరీ తక్కువ సంపదగల కుటుంబాలలో అన్నదమ్ములంతా కలసి ఒకే స్త్రీని పెండ్లాడేవారు. ఈ బహు భర్తృత్వానికి సంబంధించిన కథలు గ్రీకుల పురాణాలలో వున్నాయి. ఇలా పరిణయమాడడం జర్మన్లలో కూడా వుండేదట. "పది పన్నెండు మంది బ్రిటన్లుకలసి ఒకే స్త్రీని చేసుకుటారు." అని సీజర్ వ్రాశాడు (ఎంగెల్స్ రచించినకుటుంబము, ఆస్తి రాజ్యాంగాల పుట్టుక అన్న గ్రంథం చూడండి)

ఆ రోజుల్లో ఆస్తిలేని పేదలకు, బలహీనులకు ప్రేమ మందిరాలలో నివసించే వేశ్యలేగతి.

హాయిగా అనుభవించ దలచుకున్న మత పెద్దలకు, పెండ్లిగాని కన్యలు లభించే వారు. ఋషులు కావాలనుకుంటే, రాచకన్యలను పొందగలిగేవారు. ఇందుకు ఉదాహరణగా చ్యవన-సుకన్యల, అగస్త్య-లోపాముద్రల వివాహాలను తీసుకోవచ్చు. ఇలాగే, మునికన్యలు క్షత్రియులనువరించేవారు. శకుంతల దుష్యంతుని వరించింది దేవయానియయాతిని వరించింది. ఒక మునికన్య యఙ్ఞుని వరించగా శాతవాహనుడు జన్మించాడు.

ఆ పైన అతిథి మర్యాదలుండేవి. ఆర్హత గల అతిథి గాని, అభ్యాగతి గాని, కోరితే, పలువురు భార్యలు గల గృహయజమాని ఒకరిని సమర్పించేవాడు. లేదా ఒక కన్య నిచ్చేవారు. ఈ మర్యాద లింకా ఆస్ట్రేలియాలోని ఆదిమ తెగలలోను, మన దేశంలోని ఒకటి, రెండు కొండ జాతులలోనూ వున్నాయి.

అతిథి మర్యాదతో పాటు మరొక మర్యాద కూడా వుండేది. తనను గాఢంగా ప్రేమించిన పురుషుని కోర్కెను స్త్రీ తీర్చడం మర్యాద. కనుకనే "కోరి వచ్చిన వారి కోరిక కదీర్చనేరని సతులకు నిష్కృతుల్లేవు" అంటూ, ఇంద్రుని కోర్కెను అహల్య తీర్చిందట. ఇలాగే తపసు గాఢంగా ప్రేమించిన స్త్రీ కోర్కెను పురుషుడు తీర్చడం మర్యాద. కాబట్టి, తార కోర్కెను చంద్రుడు తీర్చాడట. అలా తీర్చక పోవడం

ప్పు. కాబట్టి పేదిని కమ్మని గాండీవిని ఊర్వశీశపించిందట ఇలాంటి ప్రేమగాధలు గ్రీకు పురాణాలలో కూడా అనేక మున్నాయి.

ఇలాంటి ప్రేమాయణా లీనాడు ధర్మ సమ్మతం కావు, కాని, ప్రపంచ మంతటా రహస్య కామ కలాపా లున్నాయి గదా? అరికట్ట మర్యాదల అనశేషం ఎక్కడో ఆటవికులలో కన్పించినా, ఇతరత్రా అది పూర్తిగా తుడిచి పెట్టుకు పోయిందని చెప్పవచ్చు. అయినా బహుభార్యాత్వం బహుభర్తృత్వం నేటికూడా మన దేశంలో వున్నాయి. కడా?

భారత కాలంనాడు కుంతి తన బిడ్డలైన ధర్మభీమార్జునులు, తన సవితి (మాద్రి) బిడ్డలైన నకుల సదేహావులు చీలిపోకుండా వుండాలనే దూరిక తో పాంచవులు ఐనుగురూ ద్రౌపదిని చేసుకోవాలని ఆదేశించిందట. పాండవులు చీలిపోతే రాజ్యం చక్కబడని భయపడడమే ఆవివాహానికి కారణమట.

ఆ నాడే కాదు. ఈ నాడు కూడా బహు భర్తృత్వం కొన సాగ టానికి ప్రబలమైన కారణముంది.

హిమాచల ప్రదేశ్‌లో కొన్ని చోట్ల జీవితావసర వస్తువుల ఉత్పత్తికి తగిన అవకాశాలు లేవు. చాలా భాగం రాళ్ళ రప్పలతో మంచు గడ్డలతో విండి వుంటుంది. లడఖ్‌లో నెలరోజులు మాత్రమే ఎండ కాస్తుంది. కాబట్టి, అలాంటి చోట్ల జనాభా పెరిగితే అన్నం, వస్త్రాలు లభించవు. అన్నదమ్ములంతా తలా ఒక స్త్రీని పెళ్ళి చేసుకుని వేరు వేరు కాపురాలు పెడితే, జీవనాధారమైన పొలం, పశువులు పంపిణీలై పోతాయి. స్థంతానం పెరుగుతుంది. జీవితం దుర్భరమౌతుంది. కాబట్టి అన్నదమ్ములంతా కలసి ఒకే స్త్రీని పెళ్ళి చేసుకుంటున్నారు. మళ్ళీ ఆమెకు పుట్టిన మగపిల్లలంతా కలసి ఒకే స్త్రీని చేసుకుంటారు. అందువల్ల తరతరాల వరకూ ఇల్లూ పొలం, పశువులు, పనిముట్లు పంపిణీగాకుండా యథాతథంగా వుంటాయి., జనాభా పెరగదు జీవనం సాధ్యమవుతుంది. కనుకనే అక్కడ బహు భర్తృత్వం ధర్మ సమ్మతంగా పరిగణింప బడుతోంది. పెండ్లిగాని స్త్రీలు బ్రహ్మచర్యం అవలంబిస్తున్నారు.

గతంలో, ఇలాంటి ప్రదేశాలలో— అవసర వస్తువుల ఉత్పత్తి ముఖ్యంగా ఆహారోత్పత్తి తక్కువగానున్న తావుల్లో— ఎక్కువమంది

ఆడపిల్లలుండ కూడదనుకునే వారు. ఒకరిద్దరు ఆడ పిల్లల తరువాత పుట్టిన ఆడపిల్లలను, గొంతు పిసికి చంపేవారు. ఎక్కువ మంది ఆడపిల్లలుంటే వారికి పెళ్ళిళ్ళు చేయడం అసాధ్యం. వారిని ఇంట్లో వుంచుకుని పోషించడమూ కష్టమే. కనుకనే చంపేవారు. కాని, ఇప్పుడా పరిస్థితులు మారాయి. పెళ్ళిగాని స్త్రీలు కూడా కష్టపడి సంపాదించుకుని జీవించేందుకు తగిన అవకాశాలేర్పడ్డాయి. కాబట్టి ఇప్పుడెవరూ ఆడపిల్లలను చంపడం లేదు. ఆడపిల్లలను చంపడం ఘోరమైన పాపంగా పరిగణిస్తున్నారు.

ధర్మ సూత్రాలను రూపొందించడంలోను, వాటిని క్రోసి పుచ్చడంలోనూ, సామాజిక అవసరాలు, దేశ కాల పరిస్థితులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. కనుకనే అన్యోన్య విరుద్ధమైన ధర్మాలు, ఆచార సంప్రదాయాలు లోకంలో కొనసాగుతున్నాయి. ఒకనాటి ధర్మం మరొకనాడు అధర్మంగా, ఒకనాటి సదాచారం మరొకనాడు దురాచారంగా పరిగణింపబడుతున్నాయి.

కాబట్టి, భారత రామాయణ గాథలను సరిగా అర్థం చేసుకోడానికి ఉపకరిస్తాయనే తలంపుతో పరిణామ క్రమంలోని దశలను, స్త్రీ-పురుష సంబంధాలను, ధర్మాధర్మాలను క్లుప్తంగా వివరించాను. ఇక దేవతలకొలుపులు, దేవుళ్ళ పూజలు, వీరగాథలు ఎలా ప్రారంభమయ్యాయో తెలుసుకొని, ఆ పైన రామాయణ, మహాభారతాలను పరిశీలిద్దాం.

దేవతలు కొలుపులు – క్రతువులు

ప్రొత్తిళ్ళలో పెరుగుతున్న శిశువుకు తల్లి వినా వేరొకటి తెలియదు. తల్లి తన బిడ్డకు అన్యమిస్తుంది. రక్షిస్తుంది. సదా హృదయానికి హత్తుకొని పెంచుతుంది. కాబట్టి శిశువు కూడా మాతృహృదయానికి హత్తుకు పోవడం సహజం.

ప్రకృతి ప్రసాదించిన పదార్థాలను సేకరించి భుజించడమేగాని, వాటిని సృష్టించడం, ఆటవిక యుగంలోని మానవులకు తెలియదు. కాబట్టి తమకు స్తన్యమిచ్చి పోషిస్తున్న మాతృమూర్తిగా భావించి, ప్రకృతిని పూజించారు. మరింత ఆహారాన్ని ప్రసాదించవలసిందిగా ప్రార్థించారు.

తరచుగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు కారణమేమిటో? వారికి అంతుబట్టలేదు. అంటు వ్యాధులకు మూలం తెలియలేదు. దేవతలకు (ప్రకృతి శక్తులకు) కోపం రావడంవల్లనే, వైపరీత్యాలు సంభవిస్తున్నాయని, వారు భావించారు. దేవతల కోపోపశమనం కొరకు, వారి చల్లని చూపుల కొరకు, కాళి, మహంకాళి, చండిక మున్నగు దేవతల కొలుపులు కొలిచారు. జంతు బలులు సమర్పించారు. చెట్టుకు, పుట్టకు మ్రొక్కారు.

కొన్నాళ్ళకు వారి కొక ఆలోచన కలిగింది. తమ గణంలో పెద్దగా వున్న వృద్ధ మాతవలెనే, ఆయా దేవతలపైన ఒక గొప్ప దేవత కల దనుకున్నారు. కొందరు ఆ దేవతకు ఎల్లమ్మ అని పేరు పెట్టారు. నదీ తీరాలలో నివసిస్తున్న ప్రజలు గంగమ్మ (గంగావమ్మ) అనీ, పర్వత ప్రదేశాలలో నివసిస్తున్నవారు "పార్వతి" అని పేరు పెట్టి పూజించారు.

తల్లి గర్భం నుండి బిడ్డలు వీడుతున్నట్లుగానే ఎల్లమ్మ గర్భం నుండి ప్రకృతి శక్తులు, వనులు పుట్టాయని భావించారు. నవమాసములు

మోపి, కని, పెంచిన తల్లిని గౌరవించినట్లుగానే, ఆదిశక్తిని ఆరాధించే క్రైస్తవ మతానికి శ్రీకారం చుట్టారు.

పశువుల పెంపకం ప్రారంభమైన తెగలలో పురుషుని ప్రాముఖ్యత పెరిగింది. కాగా, కొన్ని తెగలలో ఆదిశక్తి ఆరాధనతోపాటు పశుపతి పూజలు కూడా ప్రారంభమయ్యాయి.

ఈ భూమి, తల్లి లాంటిది. వెలుగును, తేజస్సును ప్రసాదిస్తున్న సూర్యుడు తండ్రి లాంటివాడు. అని భావించి కొందరు క్షేత్ర పూజలు సూర్య నమస్కారాలు చేశారు. మన దేశంలో కొందరు కుంతిని కొలిచి, సూర్యునకు నమస్కరిస్తే, ఈజిప్షియన్లు ఇసిస్ (ప్రకృతి దేవత)ను కొలిచి, ఓసిరిస్‌కు (సూర్యునకు) నమస్కరించారు. కుంతికి-సూర్యునకు కీర్తుడు పుట్టినట్లుగా మన వాళ్ళొక కథ చెపితే, అక్కడ ఇసిస్-ఓసిరిసులకు, హోరస్ పుట్టినట్లుగా కథ నల్లారు ఈజిప్షియన్లే గాక గ్రీకులు, రోమన్లు క్రీ॥ శ॥ నాలుగో శతాబ్ది వరకూ ఐసిసును పూజించారు. ఈ నాడు కూడా మన దేశంలో సూర్య నమస్కారాలున్నాయిగదా? కొందరు నేటికీ గొంతాలమ్మ(కుంతి)పండగ జేస్తున్నారు గదా? సూర్యనమస్కారాలు, అగ్ని పూజలు సిథియన్లలో వుండేవి. నేటికీ జొరాస్ట్రియన్ మతస్థులలో ఈ పూజలున్నాయి.

స్త్రీ-పురుష కలయికవల్ల సంతానం కలుగుతున్నట్లుగానే, పశు పతి-పరాశక్తుల కలయికవల్ల భూనభోంతరాళాల సృష్టి జరిగిందని శైవులు విశ్వసించారు. శివలింగాల్ని రూపొందించారు.

మాతృస్వామిక సమాజంపోయి, పితృస్వామిక సమాజ మేర్పడిన తెగలలో స్త్రీ దేవతల స్థానాలను పురుషదేవతలు ఆక్రమించారు.

ఆర్యతెగలలో ఇంద్ర, అగ్ని, యమ, వరుణ, సూర్య చంద్రాదుల పూజలు పెరిగాయి. హోమ గుండాలు, బలిపీఠాలు నిర్మించారు. ముక్కోటి దేవతలకు అధిపతి ఇంద్రుడని భావించి ఇంద్ర యాగం చేశారు.

ఈ పూజలు, ప్రతిష్టలు, జంతు బలులు, కుడుములు, ఉండ్రాళ్ళు ధూప దీప నైవేద్యాలు, తంత్రం, మంత్రం, యజ్ఞం, యాగం అనాదు అనేక దేశాలలో వున్నాయి. కనుకనే, ఇలాంటి వన్నీ రామాయణ,

కారక, భాగవతాది పురాణాలలో మాత్రమేగాక, పాత నిబంధన గ్రంథంలో, పలు దేశాల పురాణాలలో కూడా కనిపిస్తున్నాయి.

ఈ పూజలతో మరి కొన్ని పూజలు కలిశాయి. రెగలు విస్తరిం చిన కొలదీ, వాటి గుర్తింపు కొరకు గజ, సింహ, నాగ, ఋక్ష, వానర, గరుడ, చున్నగు పేర్లు పెట్టుకున్నారు. ఏ రెగకు ఏ పేరు పెట్టుకున్నారో ఆ రెగవారు దానిని పవిత్రమైన జంతువుగా భావించి పూజించారు.

పురుషుని ఆధిక్యత పెరగడంతో, అంతవరకు స్త్రీకి గల గౌరవం తగ్గింది. దాసోపాటే గంగానమ్మ, పోలేరమ్మ లాంటి దేవతల పూజలు కూడా తగ్గాయి.

మాతృదేవోభవ, పితృదేవోభవ, అని వల్లించినప్పటికీ, తండ్రి మాటను కొడుకులు మీరడానికి వీలు లేకుండా పోయింది. తండ్రిఆజ్ఞా పిస్తే, కన్నతల్లినైనా సరే కొడుకులు చంపవలసిందే.

చిత్రరథుడను వాని జూచి వచ్చినందుకు, తన భార్యయైన రేణుకపై జమదగ్ని మహాముని కి పట్టరానంత కోపమొచ్చింది. వెంటనే ఆమెను చంపవలసిందిగా కొడుకులకు ఆజ్ఞాపించాడు. పెద కొడుకులు ముగ్గురూ తండ్రి ఆజ్ఞను తిరస్కరించారు. కాని, చిన్నవాడైన పరశు రాముడు గండ్రగొడ్డలితో తన తల్లి కుత్తుకను ఖండించాడు. తదుపరి తండ్రిని వేడుకొని తల్లిని బ్రతికించుకున్నాడట ! ఈకథ భారతంలోవుంది.

తన ప్రియుడైన 'అజిస్టస్' పైన గల మోహంతో తన భర్తయైన 'అగమెమ్నాన్'ను 'క్లితామ్నెస్ట్రా' చంపివేసింది. తన తండ్రిని చంపి నందుకు ప్రతీకారంగా 'ఓరెస్టెస్' తన కన్నతల్లినే నరికేశాడు. అంతట మాతృ హత్య మహాపాపమంటూ, మాతృదేవతలు ఓరెస్టెస్ మొరపెట్టారట. అంతలో పితృ దేవతలొచ్చి ఓరెస్టెసుకు అడ్డుపడ్డారట. చివరకు ఉభయ దేవతలూ కలిసి పంచాయితీ పెట్టారట.

"మాతృ హత్యకు పాల్పడినందున ఓరెస్టెసును చంపేయాలి. ఈ పాపానికి ప్రాయశ్చిత్తంలేదు," అని మాతృ దేవతలు వాదించారట.

అందుకు జవాబుగా ఓరెస్టెస్ "నా తల్లి తన భర్తను చంపింది.అనగా నా తండ్రిని చంపింది. ఆ విధంగా రెండు హత్యలు చేసింది. రెండు

హత్యలు చేసిన అమెను నేను హత్య జేశాను. నేను చేసింది ఒకే హత్య కాబట్టి, నా మీద పడ్డం న్యాయంగాదు" అని వాదించాడట.

ఆ వాదనకు ప్రతిగా మాతృదేవతలు "నీ తల్లి కీ, తండ్రికీ రక్త సంబంధంలేదు. కాబట్టి ఆమె తన భర్తను చంపినా పాపంలేదు. నీకూ నీ తల్లికీ రక్త సంబంధముంది. కనుక, నీ తల్లిని హత్య జేసినందుకు నిన్ను చంపక తప్పదు" అని వాదించారట.

చివర్కు పంచాయితీవార్లు అటుసగం, ఇటు సగంగా చీల్చిపోగా, అధ్యక్ష స్థానంలో వున్న పురుష దేవత, తనకు గల విచక్షణాధికారాన్ని (కాస్టింగ్ ఓటును) ఓరెస్టెసుకు అనుకూలంగా ఉపయోగించడంతో ఆయన బ్రతికి బయట బడ్డాడట. ఈ కథ గ్రీకు పురాణగాథల్లో వుంది.

ఈ విధంగా రకరకాల దేవతలు, దేవుళ్ళు, మాతృదేవతలు, పితృ దేవతలు, కుల దేవతలు, పెరిగిపోయిన సమయంలో కొందరు భావవాదులు సృష్టి కర్త, ఒకడే నన్నారు. ఆ సృష్టికర్తకు కొందరు ఎల్లయ్య అని పేరు పెట్టారు. కొందరు బ్రహ్మ అన్నారు. మరి కొందరు యెహోవా అన్నారు. కొందరు భగవంతుడన్నారు. ఆయన ప్రార్థించడం మంచిదన్నారు. క్షుద్ర దేవతల పూజలు పనికి మాలినవన్నారు. పాపమన్నారు. దేవుడూ లేడు, దయ్యమూ లేదు అన్నారు అవి భౌతిక వాదులు. అయినా అవి ఆగలేదు. అప్పుడే కాదు, ఇప్పుడూ అవి వున్నాయిగదా!

ప్రజలలో మూఢ నమ్మకాలున్నంతవరకూ, గణాచారుల, బాబాల, పూజారుల పంట పండుతున్నంతవరకూ ఈ పూజలు ఆగవు.

వీర పూజలు

పశుపోషణతోపాటు వ్యవసాయం కూడా ప్రారంభించిన తెగల సంపద పెరిగింది. సంపదను, ప్రజలను కాపాడగల వీరులు (క్షత్రియులు) పై చేయి సంపాదించారు. అప్పటి నుండి వీరపూజలు, ప్రారంభమయ్యాయి.

ఈ పీరు లెవరు ? వీరు ఏ వైనా గొప్ప వంశాలలో పుట్టినవారా ? వీరి జన్మలు అంత పవిత్రమైనవా ? అనే సుదేహ్ం కలుగవచ్చు. కాని, అలాంటి జన్మలూ లేవు. వంశాలూ లేవు.

ఆ రోజుల్లో, యజమానులుగాని, బానిసలుగాని, వారసులుగాని, క్షేత్రజులుగానీ, ఎవరైనాసరే, బలపరాక్రమాలు ప్రదర్శించగల వారం దరూ వీరులుగానే పరిగణింపబడ్డారు.

దృఢగాత్రులైన బిడ్డలకొరకు, కుంతి, మాద్రి ఎవరెవరినో ఆహ్వానించినట్లుగానే, గ్రీకు స్త్రీలు, స్పార్టాన్ పురుషులను ఆహ్వానించారు. ఇక్కడ పాండురాజు స్వయంగా తన భార్యలను ప్రోత్సహించాడు. అక్కడ గ్రీకు గణపెద్దలు, వారి స్త్రీలను ప్రోత్సహించారు. అలా జన్మించిన పాండవులు అనేకమందిని జయించారు. గ్రీకు వీరులు అనేక తెగలను, రాజ్యాలను జయించారు.

కర్ణుడు పుట్టగానే కుంతి, ఆ బిడ్డ నొక పెట్టెలో పెట్టి గంగానదిలో విడిచిపెట్టిందట. అధీరథుడనే సూతుడు ఆ బిడ్డను రక్షించి పెంచాడు. అలా పుట్టిపెరిగిన కర్ణుడు కానీనుడైతే మాత్ర మేం ? దాన, వీర, శూర కర్ణుడుగా కీర్తి ప్రఖ్యాతుల నార్జించుకున్నాడు.

లేవి వంశంలోని ఒక బానిస స్త్రీకి అందమైన మగబిడ్డ పుట్టాడు. ఐగుప్త రాజు ఆజ్ఞ ప్రకారం ఆమె తన బిడ్డను నదిలో పారేయాలి. ఎందువల్లనంటే ? ఐగుప్తులకంటే, వారివద్ద బానిసలుగా నున్న ఇజ్రాయేలీయుల జనాభా పెరిగిపోతూండడం చూచి ఐగుప్తులో రాజు భయపడ్డాడు. ఇజ్రాయేలీయులలో పురుషుల సంఖ్యను తగ్గించేందుకుగాను, వారికి పుట్టిన మగపిల్లలను నదిలో పారేయవలసిందిగా ఆజ్ఞాపించాడు.

అయినా, ఆ బానిస స్త్రీ తన బిడ్డను నదిలో పారేయలేకపోయింది. ఆ బిడ్డ నొక పెట్టెలో పెట్టి ఏటి ఒడ్డునగల జమ్ములో దాచిపెట్టింది. జల క్రీడలకొరకు అక్కడకు వచ్చిన రాకుమారి చంటిబిడ్డ ఏడుపు విని, ఆ బిడ్డను రక్షించి పెంచే ఏర్పాటు చేసింది. ఆ బిడ్డడే మోషె. ఐగుప్తులవద్ద బానిసలుగా నున్న ఇజ్రాయేల్ ప్రజలను విముక్తి చేసిన వీరుడుగా, మహానుభావుడుగా మోషె కీర్తింపబడ్డాడు.

ఇలాంటి వారంతా వీరులే. వారు ఏ తెగల్లో జన్మించారో, ఆ తెగల ఆస్తులను, ప్రజలను రక్షించారు. లేదా, ఇతర తెగలను జయించి వారి ఆస్తులను దోచుకొచ్చారు. ఓడినవారిని బానిసలుగా పట్టుకొచ్చారు. కాబట్టి, వారు ఎవరైతేనేం? ఎలా పుడితేనేం? వీరులు వీరులే. "ఏమల జన్మంబు వీరుల జన్మంబు లెరుగ నగునె?" అంటూ ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు.

క్రమంగా ఈ వీరులనుండి దళనాయకులు, వారినుండి రాజులు పైకొచ్చారు. రాజ్యాలు స్థాపించారు. అంతటితో ప్రజల పంచాయతీ పాలన పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

అయినా, ఈ రాజుల ఆజ్ఞను ప్రజలు తుచ. తప్పకుండా శిరసావహించాలంటే, వీరు దైవాంశ సంభూతులై నట్లుగా ప్రజలను నమ్మించాలి. కాబట్టి, కర్ణుడు సూర్యునకు, ధర్మరాజు యమధర్మరాజుకు, భీముడు వాయు దేవునకు, అర్జునుడు ఇంద్రునకు, నకుల, సహదేవులు అశ్వనీ దేవతలకు పుట్టారన్నారు. ద్రౌపది హోమ గుండంలో పుట్టిందన్నారు. ఈ విధంగానే అనేకమంది వీరులు, రాజులు పుట్టినట్లుగా కథలు వ్రాశారు.

కొందరు క్షత్రియులు తమ వంశం సూర్యవంశ మని చెప్పుకుంటే, కొందరు చంద్రవంశ మని చెప్పుకున్నారు. మరికొందరు పద్మ వంశమని చెప్పుకున్నారు. ఇక్కడలాగే, గ్రీసు మొదలైన దేశాలలో కూడా వీరులు తమ తమ వంశాలకు దేవుళ్ళ పేర్లు పెట్టుకున్నారు.

క్షత్రియులు సూర్యవంశ, చంద్రవంశజులైతే, మాది బ్రహ్మ దేవుని వంశమని బ్రాహ్మణులు చెప్పుకున్నారు.

కశ్యప బ్రహ్మకు మేము పుట్టిన తరువాతనే దేవతలు పుట్టారని దానవులు చెప్పుకున్నారు. దశకంఠునకు రావణ బ్రహ్మ అనే పేరుకూడా వుందిగదా?

ఇలా ఒకరిని మించి ఒకరు తమ గొప్పలు చెప్పుకుంటూ కథలల్లుతున్న వీరయుగంలో ముందు వాల్మీకి రామాయణం, దాని తరువాత భారతం వెలువడ్డాయి. ఇలాగే గ్రీసులో ఇలియడ్, ఒడెస్సే కావ్యాలు వెలువడ్డాయి. కనుకనే వీటిమధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి.

రామాయణాన్ని రచించిన వాల్మీకిగాని, భారత గాథను వర్ణించిన వైశంపాయనుడుగాని, ఏ కాలంవారో: సరిగా తెలియకున్నట్లుగానే, ఇలియడ్, ఒడెస్సే కావ్యాలను సృష్టించిన హోమర్ కూడా ఏ కాలంవాడో సరిగా తెలియదంలేదు.

ఆయన క్రీస్తు పూర్వం 850 ఏళ్ళ నాటి వాడని కొందరు, 1200 ఏళ్ళ నాటి వాడని కొందరు చెపుతున్నారు. అసలు హోమర్ అనే మహా కవి ఒకరున్నారా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

మన రామాయణాన్ని కుశీలవులు పాడి ప్రజలకు వినిపించినట్లు, మన భారత గాథను సూతులు చెప్పినట్లు, హోమర్ కావ్యాలను కూడా గాయకులు పాడి ప్రజలకు వినిపించారు.

మన రామాయణ, మహాభారతాలు ఇతరుల చేతులలో పెరిగినట్లుగానే, హోమర్ కావ్యాలు కూడా పిసిస్ట్రాటస్, హిప్పార్కస్, హిప్పియాస్ వంటి వారి చేతులలో పడి పెరిగాయట.

హెలెన్ ను పారిస్ ఎత్తుకుపోగా ట్రాజన్ యుద్ధం జరిగిందట. సీతాదేవిని రావణుడు ఎత్తుకుపోగా, రామరావణ యుద్ధంజరిగిందన్నారు.

భారతంలో భీమునివలె, గ్రీకు పురాణాలలో హెర్క్యులెస్ కను పిస్తున్నాడు.

భారతంలోని కర్ణునకు, ఇలియడ్ కావ్యంలోని అకిలెస్‌కు అనేక పోలిక లున్నాయి. ఇద్దరూ ఉగ్రమూర్తులే. కాని, అకిలెస్ దేవలం వీరుడుగా కనిపిస్తే, కర్ణుడు వీరుడుగానే కాక, దాన శీలుడుగా కూడా కనిపిస్తున్నాడు.

ఆర్య క్షత్రియుల గాథలకు, గ్రీకు వీరుల గాథలకు మధ్య కొన్ని పోలిక లున్నట్లుగానే, మన పురాణ గాథలకు, యూదుల గాథలకు మధ్య కూడా కొన్ని పోలిక లున్నాయి.

సత్యవ్రతుడు – నోవహు.

ద్రవిడ రాజైన సత్యవ్రతుడు సన్యసించి, తపస్సు చేస్తుండగా, భగవంతుడు చిరుచేప రూపంలో ప్రత్యక్షమై జలప్రళయం సమీపించిందని

హెచ్చరించాడట. అటుపిమ్మట సంభవించిన జలప్రళయంలో సత్యవ్రతునితో పాటు సప్తర్షులను, ఓషధులను ఒక ఓడలో కెక్కించి, తాను మత్స్యావతారమెత్తి, ఆ ఓడను కాపాడి, వారిని రక్షించాడట. అలా రక్షింపబడిన వారి మూలంగా, తిరిగి భూమండలంమీద సకల జీవరాసులు, ఓషధులు విస్తరించాయని భాగవతంలో వ్రాశారు. విష్ణుమూర్తి మత్స్యావతారమెత్తి మనువును రక్షించినట్లుగా మత్స్య పురాణంలో వ్రాశారు. మనువును బ్రహ్మదేవుడు రక్షించాడని భారతంలో వ్రాశారు.

లోకంతో పాపం పెరిగిపోగా సర్వనాశనంచేయ సమకట్టిన దేవుడు నోవహుని మాత్రం మెచ్చి, అతనికి ప్రత్యక్షమై, మూడంతస్తులు గల ఓడను తయారుచేసుకొని భార్యా బిడ్డలతో సహా అందులో కూర్చుండవలసినదిగా నోవహును హెచ్చరించాడట. జలప్రళయం రాగానే సకల జీవరాసులనుండి ఒక్కొక్క జంట చొప్పున దేవుడు ఆ ఓడలోనికి రప్పించి, నోవహుతోపాటు, వాటి వన్నింటినీ రక్షించాడట. అలా తనచే రక్షింపబడిన నోవహు కుటుంబ సభ్యుల ద్వారా మానవులు విస్తరిస్తారని దేవుడు ఆశీర్వదించాడట. అప్పుడు నాశనం చేసినట్లుగా మరెన్నడూ చేయనని వాగ్దానం చేశాడట. అందుకు గురుతుగా తన ధనస్సును (ఇంద్రధనస్సు) మేఘాలలో నుంచాడట.

అపుడావిధంగా రక్షింప బడిన పశు, పక్షి, ఫణి, నర, క్రిమి, కీట కాదులనుండి సకల జీవరాసులు తిరిగి భూమండలంపైన విస్తరించాయని పాత నిబంధన గ్రంథంలో వ్రాశారు.

బైబిల్‌లో మోక్షగీత, పరమ గీతలుంటే, భారతంలో భగవద్గీత, అను గీత, సత్వపారాయణంలో రామగీత, భాగవతాది పురాణాలలో అనేక గీతలున్నాయి.

ఈవిధమైన పోలికలు గల కథలు, గాథలు, అనేక మున్నాయి. వీటి నాధారంగా చేసుకొని, మనదేశంలో పురాణాలు పెరిగినట్లే, ఈజిప్టు, గ్రీసు, ఇటలీ మున్నగు దేశాలలో కూడా పెరిగాయి. అనేక మార్పులకు చేర్పులకు లోనయ్యాయి.

పురాణాల వలెనే బౌద్ధుల జాతక కథలు, జైన గాథలు కూడా విస్తరించాయి.

పురాణాలను సంస్కృతంలో వ్రాస్తే, ప్రజలకు బాగా తెలియటం కొరకు జాతక కథలను పాలీ భాషలో వ్రాశారు. జైన గాథలను అర్ధ మాగధిలో వ్రాశారు, బృహత్కథను గుణాఢ్యుడు పైశాచిలో వ్రాశాడు.

బృహత్కథను సంస్కృతంలోకి అనువదించారు. అయినా అది కథగానే వుండిపోయింది. హాలుని గాథాసప్తశతి కూడా కథల సంపుటిగానే వున్నది. భట్టివిక్రమార్కుని కథలు కూడా అంతే. ఇవిగాక మనదేశంలో ఎరెన్నో కథలున్నాయి.

ఈ కథలవంటివే అరేబియన్ నైట్స్ కథలు. ఇలాంటి కథలు ప్రతిదేశంలోనూ వున్నాయి. వీటిపుణ్య కొన్ని ఆదాన ప్రదానాలు కూడా జరిగాయి.

కాని రామాయణ, మహాభారతాల వలె ఖ్యాతి నార్జించుకున్నవి చాలా తక్కువ.

అయినా ఒకటిమాత్రం నిజం.

అది రామాయణంగాని, మహాభారతంగాని, లేదా హోమర్ సృష్టించిన కావ్యాల వంటివి గాని, ఆనాడు వ్యాప్తిలోనున్న కథలనుండి పుట్టి, పెరిగినవే ననుట మాత్రం నిజం.

కథల ఆధారంతో కావ్యాలు రూపొందాయి

"ఈ రామాయణ మహాఖ్యాన మిక్ష్వాకు రాజవంశ ముందుత్పన్న మైనదిగా వినవచ్చుచున్నది," అని వాల్మీకి మహర్షి స్వయంగా చెప్పిన మాట లిచట గమనార్హం.

వైదిక వాఙ్మయంలోనే దేవతలు, దానవులు, ఋషులు, రాజులను గురించిన కథలున్నాయి లౌకిక వాఙ్మయంలో అవి మరింతగా పెరిగాయి. వీటిలో చాలాభాగం భారతంలో చేర్చారు. అలా చేర్చిన పిమ్మట భారతం పంచమ వేదమన్నారు. కొన్నింటిని రామాయణంలోనూ చేర్చారు. కనుకనే రామాయణ భారత గాథలకుమూలం వైదిక వాఙ్మయంలోనే వున్నవని డా॥ మిరాషి వంటి కొందరు పండితులు వాదిస్తున్నారు.

... లౌకిక వాఙ్మయం పెరిగిన కొలదీ మకపరమైన కథలు, నీతులు బోధించే కథలు, సామెతలు అనేకం పుట్టుకొచ్చాయి. ఆ దశలో ప్రజలకు ఐతిహాసికులు ఇతిహాసములు చెపితే, పౌరాణికులు పురాణాలుచెప్పే వారు.

ఈనాడు కూడా ప్రజలు అనేక పురాణ గాథలు, కథలు, పిట్ట కథలు చెప్పుకుంటున్నారు కదా? బుర్రకథలు, హరికథలు, వింటున్నారు గదా?

పుత్రికా యాత్రికాలు, పత్రికలు, పుస్తకాలు, వార్తాప్రసారాలు పెరిగిపోతున్న ఈరోజుల్లోకూడా పురాణ కథలు, పిట్టకథలు చెప్పటం, వినడం జరుగుతున్నప్పుడు "రిపి" లేనిరోజుల్లో వాటి కెంత ప్రాముఖ్యత ఉండెడ్లో మనం ఊహించవచ్చు.

అలాంటి ప్రాముఖ్యతగల కథలలో నొకదానిని వాల్మీకి మహర్షి తన కావ్యవస్తువుగా ఎంచుకొన్నారు. వేదాలలో అచ్చటచ్చట కనుపించే "అనుష్టుప్" ఛందస్సునకు మెరుగులుదిద్ది, సొంపులుగూర్చి రామాయణ మహాకావ్యాన్ని సృష్టించారు. దానిని పాడి వినిపించడమేగాక, వీర గాథలు పాడేవారికి కూడా నేర్పారు.

ఈనాడు హరికథలు చెపుతున్న వారిని హరిదాసులు అంటున్నట్లే ఆనాడు వీరగాథలు పాడి వినిపించేవారిని "కుశీలవులు" అన్నారు. వాల్మీకి మహర్షికి కూడా రామాయణ కావ్యాన్ని గానం చేసినందున "కుశీలవుడు" అనే పేరు అయనకుకలిగి వుండవచ్చు.

వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని గానంచేస్తే ఉగ్ర శ్రవ, వైశంపాయన, సంజయులు భారత గాథలను వర్ణించి చెప్పారు.

ఇలాంటి కథలు, గాథలు. ఈజిప్టు, గ్రీస్, రోమన్, జర్మన్, పురాణాలలోను, పూర్వ నిబంధన గ్రంథం (ఓల్డ్ టెస్టమెంట్) లోను అనేక మున్నాయి. మన రామాయణ, మహాభారతాలకు మూలమైన కథల లాంటివి, ఇతర దేశాల పురాణాలలో కూడా వున్నాయి.

"రామ" అనే పేరుగలవారు యూరప్, ఆసియాలోని ఆర్యులలోనే గాక అసీరియన్, ఆర్మీనియన్, హీబ్రూ, ఫోనీషియన్, అరబిక్,

ఇథియోపిక్ భాషలు (సెమెటిక్ భాషలు) మాట్లాడే వారిలోను, లాటిన్ భాష మాట్లాడే వారిలోకూడా వుండెవారు.

మొదటి రామాస్, రెండవ రామాస్, మూడవ రామాస్, అను వారలు ఈజిప్టులో రాజ్య మేలారు. యూదుల గ్రామాలకు కూడా "రామా" అనే పేర్లున్నాయి. సమాయేల్ జన్మస్థానం రామా. యాకోబ్ మేనమామ గారి ఊరిపేరు పద్దనరామ్. యూదా వంశంలో ఆరాము, యెహోరాము అను పేర్లు గలవారున్నారు.

క్రీస్తుపూర్వం ఎనిమిదో శతాబ్దంలో రోమ్ నగర నిర్మాణానికి పునాది వేసినవాడు "రాములస్" అను పేరుగల పశుల కాపరి. ఆయన లాటిన్ తెగలలో పుట్టినవాడు. పునాదిరాయి వేసినవాడు రాములస్ కాబట్టి ఆ పట్టణానికి "రోమ్" అనే పేరు కలిగింది.

"నాలుగువేల సంవత్సరాల క్రితం రూపొందిన రామకథకు సంబంధించిన చారిత్రక విషయాలు కనగొనడం చాలా కష్టం. అయినప్పటికి జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దీనిని సమగ్రంగా పరిశీలించ వలసివుంది .....పాండవులకు సంబంధించిన కథ ఒకే విధంగా వున్నది కాని, రామకథ అలాలేదు. మితాన్ని నుండి, ఇరాన్ వరకూ రామకథ వివిధ రూపాలలో అనేక దేశాలలో ప్రచారంలోవుంది. అంతేకాదు, రామకథను తూర్పు ప్రాంతాలలో రచించక ముందే, పశ్చిమాసియాలో, ప్రత్యేకంగా ఇరాన్‌లో రామ కథను రచించడం జరిగింది. అయినా, ఈ కథ లన్నింటి లోను భారత దేశంలో రచించిన రామకథ చాలా గొప్పది. మొహంజొదారోను జయించడానికి జరిగిన యుద్ధ ఘటనల చుట్టూ రామకథను అల్లి అద్భుతమైన రామాయణ కావ్యాన్ని రచించారు". అన్నారు సుప్రసిద్ధ చరిత్ర కారుడు, చారిత్రక ఘటనల క్రమాన్ని రూపొందించే సంస్థకు డైరెక్టరు అయిన శ్రీ యస్. బి. రాయ్.

కాగా, వాల్మీకి మహర్షి తనే రామాయణ మహా కావ్యాన్ని ప్రారంభించేటప్పటికే, రామకథ మంచి ప్రచారంలో వున్నదని చెప్పవచ్చు.

రామకథ ఎవరిది ?

అసలీ కథ ఎవరిది? ఆర్యులదా? ఇతరులదా? అనేసందేహం కలుగవచ్చు. కాని, రామకథ ఆర్యులదేనని విస్సందేహంగా చెప్పవచ్చు.

"వేద కాలంనాటి ఆర్యులచరిత్ర,నాగరికత యావత్తూ "ఆర్యానా"కు సంబంధించినవే. పశ్చిమాన జాగ్రుప్ పర్వతాలు, తూర్పున యమునావది, ఉత్తరాన దక్షిణరష్యా,దక్షిణాన అరేబియా సముద్రం వరకూ "ఆర్యానా" ఉన్నది. ఈ ప్రాంతంలో ఆర్యులు స్వేచ్ఛగా, తమ ఇష్టం వచ్చినట్లుగా తిరిగారు. పశ్చిమ ఆసియా కూడా కొంతకాలం వారి పలుకుబడిలో వుంది." అన్నారు శ్రీ యస్. బి. రాయ్.

ఆర్యానా ప్రాంతంలో వివసించిన ఆర్యులు అటుపిమ్మట, ఇటు వింధ్య పర్వతాలవరకూ, అటు యూరప్ ఖండంలోని ప్రష్యావరకూ విస్తరించారు.

"ఆర్యులూ, సెమైట్లూ (సెమ్ అనే పురుషుని వంశంవారు)జంతువులను మచ్చికచేసి పెద్ద పెద్ద మందలను పెంచారు ఇతర అనాగరిక ప్రజల కన్నా వారు ముందుకు పోవడానికి కారణ మిదే ననిపిస్తుంది. యూరప్, ఆసియాలలోని ఆర్యులు నేటికీ పశువులకు ఒకే పేర్లను వాడుతున్నారు. కాని, సాగుచేస్తున్న మొక్కలపేర్లు మాత్రం వేరు.....పశువుల మందలను పెంచడం వలన, అందుకు తగిన అవకాశాలున్న పచ్చిక మైదానాలలో వారు జీవించ వలసి వచ్చింది. యూఫ్రేట్, టైగ్రిస్ నదీ తీరాలలోని పచ్చిక బీళ్ళలో సెమెటిక్ ప్రజలు-హిందూదేశపు నదీ తీరాలలోను, ఆక్సెస్, జెక్జార్టెస్ నదుల తీరాలలోను, డాన్, డ్నీపర్ నదుల తీరాలలోను ఉన్న పచ్చిక బీళ్ళలో ఆర్యన్ తెగలవారు ఇలాగేజీవించారు" అన్నారు ఏంగెల్స్.

కాబట్టి. యూఫ్రేట్, టైగ్రిస్ నదీ తీరాలలో వృద్ధిపొందిన సెమెటిక్ ప్రజలు మధ్యధరా సముద్ర ప్రాంతాలలో విస్తరించి, అరేబియా నుండి,ఇజ్రాయేల్ వరకూ పలుతావులలో స్థిరపడ్డారని చెప్పవచ్చు.ఇలాగే, ఇరాన్‌లోని అరియానానుండి విస్తరించిన ఆర్యులు భారత ఉపఖండంలోని గంగా యమునా సింధు వరస్వతీ నదుల తీరాలలోను, సోవియట్ తుర్కు-

మేనియాలో గల ఆక్సెస్ (అమూదర్యా), జెక్జార్టెస్ (సిర్ దర్యా) నదీ తీరాలలోను, సోవియట్ యు క్రైన్‌లో వున్న డాన్, డ్నీపర్ నదీ తీరాల లోను వృద్ధి పొందడమేగాక భారత ఉపఖండంలోని ఇతర ప్రాంతాలకు, యూరప్ ఖండంలోని మరికొన్ని ప్రాంతాలకు కూడా వెళ్ళి, స్థిరపడ్డారని చెప్పవచ్చు.

ఇలా విస్తరించిన ఆర్యులతో పాటే రామకథ కూడా పాక్రిపోయింది. అయినా, ఆసియాలో జరిగినట్లుగా యూరప్‌లో రామకథా రచన జరగలేదు.

పశ్చిమాసియా ప్రాంతం కూడా కొంతకాలంపాటు ఆర్యుల పలుకుబడిలో వుంది కాబట్టి, ఆర్యుల రామకథ సెమిటిక్ ప్రజలలో వ్యాప్తిజెంది వుండవచ్చు. ఆర్యుల నివాస కేంద్రం ఇరాన్‌లోను, సెమైట్ల నివాస కేంద్రం ఇరాక్‌లోను వున్నందున, ఇరు తెగలమధ్య కొన్ని ఆదాన ప్రదానాలు జరిగి వుండవచ్చు. ఆ స్థితిలో ఆర్యుల రామకథను సెమెటిక్ ప్రజలు స్వీకరించి ఉండవచ్చు.

అలాగే యూరప్ ఖండపు ఆగ్నేయ భాగంలోను, ఆసియా ఖండపు వాయవ్య భాగంలోను గల పలు సంచార తెగలవారు కూడా రామకథను తెలుసుకొని ఉండవచ్చు.

ప్రకృతిని ఆరాధించే ప్రాచీన కాలపు ఆర్య సంస్కృతినుండి గ్రీక్ పురాణగాథాశతం పరిణతి పొందాయనే అభిప్రాయాన్ని ఫ్రెడరిక్ ఏంగెల్స్ వెలిబుచ్చారు. ఆ స్థితిలో ఆర్య సంస్కృతీ ప్రభావం సెమెటిక్ ప్రజల పురాణ గాథలమీద కూడా ప్రసరించకుండా వుంటుందా?

ఆర్య సంస్కృతీ ప్రభావం ఆర్యేతర తెగలమీద ప్రసరించినట్లే, ఆర్యేతర తెగల సంస్కృతుల ప్రభావం ఆర్యులపైన ప్రసరించింది. కనుకనే మన పురాణ గాథలకు, ఈజిప్టు, గ్రీకు పురాణగాథలకు పాత నిబంధన గ్రంథం(ఓల్డు టెస్టమెంట్)లోని గాథలకు అనేకపోలికలు కనిపిస్తున్నాయి.

రామకథలాంటి కథ బైబిల్‌లో వుంది. దశరథునకున్నట్లే అబ్రహామకు ముగ్గురు భార్య లున్నారు.దశరథుడు తన పెద్దకొడుకైన రాముని అడవికి పంపినట్లుగానే, అబ్రహాముకూడా తన పెద్దకొడుకైన ఇష్మాయేలును అడవికి పంపాడు దశరథుని రెండవభార్యయైన కైకేయికి పుట్టిన

భరతునకు రాజ్యం దక్కినట్లుగానే అబ్రహాం రెండో భార్య "కేరా"కు పుట్టిన "ఇస్సాక్"కు సంపద దక్కింది.

వయసులోనుండగా దశరథునకు సంతానం కలుగలేదు. వృద్ధాప్యంలో కలిగారు. అబ్రహాముకు కూడా అలాగే కలిగారు. యజ్ఞఫలంవల్ల దశరథునకు కొడుకులు పుడితే, దేవుని ఆశీర్వాదం వల్ల అబ్రహాముకు కొడుకులు పుట్టా రన్నారు.

దశరథుడు, కైకేయి కిచ్చిన వరాన్ని కాదనలేక శ్రీరాముని అడవికి పంపినట్లుగా రామాయణంలో వుంటే, దేవుడైన యెహోవా ఆజ్ఞానుసారం అబ్రహాం, కేరా కోరికను మన్నించి, ఇష్మాయేలును అడవికి పంపినట్లుగా బైబిల్‌లో వుంది.

తిరిగి, ఇస్సాకు కొడుకుల విషయంలో కూడా ఇలాగే జరిగింది.

ఇస్సాకు భార్య "రిబ్కా". ఆమెకు కవలపిల్లలు పుట్టారు. పెద్దవాని పేరు "ఏశావు". చిన్నవాని పేరు యాకోబు.

చిన్నకొడుకుపైన అమితమైన ప్రేమగల రిబ్కా ఒక యుక్తిపన్ని, అంధుడైన ఇస్సాకు సంపద యావత్తూ చిన్న కొడుకైన యాకోబుకు దక్కేలా చేసింది. పెద్దకొడుకైన ఏశావును చిట్టడవులలోకి నెట్టింది.

కాని, రామునివలెనే ఏశావు విలువిద్యలో మేటి. కాబట్టి, యాకోబుకు ప్రమాదం జరుగుతుందనే భయంతో అతనిని, రిబ్కా తన పుట్టినింటికి పంపివేసింది. భరతుడు తన మేనమామల వద్ద నున్నట్లుగానే, యాకోబ్ కొంతకాలంపాటు తన మేనమామలవద్ద ఉన్నాడు. తరువాత తిరిగివచ్చి తన సంపదను ఏశావుకు సమర్పించాడు.

యాకోబ్ తన అన్నగారైన ఏశావుకు పశువుల మందలను సమర్పించగా, భరతుడు తన అన్నగారైన శ్రీరామునకు రాజ్యాన్ని సమర్పించాడు. కైకేయి తన సవతి కొడుకైన రాముని అడవులకు పంపితే, కేరా తన సవతి కొడుకును, రిబ్కా తాను కన్నకొడుకునే అడవులపాలుచేశారు.

ఇక్కడి దశరథుని వంటివారే అక్కడి అబ్రహాము, ఇస్సాకులు. ఈ కథలోని భరతునివంటివాడు ఆ కథలోని యాకోబ్. ఇక్కడ కైకేయిలా, అక్కడ కేరా, రిబ్కాలున్నారు. ఈ కథలోని రాముడిలా ఆ కథలో ఇష్మాయెల్, ఏశావులు కనుపిస్తున్నారు. ఇది ఒకే కథానికి సంబం

ది చిన కథ. అది రెండు తరాలకు సంబంధించిన కథ. ఇక్కడ స్వార్థానికి మూలం రాజ్యం. అక్కడ పశుసంపద. అదే తేడా.

రెండు కథలూ రక్తసంబంధానికి ప్రాముఖ్యతనిచ్చాయి. అక్రమమో, సక్రమమో, ఏమైనాగానీ, తండ్రిమాటను కొడుకులు పాటించి తీరాలని చాటి చెప్పాయి. పడుచుపెళ్ళాల మీదగల మోహంతో, ముసలి మొగుళ్లు తప్పులు చేసినా, కుటుంబం దెబ్బతినకుండా వుండాలంటే, వారి కొడుకులు త్యాగం చేయడం అవసరమని నొక్కి చెప్పాయి.

అయినా ఈ కథలోని పాత్రల పేర్లు వేరు. ఆ కథల్లోవి పాత్రల పేర్లు వేరు. కాబట్టి పాత బంధన గ్రంథంలోవికథ సెమిటిక్ ప్రజలవనీ, రామకథ ఆర్యులవనీ ఖచ్చితంగా చెప్పవచ్చు.

కాని, పెరూ దేశంలోని "ఇంకా" జాతివారికీ, ఆర్యులకూ ఏమైనా సంబంధము-దా? లేదా? ఏ సంబంధమూ లేనట్లయితే "ఇంకా" జాతి ప్రజలు సీతారాములను పూజించడానికీ, సూర్యవంశం వారమని చెప్పుకోవడా.కీ కారణమేమిటి? అనే ప్రశ్నకు ఇదమిత్థంగా చెప్పగలిగిందేమీలేదు.

ఒకవేళ ఆర్యజాతికి చెందిన వారెవరైనా, మధ్యధరా సముద్రతీరాల వీడుగా పయనించి, అట్లాం క్ మహాసముద్రాన్ని దాటి దక్షిణ అమెరికా ఖండంలో ప్రవేశించారా? లేక, ఆర్య సంస్కృతీ ప్రభావానికి లోనైన ఏదో ఒక తెగవారు, ఆగ్నేయాసియానుండి పసిఫిక్ మహాసముద్రాన్ని దాటి వెళ్ళారా? అవి తెలుసుకోడానికి సమగ్రమైన పరిశోధనలు జరగాలి. అంతవరకూ ఏమి చెప్పడానికీ వీలులేదు.

అనాగరిక యుగం మధ్యలోనే రామకథ పుట్టింది

"ఆటవిక దశలోని మానవుడు, చెట్ల బెరడునుంచి నారతీసి వల్కలాలు తయారు చేసుకున్నాడు. వడపలు, చువ్వలతో బుట్టలు అల్లుకున్నాడు. రాతి గొడ్డలిని తయారు చేయడంతో, బుర్రదోనెలను నిర్మించడం సాధ్యమైంది. కొన్నిచోట్ల దూలాలతో, వాసాలతో కిళ్లు కట్టడంకూడా నేర్చుకున్నారు. వారి సాధారణ ఆయుధాలు గద, ఈటె. ప్రధాన ఆయుధ పిల్లలు. పిల్లు, నారి, అంబు తయారు చేయడానికి అనేక విష

యాల పరిజ్ఞానం కావాలి. కాబట్టి విల్లంబులు తయారు చేసుకున్న వారికి మంచి అనుభవం, నిశితమైన ఊహాజ్ఞానం కలవనుకోవాలి. అయినా వారికి కుండలు చేయడం తెలియదు ఈనాడు అమెరికా వాయవ్య భాగములోని రెడ్ ఇండియన్లు సరిగ్గా ఇదే దశలో వున్నారు" అన్నారు ఫ్రెడరిక్ ఏంగెల్స్.

"కుండలు చేయడం నేర్చుకోవడంతో మానవుడు ఆటవిక దశను దాటి, అనాగరిక దశలోకి మారడం ప్రారంభమవుతుంది" అన్నారు మోర్గన్.

"కాబట్టి, పర్వతాలలోని గంభీరగొడ్డలి, రామలక్ష్మణుల విల్లంబులు, వాలి సుగ్రీవుల గదలు, గుహల దుర్భేద్యమైన నారచీరలు, పర్ణశాలలు, కుటీరాలను దృష్టిలో నిడుకొని పరిశీలించినప్పుడు—ఆర్యులు ఆటవిక దశను దాటి అనాగరిక దశలో అడుగిడిన సమయంలోనే రామకథ పుట్టిందని చెప్పవచ్చు" అంటున్నారు కొందరు పరిశోధకులు.

కాని, అనాగరిక దశలో ప్రవేశించిన ఆర్యులు మరికొంత పురోగమనాన్ని సాధించిన తర్వాతనే రామకథ పుట్టిందని చెప్పడానికి తగిన బలమైన ఆధారాలున్నాయి.

"పూర్వార్థ గోళంలో పాలకూ, మాంసానికీ పనికి వచ్చే జంతువులను మచ్చికజేసి, పెంచడం ప్రారంభించిన నాటినుండీ అనాగరిక యుగపు మధ్య దశ ఆరంభమైంది.....పాలూ, మాంసమూ బిడ్డల పెరుగుదలకు బాగా తోడ్పడతాయి. ఆర్యులు, సెమైట్లు బాగా వృద్ధి పొందడానికి కారణం, బహుశా అవి రెండూ వారికి సమృద్ధిగా ఉండడమే కావచ్చు" నన్నారు ఏంగెల్స్.

ఆయనే మరోచోట ఇలా అన్నారు :

"ఆసియాలో మచ్చికచేసి పెంచడానికి వీలయిన జంతువులను కనుక్కున్నారు. అడవి దున్నల్ని, గేదెల్ని అయితే వేటాడి పట్టుకోవాలి. అదే మచ్చికపడ్డ గేదె అయితే రోజూ పాలిస్తుంది. ఏటా వో దూడను పెడుతుంది. బాగా అభివృద్ధి పొందిన ఆర్యులు, సెమైట్లు, బహుశా తురా

ియన్ మున్నగు తెగలవారంతా పశువులను మచ్చికజేసి, మందను పెంచడం వృత్తిగా పెట్టుకున్నందు వల్ల నే వృద్ధిపొందారు. అందుకే, అనాగరిక జన సామాన్యంనుంచి గోపాలక జాతులు విడిపోయాయి. ఇదే మొట్టమొదటి సామాజిక శ్రమ విభజన. ఇతర అనాగరిక జాతులకన్నా గోపాలకులు, జీవితావసర వస్తువులను హెచ్చుగా సంపాదించుకోగలిగారు. పాలు, పాలతో తయారుచేసిన పదార్థాలు, ఉన్ని, గొర్రెబొచ్చును వడికి తయారుచేసిన బట్టలవంటి కొత్త కొత్త వస్తువులను సమకూర్చుకోగలిగారు" అన్నారు ఏంగెల్స్.

కాగా, పశువులను మచ్చికజేసి పెంచడం ప్రారంభించిన తర్వాతనే ఆర్యులకు, సెమిటిక్ ప్రజలకు సంపద లభించిందనీ, ఆ సంపదను పెద్ద కొడుకుకు దక్కకుండా చేసి చిన్న కొడుకుకు కట్టబెట్టడం వల్లనే రాము కథ లాంటి కథలు పుట్టాయని చెప్పవచ్చు.

సెమైట్ తెగలోని అబ్రహామ్, ఇస్సాక్, ఏశావ్, యాకోబ్‌ల సంపద పశు సంపద. వాటికి గొర్రెల మందలను కాసేందుకు కొందరు బానిసలు కూడా ఉన్నారు కాని, వారి కప్పటివరకూ స్థిర నివాసములు లేవు. వ్యవసాయం లేదు. అబ్రహామ్ తన పెద్దకొడకును అడవికి పంపి, చిన్న కొడుకుకు కట్టబెట్టినది గొర్రెల మందలు మాత్రమే. ఇస్సాక్, యాకోబ్‌కు కట్టబెట్టినది కూడా పశుసంపదే. వీనికి సంబంధించినవే అబ్రహాము, యాకోబు మున్నగు వారి కథలు.

కాగా, రామకథ కూడా పశు సంపదకు సంబంధించినదే అయి ఉంటుందనీ, ఆర్యులు అనాగరిక యుగపు మధ్య దశలో ఉన్నప్పుడే ఈ కథ పుట్టి ఉంటుందనీ చెప్పవచ్చు.

పశుసంపదను పెంచుకుంటూ ముందుకు పోతున్న పశుపాలక జాతుల్లో స్త్రీల ప్రాముఖ్యత తగ్గింది. పురుషుల ఆధిక్యత హెచ్చింది. తండ్రి సంపదకు వారసులు కొడుకులైనప్పటికీ తండ్రి మాటను కాదనటానికి వీలులేని రోజులవి.

తనకున్న సంపదనంతటి, కుటుంబ పెద్ద ఎందరు స్త్రీలనయినా పెళ్ళాడవచ్చు. ఆ స్త్రీలలో కొడుకులు లేని వారి గతి ఆధోగతే. కొడుకులున్నా, వారి చేతిలో సంపద లేనప్పుడు బానిస బ్రతుకు తప్పదు. కను

కనే ఏలో ఒక విధంగా భర్తను వంలో వేసుకొని తమ కొడుకులకు అప్పని, అధికారాన్ని సంపాదించి పెట్టేందుకు శాతా, క్రైకేయిలాంటి వారు కుట్రలు పన్నారు.

అలాంటి చరిత్రలో రక్త సంబంధానికి ప్రాముఖ్యతను కల్పించేందుకు పితృవాక్యపాలన, భ్రాతృవాత్సల్యత, త్యాగం, పాతివ్రత్యం మున్నగు నీతులు బోధించేందుకు రామకథ లాంటిని చక్కగా ఉపయోగపడ్డాయి

ఇచట గమనించవలసిన మరో విషయమేమంటే, ఆర్యులు భారత ఉపఖండంలో ప్రవేశించినప్పుడు వారికి రాజ్యాలులేవు. పశువుల మందలు మాత్రమున్నాయి. అప్పటికే రామకథ ఉంది. కాబట్టి, ఆర్యులు గోపాలురుగా సంచరిస్తూ రామకథ పుట్టిందనీ, సింధు నాగరికతకు కేంద్రబిందువైన హరప్పా, మొహంజొదారోలను ఆర్యులు జయించిన తరువాత, అదొక మహాపీఠిని కథగా మారి ఉంటుందనీ, అటుపైన మరికొంత కాలం గడచిన పిమ్మటనే వాల్మీకి మహర్షి రామాయణ మహా కావ్యాన్ని రూపొందించారని చెప్పవచ్చు.

సింధు నాగరికత.

భారత ఉపఖండంలో ఆర్యులు అడుగు పెట్టేటప్పటికే హరప్ప, మొహంజొదారో మొదలైన ప్రాంతాలలో సింధు నాగరికత కలదనుట నిస్సందేహం. ఈ పురాతన నాగరికత ఈజిప్షియన్, బాబిలోనియన్, సుమెరియన్ నాగరికతలకు దీటు రాగలవని పలువురు శాస్త్రజ్ఞులు చెప్తున్నారు.

మొహంజొదారో, హరప్పలలో అనేక ప్రత్వ్యకాలు జరిగాయి. ఆ ప్రత్వ్యకాలలో కోట గోడలు, రెండంతస్తుల భవనాలు, రహదార్లు, భూగర్భ మురుగునీటి కాల్వలు, మంచినీటి గొట్టాలు, స్నానపుగదులు, ధాన్యాగారాలు, రంగురంగుల మట్టి పాత్రలు, రాగిరేకులు, సీళ్ళు, కంచుతో తయారు చేసిన పనిముట్లు, రాగిబాణాలు, ఆభరణాలు, సుమారు మూడువందల గుర్తులుగల చిత్ర లిపి బయటపడ్డాయి.

ఇంత ఉచ్ఛస్థితిలోనున్న ఈ నాగరికత ఎవరిది? ద్రవిడులదా? దానవులదా? రాక్షసులదా? మరొకరిదా? ఎవరిది? ఒకవేళ దానవ రాక్షస తెగలు కూడా ద్రావిడ తెగలలోనివే కాదుగదా?

ఇది ద్రావిడుల నాగరికతేనని హరాన్ మక దేవులు అంటున్నారు. ఈ విషయంలో తుది నిర్ధారణ జరుగవలసి వున్నది దంటున్నారు శ్రీ యస్.బి. రాయ్.

"హరప్ప రాజ్యం, రెండు సన్నిహిత సాంస్కృతిక సంబంధాలు గలది కావచ్చును. ఉత్తర భాగంలోని దానవ సంస్కృతికి హరప్ప కేంద్రం అయి వుండవచ్చు. దక్షిణాన గల రాక్షస రాజ్యానికి మొహంజొదారో రాజధానియై ఉండవచ్చు. యీ రెండు దేశాలవారూ శివ-పశుపతిని, ఆదిశక్తిని ఆరాధించారు" అన్నారు యస్ బి రాయ్.

ఈ ప్రజలను గురించిన సమాచారం కొంతవరకు వైదిక వాఙ్మయములోనే వుంది. "వీరి శరీరచ్ఛాయ నలుపు. ముక్కులు చప్పిడి ముక్కులు. నేటికి నాలుగువేల సంవత్సరాల క్రితమే వీరికి మంచి కోటలు, పట్టణాలు వున్నాయి. సారవంతమైన పంట పొలాలున్నాయి. ధనిక వర్తకులున్నారు. వ్యవసాయం చేయడం, నూలువడకడం, బట్టలు నేయడం, మట్టిపాత్రలు, రాగిపాత్రలు తయారు చేయడం, వెండి, బంగారు నగలు తయారు చేయడం వీరికి బాగా తెలుసునన్న విషయాలు వైదిక వాఙ్మయంలో కనుపిస్తున్నాయి" అన్నారు శ్రీ కె. దామోదరన్—

(ఇండియన్ థాట్ పేజి 17.)

ఇంతగా అభివృద్ధి చెందిన వారిని, ఆర్యులెలా జయించారు? ఏ శీలలో జయించారు?

ఆర్యులు పిలువిద్యలో ఆరితేరిన వారు. శిరస్త్రాణాలు, కవచాలు, ఇనుముతో తయారు చేసిన కత్తులు, కఠార్లు వంటి ఆయుధాలు వారికున్నాయి. గుర్రాలున్నాయి. రథాలున్నాయి. హరప్పా, మొహంజొదారోలను జయించి; అచటిగల సంపదను, సారవంతమైన భూములను స్వాధీనం చేసుకునేందుకు ఆర్యులు అందరూ ఏకమై తెగబడి పోరాడారు.

దానవ, రాక్షసాది తెగల ప్రజలవద్ద ఇనుముతో తయారు చేసిన ఆయుధాలు లేవు. అప్పటికింకా ఇనుమును వెలికి దీయడం, పోత పోయడం వారికి సరిగా తెలియదు. గుర్రాలు, రథాలు వారికి లేవు. విలువిద్యలో నిపుణత్వం లేదు. పైగా వారిలోనుండి కొందరు విభీషణాయలు బయలుదేరి ఆర్యులతో చేతులు కలిపారు. మొత్తం వానర తెగవారంతా ఆర్యుల పక్షాన చేరిపోయారు. కాగా, ఆర్యులు విజయం పొందారు.

మూడువందల ఏండ్లపాటు సాగిన, జర్మన్ తెగల తిరుగుబాటులకు, దాడులకు తట్టుకోలేక, సుఖ సంపదలతో తుల తూగిన రోమన్ సామ్రాజ్యం కూలిపోయినట్లే, అనేక యుద్ధాలకు పిమ్మట సింధు నాగరికతకు అలవాలమైన పట్టణాలు, ప్రాంతాలు ఆర్యుల ఆధిక్యతకు లోనైనాయి.

బహుశా ఆర్య—ఆర్యేతరుల మధ్య జరిగిన యుద్ధాలు మారేడ్లపాటు జరిగి వుండవచ్చు. కనుకనే దేవ-దానవ యుద్ధాలు శత

సంవత్సర పర్యంతం సాగినట్లుగా వర్ణించారేమో? శంభాసుర మిత్రుడైన తిమిధ్వజునిపై దశరథుడు పోరాడినది ఆ యుద్ధాలలోనే. మక్రాన్ ప్రాంతంలో సముద్రపు ఒడ్డున నివసిస్తూ, చేపలు తిని జీవించే "ఇచ్ఛిమాగి" తెగకు తిమిధ్వజుడు నాయకుడై వుండవచ్చునని చరిత్రకారు లూహిస్తున్నారు.

"నాలుగువేల సంవత్సరాల క్రితం జరిగిన దేవ-దానవ యుద్ధాల తరువాతనే, ఆర్యులొక వెల్లువగా ప్రపంచరంగంలో అడుగుపెట్టారు" అని శ్రీ యస్.బి. రాయ్ చెప్పుతున్నారు.

ఆ యుద్ధాలలో దానవులు, రాక్షసులు హోరాహోరీగా ఆర్యులతో పోరాడినందున, ఆర్యులు వారిని చాలా విశ్వతంగానూ, ఘోరంగానూ చిత్రించారు. అయినా సత్యాన్ని మరుగు పరచడం దుర్లభం కదా? అభేద్యమైన కోటలు, పట్టణాలుగల త్రిపురాసురులు, తత్వవేత్తలైన విరోచనుడు, ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి, రావణబ్రహ్మ మున్నగు వారంతా దానవ, రాక్షస తెగలకు చెందినవారు కాదా? కశ్యపబ్రహ్మకు - దితికి అసురులు పుట్టిన తరువాతనే, కశ్యపబ్రహ్మకు- అదితికి సురలు పుట్టారట కదా? రావణుడు శతకోటి శివలింగాలను పూజించాడనీ, ఆయన లంక స్వర్ణలంక అనీ పురాణాలలో వ్రాయలేదా? ఇంతకూ రావణుని స్వర్ణలంక ఎక్కడున్నట్లు?

"సింధు తక్షశిల గణంపై పాణిని రూపొందించిన సూత్రాలను పరిశీలిస్తే, ఆయనకు తెలిసిన కిష్కింధ సింధునదీ ప్రాంతంలో గానీ, సింధునదికి పశ్చిమంగా గానీ వుండవచ్చును..... ఒకవేళ కిష్కింధను బెలూచిస్థాన్‌లోని "కలాత్"గా పరిగణించినట్లయితే, అప్పుడు రావణుని రాజ్యం సింధు, కచ్, గుజరాత్ ప్రాంతాలలో వుండవచ్చు. ఈ ప్రాంతాలన్నీ హరప్ప నాగరికత విస్తరించిన ప్రాంతాలుగా పరిగణింపబడుతున్నాయి..... సింధునది, నారాయుపుల మధ్య మొహంజొదారో ఒక ఉంతలాగా వున్నది. కాగా మొహంజొదారో పట్టణాన్ని స్వర్ణలంకగా పరిగణించేందుకు అవకాశం కల్పించే పురావస్తు, సాహిత్య సంబంధమైన సాక్ష్యాధారాలు కొన్ని వున్నాయి' అని 1977 జనవరి 19 తేదీగల పత్రికల్లో శ్రీ యస్.బి. రాయ్ గారొకవ్యాసం వ్రాశారు.

వింధ్యకు ఉత్తరాన గల ఛోటానాగపూర్ ప్రాంతంలోనో, మధ్య చోటనో రావణాసురుని స్వర్ణలంక వుండేదని, యాకోబి, డాక్టర్ శంకాలియా, డాక్టర్ పుసాల్కర్ కూడా అభిప్రాయపడ్డారు.

కాబట్టి దశానన రావణుని లంక శ్రీలంక కాదనీ, హరప్ప నాగరికత విస్తరించిన ప్రాంతాలలో ఎక్కడో ఒక చోట వుండేదని చెప్పవచ్చు. దానవ, రాక్షస తెగలను జయించి హరప్ప, మొహంజొదారోలపై ఆర్యులు తమ ఆధిక్యతను నెలకొల్పుకున్న తరువాతనే రామకథకు యుద్ధ ఘటిన చేర్చబడ్డాయని కూడా గట్టిగా చెప్పవచ్చు.

ముఖ్యంగా మనం గమనించవలసిన మరొక విషయ మేదంటే తేరవాద బౌద్ధుల రామకథలోను క్రీ॥శ॥ 412లో చైనీస్ భాషలోకి అనువదింపబడిన రామాయణంలోను సీతాపహరణ గానీ, రావణ సంహారం గానీ లేవు. సీతాదేవిని వాల్మీకి ఆశ్రమానికి పంపినట్లుగా గానీ, కుశలవులు జన్మించినట్లుగా గానీ కూడా లేవు.

వాల్మీకి రామాయణానికి ముందుగల కొన్ని రామకథలలో రామ రావణ యుద్ధ ప్రసక్తి లేదు గనుకనే, "జయము" అను పేరు రామాయణమునకు కలుగలేదేమో?

తేరవాదబౌద్ధుల రామకథను, చైనీస్ రామాయణాన్నిబట్టి చూస్తే, దశరథుడు పది రథములు కలవాడు కాదు. పదిరథము, విలాసాలను మరిగినవాడు. కనుకనే ప్రియురాలికి భయపడి రాముని అడవికి పంపించాడు. తండ్రి మాటను రాముడు పాటించాడు. అన్నపైగల ప్రేమవల్ల లక్ష్మణుడు రామునితో వెంటవెళ్లాడు. సీతకూడా భర్తను అనుసరించింది. పన్నెండేళ్ళ తరువాత సీతారామలక్ష్మణులు అయోధ్యకు తిరిగొచ్చారు. రాజ్యమేలవలసిందిగా భరతుడు కోరినా, రాముడు అంగీకరించలేదు. చివరకు అనేకులు చెప్పగా, భరతుడు అదేపనిగా ప్రాధేయపడగా శ్రీరాముడు పట్టాభిషిక్తుడైనాడట.

మరొక రామకథ ప్రకారం, దశరథుడు వృద్ధుడు. కైకేయి చాసుడు అయినా, రామునిపై ప్రేమ గలవాడు. కైకేయివల్ల రామునికేదైనా ప్రమాదం కలగవచ్చుననే అనుమానం ఆయనకుండేది. కాగా, ఒకనాడాయన ఒక జ్యోతిష్కుని పిలిపించాడు. "ఇంకా నేను ఎన్నాళ్ళు

బ్రతుకుతానో చెప్పు" అని అడిగాడు. అంతట, ఆ జ్యోతిష్కుడు ఏవేవో లెక్కలు వేసి "మీరు మరొక పన్నెండేళ్లు బ్రతుకుతారు" అని గట్టిగా చెప్పాడు.

తరువాత దశరథుడు, తన అధికారం బ్రకిందగల ఆటవికులవద్ద రాముడు సుఖంగా ఉండడానికి తగిన ఏర్పాట్లుచేసి "ఇక్కడ వుంటే నీకు ఏదైనా బ్రమాదం జరగవచ్చు. కాబట్టి, పన్నెండేళ్ళపాటు ఆటవికులవద్ద ఉండిరా. అప్పటికి నేను మరణిస్తాను. రాజ్యం నీకు చక్కబడుతుంది" అని చెప్పి రాముని అడవికి పంపాడు.

కాని, దశరథుడు త్వరలోనే మరణించాడు. అయినా రాముడు తిరిగి రాలేదు. భరతుడు వేడినా రాముడు అంగీకరించలేదు. పన్నెండేళ్ళు పూర్తి అయిన తరువాతనే తిరిగి వచ్చి రాజ్యభారం వహించాడు.

ఈ కథలవల్ల మనకు బోధపడుతున్నదేమిటి? వాల్మీకి రామాయణం బాలకాండమందే రకరకాల రామకథ లున్నాయనుట స్పష్టం. ఈ కథలలో నొకదానికి ఆర్య, ఆర్యేతరుల మధ్య జరిగిన యుద్ధఘటనలను చేర్చి వాల్మీకి మహర్షి తన రామాయణ మహాకావ్యాన్ని రచించారనుట కూడా స్పష్టమేకదా?

భారతం

భారతగాథ, రామాయణగాథకు భిన్నమైనది. రామాయణగాథకు మూలాధ్యాగం. భారతగాథకు మూలం రాజ్యకాంక్ష. అందువల్ల ఈ రెండిటి దృక్పథాలు, ప్రయోజనాలు వేరుగా వున్నాయి.

దానవ, రాక్షసాది తెగలతో ఆర్యులు పోరాడుతున్న సమయంలో ఆర్యులమధ్య మంచి ఐకమత్యం వుంది. రక్తసంబంధానికి గణనీయమైన ప్రాముఖ్యతవుంది. కాని, ఆర్యుల రాజ్యాలు విస్తరిస్తున్న కాలంలో, వారి రాజ్యకాంక్ష పెరగడంవల్ల, రక్తసంబంధానికి గల ప్రాముఖ్యత తగ్గడం ప్రారంభమైంది.

ఆ సమయంలో వంశగౌరవానికీ, రక్తసంబంధానికీ ప్రాముఖ్యత విస్తృ. వాల్మీకి మహర్షి రామాయణ మహాకావ్యాన్ని రచించాడు. ఏదో ఒక అవకాశం కలిగినంత మాత్రాన పెద్దవానికి చెందవలసిన రాజ్యాన్ని చిన్న వాడు అపహరించడం, ధర్మం కాదని రామాయణం నొక్కి చెప్పింది. అందుకు భరతుడే సాక్షి. రాజ్యకాంక్షతో ప్రవర్తిస్తే విభీషణాయలు కయా రవుతారనీ, రాజ్యం పరుల హస్తగతమవుతుండనీ చాటిచెప్పింది.

"కాలం గడచినకొద్దీ రక్తసంబంధం కరుడుగట్టిపోతుంది. సమాజంలో ప్రధానమైన మార్పులు సంభవించినప్పుడు మాత్రం, అది కాస్త కరుగుతుంది" అన్నాడు మార్క్స్.

ఆలాగే జరిగింది. ఆర్యుల రాజ్యాలు విస్తరించడం, ద్రవిడ, దానవ, రాక్షస తెగలతోసహా ఇతరులందరితోను ఆర్యులకు సంబంధ బాంధవ్యాలేర్పడడంతో ఆర్యుల ఆధిక్యత బాగా పెరిగింది. కాని, రక్తసంబంధానికిగల ప్రాముఖ్యత తగ్గింది.

ఆర్యులలోనే ఒకరి రాజ్యాన్ని మరొకరు ఆక్రమించడం ప్రారంభమైంది. దీనికి ఉదాహరణగా. ద్రుపదుని పాంచాలరాజ్యంలో సగభాగాన్ని ద్రోణుడు గుంజుకున్న ఉదంతాన్ని తీసుకోవచ్చు.

రామాయణ కాలంనాటికంటే, భారతకాలంనాటికి వ్యవసాయం మరి కొంత వృద్ధిపొందింది. రాజ్యాలు విస్తరించాయి. అంతటితో, ప్రజల పంచాయితీపాలన భగ్నమైంది. పురోహితుల ఆధిక్యత తగ్గిపోవడం, వీరుల (క్షత్రియుల) ఆధిక్యత పెరగడం ప్రారంభమైంది. విల్లునమ్ములతో పాటు రకరకాల ఆయుధాలు తయారైనాయి. యుద్ధవ్యూహాలు రూపొందాయి. రథ, గజ, తురగ, పదాతి దళాలేర్పడ్డాయి.

ఆర్యేతర తెగలకు చెందిన ప్రజలనేకులు ఆర్యులకు బానిసలైపోయారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాలకు శూద్ర (భూషణ) వర్ణం కలిసింది.

అలాంటి దశలో కులధర్మం (రక్తసంబంధానికి ప్రాముఖ్యతనిచ్చే గణధర్మం) వెనుకంజ వేసింది. స్వధర్మం (వర్ణాశ్రమధర్మం) ముందుకొచ్చింది. కులధర్మాన్ని అతిక్రమించడం పాపమంటూ ఆయుధ విసర్జన చేసిన అర్జునునకు శ్రీకృష్ణుడు బోధించినది స్వధర్మమేగదా?

భారతగాథ, ఈ దశకు సంబంధించినది గనుకనే "రాజ్యం వీర భోజ్యమ"ని చాటిచెప్పింది. ఎన్ని ఆటుపోటులు గలిగినా, కౌరవులుగాని, పాండవులుగాని, రాజ్యకాంక్షను విడనాడలేదు. సవాలక్ష గ్రంథం జరిగినా, వారి రాజ్యకాంక్ష అలాగే వుండిపోయింది. కనుకనే ఉభయపక్షాలవారూ అధర్మాలకు పాల్పడ్డారు. కురుక్షేత్ర యుద్ధంలో అన్నలు, తమ్ములు, తండ్రులు కొడుకులు, గురువులు, శిష్యులు ఒకరి నొకరు పొడిచి చంపుకున్నారు.

ఈ పరిణామం భారత దేశంలోనేగాక ఇతర దేశాలలో కూడా కనిపిస్తోంది. పాతనిబంధన గ్రంథం (బైబిల్) చదివితే ఈ విషయం స్పష్టంగా తెలిసిపోతుంది.

యెహోవా మందిరంలో యాజకుడుగా నున్న "ఏలీ" మంచివాడే. కాని, అయన కుమారులు దుర్మార్గులు. నైవేద్యమును స్వాహా జేయ డంతోపాటు, వ్యభిచరించడం వరకూ, వాళ్లు అనేక చెడుపనుల్లు చేశారు.

అందుచేత, సమూయేలు యాజకుడుగా నియమింప బడ్డాడు. సమూయేలు చాలా మంచివాడు. బుద్ధికుశలతగల న్యాయమూర్తి. కాని, ఆయన కొడుకులు లంచగొండులు. కాగా, మత పెద్దల గౌరవం, పలుకుబడి తగ్గాయి. ప్రజలకు న్యాయం చేకూర్చగలవారు కరువయ్యారు.

పైగా, ఆ సమయంలోనే ఫిలిష్తియులతో జరిగిన యుద్ధాలలో ఇశ్రాయేలీయులు ఓడిపోయారు. కాని వారింకా పోరాడగల స్థితిలోనే వున్నారు పూర్తిగా ఓడిపోకుండా నిలదొక్కుకునేందుకు, ఎదురుదెబ్బ కొట్టేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఆ రోజుల్లో పరాజయమంటే, సర్వనాశనమే. విజేతలైన సైనికులు, అధిపతులు, ఎవరికి దొరికింది వారు దోచుకునేవారు. ఓడినవారి కన్యలను చెరబట్టి, తక్కిన వారిని ఊడకోత కోసేవారు. లేదా, బానిసలుగా బ్రతుకనిచ్చి వారితో వెట్టిచాకిరీ చేయించుకునేవారు. పల్లెలను, పట్టణాలను తగుల బెట్టేవారు. ఆ దళాలలో విచ్చల విడిగా దోపిడీలుచేసే బందిపోటు ముకలు కూడా తయారయ్యాయి. ఒక్కొక్కప్పుడు ఈ బందిపోటు ముకలు కిరాయి సైన్యాలుగా యుద్ధాలలో కూడా పాల్గొనేవి.

పాత నిబంధన గ్రంథం చదివితే ఇలాంటి దురంతాలు ఎన్ని జరిగాయో, ఎలా జరిగాయో తెలుస్తుంది. ఈ దురంతాలు సెమిటిక్ తెగలలోనేకాదు; ప్రపంచ మంతటా జరిగాయి.

కొబట్టి, యుద్ధరంగంలో తమను గెలిపించడానికీ తమ సంపదను, భార్యాబిడ్డలను రక్షించడానికీ, పక్షపాత రహితమైన న్యాయం చేకూర్చడానికీ తగిన వీరుడొకడు రాజుగా వుండాలని ఇశ్రాయేలీయులు పట్టుబట్టారు. అందుకు సమూయేలు అంగీకరించక పోయినా వారు లక్ష్యపెట్టలేదు.

రాజుల పాలనలో సైనిక దళాలను, సర్వసన్నద్ధంగా ఉంచుకునేందుకు, అవసరమైన సంపదను రాజుకు కట్టబెట్టవలసి వుంటుందని వారెరుగుదురు. ప్రభుత్వానికి ఏటేటా పన్నులు చెల్లించవలసి వుంటుందనీ, రాజు చెప్పినట్లల్లా తాము చేయవలసి వుంటుందనీ వారికి తెలుసు. అయినా, తమ సంపదను శత్రువులు పూర్తిగా దోచుకుపోయేందుకు అవకాశమివ్వడంకన్నా, శత్రువు చేతిలో మరణించడం, లేదా శత్రువువద్ద బానిస

ఆగా పనిచేయడంకన్నా, ఒక రాజును ఏర్పరిచుకుని తమ సంపదను రాజుకు సమర్పించడం, తమ రాజు చెప్పినట్లు చేయడమే మంచిదని వారు భావించారు.

కాబట్టి, బెన్యామీను గోత్రంలోని మధ్రీ వంశం వాడైన సౌలును రాజుగా నియమించారు. అంతటితో యాజకుల, న్యాయాధిపతుల అధికృత తగ్గి రాజుల ఆధిక్యత పెరిగింది. రాజ్యం వీరభోజ్యమై పోయింది. రక్త సంబంధానికి గల ప్రాముఖ్యత అడుగంటింది.

మొదట, రాజైన సౌలుకు - యూదాగోత్రం వాడైన దావీదుకు మధ్య కలతలు రేగాయి. తరువాత రాజైన దావీదుపైన అతని కుమారుడు అబ్షాలోము తిరుగుబాటుచేసి సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు. అంతకుముందే అబ్షాలోము తన అన్నయైన అమ్నోనును హత్య చేయించాడు. తిరుగుబాటు సమయంలో అడవులలోకి తప్పించుకు పోయిన రాజు దావీదు, కొంత సైన్యాన్ని సమకూర్చుకొని ఎదురుదాడి చేశాడు. ఆ యుద్ధంలో దావీదు సైన్యాధిపతి అబ్షాలోమును చంపేశాడు.

అబ్షాలోము మరణం తర్వాత రాజ్యానికి వారసుడు కాగలిగినవాడు అదోనియా. కాని, రాజ్యం అతనకు దక్కకుండా చేశారు. సోలమన్ రాజయ్యాడు. తరువాత కొద్ది కాలంలోనే సోలమన్, అదోనియాను చంపించాడు.

ఇదీ ఆనాటి పరిస్థితి. ఈ స్థితిలో బలం గలవాడిదే రాజ్యం. ఏవిధంగానైనాసరే శత్రువును జయించాలి. సింహాసనాన్ని ఆక్రమించాలి. అదే రాజనీతి. కాబట్టి, అవకాశమున్న ప్రతివారూ సంపదకొరకు, అధికారంకొరకు ఎగబడ్డారు. మత పెద్దలకూ, యుద్ధ వీరులకూ (క్షత్రియులకు) మధ్య ఘర్షణలు రేగడానికి కూడా ఇదే కారణం.

కనుకనే, ఇక్కడ అన్నదమ్ముల బిడ్డలైన కౌరవులు, పాండవులు రాజ్యకాంక్షతో రణరంగంలో తలపడితే, ఇజ్రాయెల్‌లో అన్న — తమ్ముడూ, తండ్రి — కొడుకూ, రాజ్యంకొరకు కత్తులు దూసుకున్నారు. ఇక్కడ ధర్మరాజు, అజ్ఞాతవాసం తరువాత, సైన్యాలను సమకూర్చుకొని, యుద్ధానికి తలపడితే, ఉక్కడ దావీదు రహస్యంగా అడవులలో నుండగానే సైన్యాలను సమకూర్చుకొని, కొడుకుమీద యుద్ధానికి తలపడ్డాడు.

ఇక్కడ మాదిరిగానే, అక్కడా కుట్రలు జరిగాయి. ఇక్కడ పురోహితుల, గురువుల ఆధిక్యతను తొలగించినట్లుగానే, అక్కడ యాజకుల, న్యాయాధిపతుల ఆధిక్యతను తొలగించారు.

ఇటువంటి చరిత్రలో, ఎవరు, ఏవిధంగా రాజ్యాధికారాన్ని చేపట్టగలిగినా ప్రజలు అంతగా పట్టించుకోలేదు. ప్రజలను కాపాడిన రాజులను ప్రజలకు కీడుచేయకుండా మేలుచేసిన వారిని, న్యాయం చేకూర్చిన వారిని, వీరాధివీరులైన రాజులుగా, ధర్మమూర్తులుగా కీర్తించారు. శౌర్య ప్రతాపాలు ప్రదర్శించి, ప్రజలను రక్షించిన వీరుల, త్యాగధనుల జీవితాలను కథలు కథలుగా చెప్పుకున్నారు. కాగా, రకరకాల వీరగాథలు వ్యాప్తిచెందాయి.

ఆ రోజుల్లో రాజనీతి, లేదా రాజ ధర్మం ఎలావుండేదో, భారతంలోని ఈ క్రింది పద్యం చదివితే మనకు సులువుగా బోధపడుతుంది.

ఉ॥ క్రూరత కోర్చి యించుకయు రోయక పైకొనియెల్లభంగులన్
వైరుల జంపి భూ ప్రజకు వర్ధనముం గలిగించి పాడిమై
గోరరి గొంచు సద్వ్యయము గోరి యొనర్చుట రాజధర్మ మి
స్తారముగా బలారికి వచస్పతి చెప్పుట యప్రసిద్ధమే॥

అవి శ్రీకృష్ణుడు ధర్మరాజును ప్రశ్నించాడంటే, అర్థ మేమిటి? "ఏ విధంగా నైనా పరే శత్రువును సంహరించి రాజ్యాన్ని పాలించడమే రాజనీతి, న్యాయసమ్మతంగా కప్పములు, పన్నులు పుచ్చుకుంటూ, వాటిని సక్రమంగా ఖర్చు పెడుతూ, ప్రజలకు మేలు చేయడమే రాజ ధర్మం" అని బోధించాడన్న మాటే గదా?

ఈ నీతి ననుసరించే పాండవులు కౌరవులను సంహరించారు. ఈ ధర్మాన్ననుసరించే ప్రజలను పాలించారు.

ఇలాంటి రాజనీతి విజయ మందడానికీ, ప్రజల పంచాయతీ పాలన భగ్నమై, రాజు పాలన విస్తరించడానికీ తగిన పరిస్థితులు అనాడు ఎలా ఏర్పడ్డాయో వివరిస్తూ, ఫ్రెడరిక్ ఏంగెల్స్ తన "కుటుంబ, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక" అన్న గ్రంథంలో ఇలా వ్రాశారు:

"ముడి ఇనుము కరిగించి పోత పోయడం నేర్చుకున్న నాటి నుండి అనాగరిక యుగపు పై దశ ఆరంభమైంది. మానవ సమాజ పరిణామంలో అంత వరకూ, గడచిపోయిన దశలలో జరిగిన ఉత్పత్తి కన్నా అనాగరిక యుగపు పై దశలో జరిగిన ఉత్పత్తి చాలా హెచ్చు. వీర యుగం నాటి గ్రీకులు, రోము నగర నిర్మాణానికి ముందు నాటి ఇటాలియనులు, టూటన్ కాలం నాటి జర్మనులూ, వైకింగ్ కాలం నాటి నార్మన్ వంటి వారంతా ఈ దశకు చెందిన వారే."

....."అన్నింటి కన్నా ముఖ్యంగా, ఇనపకర్రు చేసిన నాగలి, పశువులతో లాగబడేది మనకీ దశలోనే కనబడుతుంది. దీని సహాయంతో విస్తృతంగా వ్యవసాయం చేయడానికి వీలు చిక్కింది. ఆహార పదార్థాలు పుష్కలంగా లభించాయి భూములుదున్నాలన్నా, పచ్చికబీళ్ళు పెంచాలన్నా పొదుకొట్టి, అడవులు నరికి బాగు చేయాలి. అందుకు ఇనుప గొడ్డలి, పలుగూ, త్రవ్వకాలకు ఉపయోగ పడ్డాయి.

".....హోమర్ గేయాలలో, ముఖ్యంగా ఇలియడ్‌లో మనకు అనాగరిక యుగపు పై దశ, మహోన్నత స్థితిలో మున్నట్లు గోచరిస్తుంది. అనాటికి ఇనుప పనిముట్లు బాగా వృద్ధి పొందాయి. కొలిమి తిత్తులు, చేతి మరలు, కుమ్మరి సారెలను కనిపెట్టారు. నూనె తీయడం, సారాయి కాయడం నేర్చుకొన్నారు లోహ పరిశ్రమ ఒక కళగా వృద్ధి బొందుతోంది బండి, రథము వచ్చాయి. వలకంతోను, దూలాలతోను ఓడలను నిర్మించారు. సరిహద్దు దేశాలతోనే గాకుండా, సముద్రాంతర దేశాలతో కూడా వర్తకం ప్రారంభమైంది. గృహ నిర్మాణ విద్య ఒక కళగా మారుతోంది. బురుజులూ, గోపురాలతో కోటలు నిర్మిస్తున్నారు. హోమరు కావ్యాలు వంటి మహా కావ్యాలు, పురాణాలు వ్రాయబడ్డాయి."

.....జనాభా బాగా పెరిగిన కొందీ, తెగలోని పనులూ, బయటి పనులు కూడ చేసుకోడానికి సంసిద్ధభావం అవసరం. కాబట్టి, ఈ దశలో, పలు తెగలు సమూహ్యాలుగా (క్రాన్ఫెడరసీలుగా) ఏర్పడ్డాయి వేరు వేరు తెగల భూములు కలిసిపోవశంతో, ఆ ప్రాంత మంతా ఒకే జాతికి చెందిన దేశంగా గుర్తించబడింది. సేనాధిపతులు అవసర మయ్యారు.....

".....గణ వ్యవస్థ తాలూకు పరిపాలనాంగా లయిన సేనా నాయకుడు, కౌన్సిలు, ప్రజా సభలు, క్రమంగా సైనిక ప్రజాతంత్రంగా మారాయి. సైన్యము, యుద్ధ సన్నాహాలు జాతి జీవనంలో ప్రధానమై పోయాయి. సంపదను పోగు చేయడమే జీవిత పరమార్థ మనుకునే వారికి, ఇరుగు పొరుగు వారికి, గల ఐశ్వర్యాన్ని చూడగానే కన్ను వడుతుంది. పనిచేసి సంపాదించడం కన్నా, దోచుకోవడం ద్వారా సంపన్నులు కావడం సులువూ, గౌరవప్రదమూ నని అనాగరికులు భావిస్తారు. కాగా, గణతంత్రోత్తమను తాము రక్షించు కోవలసి వచ్చినప్పుడో, తమ తెగలో పెరిగిపోయిన జనాభా కొరకు, కొత్త తావులను సంపాదించుకోవలసి వచ్చినప్పుడో, చేసిన యుద్ధాలు, ఇష్టదొక పరిశ్రమగా మారాయి. కేవలం దోపిడీ కోసమే యుద్ధాయి జరిగాయి. కోటల రక్షణ క్రింద వగరాలు పెరిగాయి. కోట గోడల పునాదుల కొరకు తవ్విన కందకాలలో పడి, గణ వ్యవస్థ సమాధి అయి పోయింది. కోటగోడల మీద బురుజులు నాగరికత నందుకున్నాయి. ఆంతరంగికంగానూ ఇదే స్థితి. దోపిడీ కోసం జరుగుతున్న యుద్ధాలలో సేనా నాయకులూ, వాడి అనుచరులూ బలపడ్డారు. వారివి ఎన్నుకోవలసిన ప్రజల హక్కు నామమాత్రమై పోయింది. అటు మీమ్మట, కొందరు సేనా నాయకులు రాజు లయ్యారు. కొందరు సామంత ప్రభువులు కాగలిగారు.

.....కాల క్రమేణా రాజరికమూ, సామంతమూ, ఇతరపదవులు వారపత్య హక్కులుగా మారిపోయాయి."

సూతులు చెప్పిన భారత గాథ

ఆ రోజుల్లో పల్లె ప్రాంతాలలో తిరుగుతూ రామకథ లాంటి వీర గాథలను పాడి ప్రజలకు వినిపించిన వారిని "కుశీలవులు" అనే వారు. వీరగాథలను రచించి, వాటిని రాజుల దర్బారుల్లోను, యజ్ఞ, యాగాది క్రతువులు జరుగుతున్న సమయాల్లోను వినిపించినవారు సూతులు.

మొదట "జయము" అను పేరుతోనున్న భారత గాథను శౌనకాది మహర్షులకు చెప్పిన వారు ఉగ్రశ్రవుడనే పేరుగల సూతుడు. ఈ కథను తాను ఎలా తెలుసుకున్నదీ ఉగ్రశ్రవుడు వివరించాడు.

జనమేజయుడు చేసిన సర్పయాగమును తాను స్వయంగా చూచి చెపుతున్నానన్నారు. అక్కడినుండి ఉద్యోగపర్వం వరకూ, జనమేజయుకు వైశంపాయనుడు చెప్పగా వివి చెపుతున్నానన్నారు. ఆపైన ధృతరాష్ట్రునకు సంజయుడు చెప్పిన యుద్ధ వృత్తాంతమును, వైశంపాయనుని ద్వారా విని చెపుతున్నానన్నారు. కాబట్టి, భారత గాథలోని ముఖ్యమైన మూడు భాగాలను కథలుగా చెప్పినవారు ఉగ్రశ్రవ, వైశంపాయన, సంజయులని చెప్పవచ్చు. కాని,కాలక్రమేణా యీ కథల కథలతోపాటు, కొన్ని పర్వాలకు పర్వాలే భారతంలోచేరి పోయాయ్.

ఆ రోజుల్లో బ్రాహ్మణ స్త్రీలకు-క్షత్రియులకు జన్మించిన వారిని సూతులనేవారు. (అమరకోశం చూడండి) ఈ సూతుల్లో మంచి శక్తి సామర్థ్యములు గలవారు.

వీరు క్షత్రియులతో కలసి నివసించేవారు. వీరిలో కొందరు రాచనగరులో ఉండి, రాచకార్యాలలో నిమగ్నులై, రాజులకు సలహా ఇస్తుండేవారు. కొందరు రథసారథులుగా వుండేవారు. మరికొందరు రాజవంశాలకు చెందిన కథలను వీరగాథలుగా కూర్చి ప్రచారం చేసేవారు. వీరిలో అనేకులు యుద్ధ వీరులుగా కన్పిస్తున్నారు. మంత్రిపదవులనుండి బ్రాహ్మణులను తొలగించి, వాటిని సూతులు పొందగలిగిన దీ దశలోనే. రథసారథులుగానున్న బ్రాహ్మణుల స్థానములో సూతులు ప్రవేశించింది కూడా ఈ దశలోనే.

భారతంలో ప్రముఖంగా కనుపించే ఉగ్రశ్రవుడు, శౌనకయుడు మాత్రమేగాక, కీచకులు కూడా సూతులే. కర్ణని పెంచిన అధిరథుడు కూడా సూతుడే.

వీరి కథలలో సీతులు, ధర్మాలు, శౌర్య ప్రతాపాలను గురించిన వర్ణనలు, యుద్ధ వ్యూహాలు, రాజవంశాల పట్టుపూర్వోత్తరాలేగాక, సృష్టి ధర్మాలు, ప్రకృతి వర్ణనలు, లౌకిక ఆధ్యాత్మిక దృక్పథాలు, వివిధ తెగల ఆచార సంప్రదాయాలు, సామాజిక వ్యవస్థను గురించిన వివరాలు కూడా ఇమిడి ఉన్నాయి.

ఈ కథలు అక్షరబద్ధమైన తరవాత కూడా అనేక మార్పులకు, చేర్పులకు లోనైనప్పటికీ వీటి విలువ తగ్గలేదు.

ఆ రోజుల్లో వేద వేదాంగములన్నీ వైదికుల సొత్తు. రామాయణ, భారత గాథలతో సహా తక్కినవన్నీ సూతుల సొత్తు. వీటిని శౌనకాది మహర్షులకు చెప్పినవాడు రోమహర్షణ, ఉగ్రశ్రవులను పేరుగల సూతులు. కనుకనే డాక్టర్ యస్.వి. కేటాకర్, వీటికి "సౌత సాహిత్యం" అని పేరు పెట్టారు.

క్రమంగా సూతుల కథలపైన ప్రజల ఆసక్తి పెరిగింది. ఆదరణ హెచ్చింది. కాబట్టి వైదిక పురోహితుల దృష్టి వీటిపైకి మళ్ళింది. సూతుల స్వాధీనములోనున్న భారతకథ చల్లగా భృగువంశంవారి చేతులలోకి పోయింది. వి డాక్టర్ వి యస్. సుక్తాంకర్ ప్రతిభా పూర్వకంగా బుజువుచేశారు.

తర్వాత, తమను తాము పొగుడుకుంటూ, భృగువంశజులు కొన్ని కథలు వ్రాసి, సుదర్శ ఋద్ధికూడా లేకుండా భారతంలో చేర్చారనీ, భారత గాథ మాత్రమేగాక, సంస్కృత వాఙ్మయాభివృద్ధికి మూలమైన రచనలన్ని, బ్రాహ్మణేతరుల చేతులనుండి, బ్రాహ్మణుల చేతులలోకి పోయాయనీ శ్రీమతి ఐరావతీ కార్వే రచించిన "యుగాంత" అన్న గ్రంథంలో వ్రాశారు.

తమను తాము పొగుడుకుంటూ భృగువంశజులు కథలు వ్రాసి భారతంలో చేర్చడానికి బలమైన కారణాలున్నాయి.

రామాయణంలో ముఖ్యంగా భారతంలో క్షత్రియుల గొప్పదనం కనుపిస్తోంది. కాబట్టి, క్షత్రియులకంటే, బ్రాహ్మణులే గొప్పవారని, మహిమాన్వితులని చాటి చెప్పేందుకు అలాంటి కథలు అవసరమయ్యాయి.

బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల మధ్య పోటీ

ఉపనిషత్కాలంలో క్షత్రియుల విజ్ఞానం పెరిగింది. ఉపనిషత్తులలో కనపించే జనకుడు, అజాతశత్రు, ఆశ్వపతికైకేయ వీంటివారు క్షత్రియులే. ఆ దశలో, ఆధిక్యత కొరకు బ్రాహ్మణులకు, క్షత్రియులకు మధ్య అనేక ఘర్షణలు జరిగాయి. కాగా, ఎవరికి వారే తమ గొప్పదనాన్ని చాటే కథలు వ్రాసి, ప్రచారం చేసుకున్నారు.

శ్రీరాముని చేతిలో పరశురాముని గర్వభంగం జరిగినట్లుగా రామాయణంలో ఉంది. కాబట్టి, కార్తవీర్యార్జునునితో సహా క్షత్రియులనందర్నీ (గాజులు తొడిగించుకుని మూల కూర్చున్న వారిని తప్ప) పరశురాముడు వధించినట్లుగా భృగవంశజులు వ్రాసి భారతంలో చేర్చారు. దానికి వ్యతిరేకంగా, పరశురామునితో సహా పద్దెనిమిది లక్షలమంది బ్రాహ్మణులను, సహస్రబాహుని కొడుకులు చన్నుణుడ, రాముడో హతమార్చినట్లుగా క్షత్రియులొక కథ వ్రాశారు. ఈ కథ భూటాన్ రామాయణంలో ఉంది.

సృష్టికి ప్రతి సృష్టి చేసినవాడు మా విశ్వామిత్రుడని క్షత్రియులు గొప్పగా చెప్పుకుంటే, మా ఇంట పుట్టవలసిన విశ్వామిత్రుడు ఒక చిన్న పొరపాటువల్ల క్షత్రియుల ఇంట పుట్టాడని భృగువంశజులు చెప్పుకున్నారు. పైగా, విశ్వామిత్రునికంటే వశిష్టుడే గొప్పవాడని చెప్పుకునేందుకు తగినట్లుగా కథలల్లారు.

సాక్షాత్ విష్ణుమూర్తే మా ఇంట కృష్ణుడుగా అవతరించాడని యాదవులు చెపితే, మా భృగుమహర్షి విష్ణుమూర్తి రొమ్ముపైన తన్నాడనీ,

శివుని నొసట మూడో నేత్రముంటే, మా భృగుమహర్షి అరికాలిలో మూడో నేత్రముందనీ భృగువంశజులు చెప్పారు.

శ్రీ కృష్ణపరమాత్మ అర్జునునకు భగవద్గీతను బోధించడమేగాక, తన విరాట్ స్వరూపాన్నికూడా చూపించాడని క్షత్రియులు చెపితే, ఉద్ధాంకునకు భయపడి శ్రీ కృష్ణ డాయపకు అనుగీతను చెప్పకమేగాక, వైష్ణవ రూపాన్నికూడా చూపించాడని భార్గవులు చెప్పారు.

అనేకమంది క్షత్రియులు బ్రాహ్మణులకు జన్మించారని బ్రాహ్మణులు చెప్పగా, అనేకమంది బ్రాహ్మణులు క్షత్రియులకు జన్మించారని క్షత్రియులు చెప్పారు.

ఇలా కథలు చెప్పుకుంటూ పోవడంతో బ్రాహ్మణుల గొప్ప దనాన్ని చాటే కథలు, వారిని కించపరచే కథలతోపాటు, క్షత్రియుల గొప్ప దనాన్ని చాటే కథలు, కించపరచే కథలు కూడా భారతంలో చేరి పోయాయి.

వైదిక వాఙ్మయంలోని దేవతలు, దానవులు, యజ్ఞ యాగాది క్రతువులకు, భూదేవులకు, దానధర్మాలకు సంబంధించిన కథలను వైదిక బ్రాహ్మణులు భారతంలో చేర్చగా—నీతులు, ధర్మాలు, శౌర్యప్రతాపాలకు సంబంధించిన కథలను క్షత్రియులు భారతంలో చేర్చారు. బౌద్ధ, జైన మతాలు బోధించిన అహింస, సర్వసంగ పరిత్యాగం, దీనజనోద్ధరణకు సంబంధించిన కొన్ని కథలు కూడా భారతములో వెలిశాయి. కొన్ని బౌద్ధ గాథలు, జైన కథలు కూడా, కొన్ని మార్పులకు లోనై భారతంలోచోటు చేసుకున్నాయి.

శిబిచక్రవర్తి తన రెండు నేత్రాలను పెరికి, కళ్ళు లేని బిచ్చగానికి దానం చేసినట్లుగా బౌద్ధుల త్రిపిటకంలో వుంది. ఈ కథను మార్చి డేగ బారినుండి పావురాన్ని రక్షించేందుకు శిబిచక్రవర్తి తన కండలు కోసి ఇచ్చారని, ఆయన దాన గుణానికి మెచ్చి డేగ ఇంద్రుడుగానూ, పావురం అగ్నిదేవుడుగానూ సాక్షాత్కరించి ఆయనకు వరాలు ప్రసాదించారని భారతంలో వ్రాశారు. మరోచోట బ్రాహ్మణులకు శిబిచక్రవర్తి అనేక దానాలు చేసినట్లుగా వర్ణించారు.

విష్ణు లీలలతోపాటు శివ లీలలను కూడా భారతంలో చొప్పించారు. సాంఖ్య యోగ బ్రహ్మ సూత్రాలను కలిపి భగవద్గీతగా రూపొందించి భారతంలో చేర్చారు. వైదిక వాఙ్మయంలోని కద్రూ వినతల. చ్యవన సుకన్యల, అశ్వినీదేవతల, ఇంద్ర వృత్రాసురుల, దేవదానవుల కథల లాంటివన్నీ ఏదో ఒక రూపంలో భారతంలో చేరిపోయాయి. అపైన హరివంశ రచన జరిగింది. కనుకనే భారతం పంచమ వేదమని కొందరు, ఇతిహాస పురాణమని కొందరు చెపుతున్నారు.

కాగా మొదట "జయము" అను పేరుతో 8,800 శ్లోకములతో నున్న భారత యుద్ధగాథ పెరిగి 24,000 శ్లోకములు గల "భారతం"గా తయారైంది. అపైన మరీ పెరిగి లక్ష శ్లోకములు గల "మహాభారతం"గా రూపొందింది.

ఇలా పెరిగిన లక్ష శ్లోకములూ వేదవ్యాసునవే నన్నాడు. అంతే కాదు, అసలు వ్యాసుడు రచించిన శ్లోకములు అరవై లక్షలనీ వాటిలో ముప్పై లక్షల శ్లోకములు దేవలోకంలోను, పదిహేను లక్షలు పితృ లోకంలోను, పదొనుగు లక్షలు గంధర్వ లోకంలోను, ఒక లక్ష శ్లోకములు మాత్రమే మానవలోకంలోను వ్యాపించాయని ప్రాపిపెట్టారు.

రామాయణ విస్తరణ

ఇంత పెద్దగా కాకపోయినా, రామాయణం కూడా బాగానే పెరిగింది.

వాల్మీకి రామాయణాన్ని, కుశీలవులు పాడి ప్రజలకు వినిపిస్తున్న సమయంలోనే, అందులోని వర్ణనలు పెరిగి వుండవచ్చునని శ్రీ నార్ల వెంకటేశ్వరరావు "జాబాలి"లో ప్రాశాడు.

"రామ కథను గానం చేస్తున్న సమయంలో, అచట చేరినవారు సీతాదేవి కష్టాలను విని కన్నీళ్ళు కారుస్తోంటే, ఆ కష్టాలను ఋషిత చిలవలు పలవలుగా కుశీలవులు వర్ణించివుంటారు. కథను వింటున్న వారు యుద్ధ ఘట్టాలను మెచ్చుకునేవారైతే, కథకులు వాటిని పొడిగించి వుంటారు. కనుకనే యుద్ధంలో చచ్చిన రాక్షసవీరులే తిరిగి యుద్ధానికి

తలపడినట్లుగా రామాయణంలో కనిపిస్తోంది. ఇలాగే సభికులు హాస్యానికి తలలూపేవారైతే, కోతి చేష్టలను బాగా వర్ణించి వుంటారు. సభికులు పురాణగాథలను మెచ్చుకునేవారైతే, మధ్యమధ్యలో వాటిని చెప్పి వుంటారు." అని మారిస్‌వింటర్‌నిడ్జ్ రచించిన "ఇండియన్ లిటరేచర్-ఎపిక్స్ అండ్ పురాణాస్" అన్న గ్రంథంలో వివరించారు.

వాల్మీకి రామాయణం చాలా కాలంవరకూ అక్షరబద్ధం కాలేదు. గనుక ఇలాంటివి సాధ్యమై వుంటాయి. కనుకనే వాల్మీకి రామాయణంలో ముప్పాతి భాగం ఇతరులు రచించి మూలంతో కలిసిపోయారని పరిశోధకులు భావిస్తున్నారు.

ఇలా క్రొంతవరకూ పెరిగిన రామాయణం, బౌద్ధమతం ప్రారంభమైన పిమ్మట మరికొంత పెరిగింది. బుద్ధునకు పోటీగా రాముని కీర్తించడంవల్ల అలా జరిగింది.

ముక్తిమార్గాన్ని తెలుసుకునేందుకు గౌతమబుద్ధుడు అడవులకు వెళ్ళి ఏడేండ్లపాటు అష్టకష్టాలు పడ్డాడని బౌద్ధులు ప్రచారం చేస్తే, ధర్మరక్షణకొరకు శ్రీరాముడు పదునాలుగేండ్లపాటు అడవుల్లో నివసించి అష్టకష్టాల పాలయ్యాడని వైదికులు ప్రచారం చేశారు.

అంబఫలి అను పేరుగల వేశ్యకు చర్మమిచ్చి అమెనొక బౌద్ధ సన్యాసినిగా మార్చగలిగిన మహానుభావుడు బుద్ధుడని బౌద్ధులు చెపితే, వైదికులు అహల్యా శాప విమోచన గాథను వివరించి చెప్పారు.

బుద్ధుని దర్శనంకొరకు అంబఫలి ఏళ్ళ తరబడి నిరీక్షించిందనీ, ఆయన దర్శనం కాగానే తన సంపదనంతా సమర్పించిందనీ బౌద్ధులు ప్రచారం చేస్తే, శ్రీరాముని దర్శనంకొరకు శబరి ఏళ్ళ తరబడి నిరీక్షించిందనీ, ఆయన దర్శనం కాగానే మరేమి లేనందున రేగుపండ్లు సమర్పించిందనీ వైదికులు ప్రచారం చేశారు.

అంగుళిమాలుడు అను పేరుగల గజగొంగ బుద్ధుని బోధలు విని బౌద్ధ సన్యాసిగామారిపోయాడని బౌద్ధులు చెపితే, ప్రాచేతసుడు అనే బోయవాడు రామ కథను విని, రామాయణ మహాకావ్యాన్ని రచించి వాల్మీకి మహర్షిగా కీర్తి ప్రతిష్టల నార్జించుకున్నాడని వైదికులు చెప్పారు.

రాజభోగాలను త్యజించి, సర్వమానవ కళ్యాణంకొరకు పాటు పడినవాడు బుద్ధుడని బౌద్ధులు ప్రచారంచేస్తే, రాజభోగాలను త్యజించ డమేగాక రామరాజ్యాన్ని స్థాపించినవాడు మా రాముడని వైదికులు ప్రచారం చేశారు.

కాని, బుద్ధుడు సంసారబంధనాలను త్రెంచివేసుకున్న మహాత్ము డని బౌద్ధులు చెప్పినప్పుడు వైదికులు వెనకడుగు వేయవలసి వచ్చింది.

అయినా, భవభూతి ఉత్తర రామ చరితను వ్రాసి, శ్రీరాముడు సీతాదేవిని వాల్మీకి ఆశ్రయానికి పంపినట్లుగా వివరించిన పిదప ఆ కొరత తీరిపోయింది.

బౌద్ధ-వైదిక మతాల మధ్య పోటీ

ఆ దశలో అశోక చక్రవర్తి బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. మత ప్రచారం కొరకు బౌద్ధ సన్యాసులను విదేశాలకు పంపాడు. కాబట్టి, భారత ఉపఖండంలోనేగాక, ఇతర దేశాలలో కూడా బౌద్ధ మత వ్యాప్తి ప్రారంభమైంది.

ఇలా వ్యాపిస్తున్న బౌద్ధ మతా న్నెదిరించి, నిలువరించడం వైదికులకు సాధ్యం కాలేదు బౌద్ధ మతాన్ని మాత్రమేగాక జైన మతాన్ని కూడా వైదికులు ఎదిరించవలసి వచ్చింది. యజ్ఞ యాగాది క్రతువులవల్ల కష్ట, నష్టాల పాలవుతున్న పశుపాలకులు, రైతులు, వైశ్యులతోపాటు, కొందరు క్షత్రియులుకూడా క్రతువులకు వ్యతిరేకం గావడంతో వైదికుల పరిస్థితి మరీ క్లిష్టంగా తయారైంది.

ఏదో ఒక విధంగా జైన, బౌద్ధ మత ప్రాబల్యాన్ని అరికట్టక పోతే, వైదికుల ఆధిక్యత పూర్తిగా తరిగిపోతుంది. అయినా, ఎలా అరికట్టాలో తెలియని అయోమయ స్థితిలో వైదికులు పడిపోయారు.

సరిగ్గా ఇదే దశలో యదు, వృష్ణి, భోజ, కుకుర,అంధక,సృంజయ, కేకయ వంశజులు, వాసుదేవ భక్తులై, ఏకాంతిక ధర్మ మార్గావలంబకులై వైదిక జంతుబలిని వ్యతిరేకించారు. ఈ వాసుదేవ భక్తులతో (సాత్వతులతో) క్రమంగా నారాయణ భక్తులు, విష్ణు భక్తులు కూడా కలిసిపోయారు.

ఇలా కలిసిపోయిన వారంతా భాగవతులు. ఈ భాగవత ధర్మం విస్తరించి వైష్ణవ ధర్మంగా ప్రసిద్ధి కెక్కింది. ఈ భాగవతులు కూడా జంతుబలిని వ్యతిరేకించడంవల్ల, వీరి వైష్ణవ ధర్మం ప్రజలి నాకర్షిం

చింది. కాగా, దేశమందలి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో బౌద్ధం విస్తరిస్తోంటే, పశ్చిమోత్తర ప్రాంతాలలో వైష్ణవం విస్తరించింది.

జంతు బలిని వ్యతిరేకించి నవ్వటికీ వైష్ణవ ధర్మం, అధ్యాత్మ వాదాన్ని బలపరచింది. ఈ విషయంలో బౌద్ధ, జైన ధర్మాలకు వైష్ణవ ధర్మం వ్యతిరేకం. కాబట్టి వైదికుల చేతికొక బ్రహ్మాస్త్రం దొరికి నట్లయింది.

కాగా, జంతుబలిని వ్యతిరేకించిన సాత్వతుల (వాసుదేవ భక్తుల) వైన, అప్పటివరకూ ధ్వజమెత్తిన వైదికులు, ఇప్పుడా వ్యతిరేకతను మానుకున్నారు. "విష్ణుమూర్తి ఎవరోకాదు. ఉపేంద్రుడు. ఇంద్రుని తమ్ముడు అయినా ఇంద్రునికంటే గొప్పవాడు" అని ప్రచారంచేస్తూ విష్ణు పూజలు ప్రారంభించారు.

మరొకవైపు నుండి బౌద్ధ మతస్థులైన మౌర్య చక్రవర్తులకు వ్యతిరేకంగా కుట్రలు ప్రారంభించారు. క్రీస్తు పూర్వం 178 వ సంవత్సరంలో కడపటి మౌర్య చక్రవర్తిని హత్యజేసిన పుష్యమిత్రునకు తమ అండదండలను సమకూర్చారు. వీరి అండదండలతో సుంగ రాజ్యాన్ని స్థాపించిన పుష్యమిత్రుని ఆస్థానంలో చేరిన వైదిక పండితులు, పతంజలి నాయకత్వాన, భగవదవతారాల సిద్ధాంతాన్ని రూపొందించి, కృష్ణవాసుదేవుని కీర్తిస్తూ బౌద్ధ మతాన్ని ఎదిరించారు.

అయినా, భారతదేశంలో చొరబడిన గ్రీకులు సియాల్ కోట ప్రాంతంలో తమ రాజ్యాన్ని స్థాపించగానే, వారి రాజైన మిళిందుడు, ప్రజల మద్దతును పొందేందుకు, బౌద్ధ మతాన్ని స్వీకరించి బలపరచగా; ఉజ్జయిని పాలకులు బౌద్ధ మతస్థులు గావడం, శాతవాహన చక్రవర్తులు బౌద్ధ, వైదిక మతాలను సమంగా ఆదరించడంవల్ల బౌద్ధమతం బాగా పైచేయి సంపాదించింది.

ఈ పరిస్థితి నెదుర్కొనేందుకు క్షత్రియుల ఆధిక్యతను వైదిక మత పెద్దలు అంగీకరించడమేగాక, రాజులు దేశీయులైనా, విదేశీయులైనా, క్షత్రియులైనా, కాకపోయినానీరే, వారి ప్రాపకం కొరకు "నావిష్ణుః పృథివీ పతిః" రాజు దైవాంశ సంభూతుడంటూ కీర్తించవలసివచ్చింది.

యూరప్‌లో క్రైస్తవ మత గురువులు కూడా, ఇలాగే రాజులను కీర్తించారు గదా?

రాజుల ప్రాపకం కొరకు ప్రయత్నించడంతో పాటు వైదిక పురోహితులు యజ్ఞయాగాది క్రతువులను తగ్గించుకున్నారు. వాట మహిమలను గురించి చెప్పడం మానివేయడమే గాక, వాటిని వ్యతిరేకించిన కృష్ణుని పూజించారు, రాముని ఘనతను వర్ణించారు. ఆర్యులు, ఆర్యేతరులనే భేదం లేకుండా, జైన, బౌద్ధ మతాలను వ్యతిరేకించిన వారందరితోనూ ఏకమయ్యారు. శైవ, వైష్ణవ దర్శనాలను బాగా ప్రచారం చేశారు. కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను బలపరుస్తూ వైదిక పండితులు కథలు వ్రాశారు. భగవంతుని నమ్మినవారికి ఇహలోక సౌఖ్యంతోపాటు, పరలోక సౌఖ్యం కూడా సిద్ధిస్తుందని చాటి చెప్పేందుకు అనేక పురాణాలు వ్రాశారు.

ఇలాగా కృషిచేసిన పిమ్మట కొందరు రాజుల మద్దతును, కొంత వరకూ ప్రజల అభిమానాన్ని కూడా వైదికులు పొందగలిగారు. అటు శైవ మతప్రచారం కొరకు పండితులు విదేశాలకు కూడా వెళ్ళారు. అలా వెళుతూ భారత రామాయణాలను వెంట తీసుకుపోయారు.

భారతదేశంలోనేగాక, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్, కంబోడియా, లావోస్, వియత్నాం, చైనా వంటి దేశాలలో కూడా బౌద్ధ-హిందూ మత ప్రచారకులమధ్య పోటీ తీవ్రంగా సాగింది.

ఈ విధంగా కొందరు ఆర్య క్షత్రియులు, ఆర్యేతరులైన రాజులు కొందరు, అందించిన ఉండపండలతో! ద్రావిడ, షుద్రద్రావిడ బ్రాహ్మణులు, వైదికులు వియోగులు, శైవులు వైష్ణవులు, శాక్తేయులు గాణాపత్యులు కలసి, జైన, బౌద్ధ ధర్మాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసినందున వీరి మతం హిందూమతంగా ప్రసిద్ధి కెక్కింది. వారి వారి మతాలు హిందూ మతంలో శాఖలుగా పరిగణింపబడినాయి. అంతటితో వైదికమతం అనే మాట ప్రజలకు వినిపించకుండా పోయింది.

హిందూ పండితులు విష్ణుమూర్తి అవతారాలను వర్ణిస్తూ పురాణాలు వ్రాయగా, బౌద్ధ పండితులు బుద్ధుని జాతక కథలు వ్రాశారు. వీటిలో కొన్ని భారతంలో చేరిపోగా కొన్ని జాతక కథలు బౌద్ధుల కనుకూలంగా రామ చరితను మార్చడానికి ఉపయోగపడినాయి.

"బుద్ధుడెవరోకాదు. ఆయన విష్ణుమూర్తి అవతారమే. భూలోకంలో అధర్మాన్ని బోధించి, మానవులందరూ స్వర్గానికి పోకుండా చేసేందుకు- స్వర్గంలో వత్తిడి తగ్గించి, నరకంలో యమధర్మరాజుకు పని కల్పించేం దుకు అవతరించినవాడు" అని హిందూమత గురువులు ప్రచారం చేశారు.

"శ్రీరాము డెవరో కాదు. మా బుద్ధుడే. గత జన్మలో రాముడుగా జన్మించాడు" అని బౌద్ధ సన్యాసులు ప్రచారం చేశారు. రాముడు, బుద్ధుడు సూర్యవంశ క్షత్రియులైనందున ఈ ప్రాంతలకు ఆధారం దొరికింది.

భారతదేశంనుండి వెళ్ళి ఇండోనేషియా, కంబోడియా మున్నగు దేశాలకు వెళ్ళిన వైతాళికుల అండదండలతో భారత రామాయణ గాథలు, జాతకం కథలు కూడా ఆయా దేశాల ప్రజల మనసులపై చెరగని ముద్ర వేశాయి.

నాటినుండీ, ఆయా దేశాలలో గల సామాజిక పరిస్థితులు, అభి రుచులు, అవసరాలనుబట్టి జాతక కథలు, భారత రామాయణ గాథలు పూర్తిగా మారిపోయాయి.

జాతక కథలలో రామాయణం

చైనీస్ భాషలోనున్న జాతక కథల్లో, ఒకానొక రాజు కథ ఉన్నది. ఆ రాజు పేరు తెలియదు. కాని. ఒకప్పుడు బుద్ధుడే ఆ రాజుగా జన్మించాడట.ఆయన భార్యను ఒకనాగుడు ఎత్తుకుపోగా,వానరుల సాయంతో ముఖ్యంగా "ఇంద్రకపి" సహాయంతో, ఆ రాజుగారు సేతుబంధనం చేసి, లంకను ముట్టడించి, నాగుల్ని చంపి, తన రాణిని తిరిగి తెచ్చుకున్నాడట. తరువాత నా రాణి,తనపాతివ్రత్యాన్ని రుజువుచేసుకునే సమయంలో భూమి ద్విధలైందట, ఆ అద్భుతం జరిగిన పిమ్మట, వర్తకులు తమ లాభాలను తగ్గించుకున్నారట. బలవంతులు, బలహీనుల నాదరించారట. కులటలు తమ ప్రవర్తనను మార్చుకున్నారట. ప్రజలంతా సత్యవ్రతులుగా, ధర్మ నిరతులుగా జీవించారట. ఇవంతా బోధిసత్వుని ప్రభావమేనని, ఆ జాతక కథలో వర్ణించాడు.

బౌద్ధులలా వర్ణిస్తే, "మా ఇంద్రుడు కపి రూపంలో వచ్చి సహాయం చేయడం వల్లనే, సేతువును బంధించడం, నాగుల్ని చంపడం, బోధిసత్వునకు సాధ్యమయ్యాయి" అని హిందూమత పండితులొక కథ వ్రాశారు.

భూటాన్ రామాయణం ప్రకారం, దశరథుడొక వీరుడు. అయన కుమారుడైన సహస్రబాహుడు మరీ గొప్పవాడు. ఆ సహస్ర బాహుడొక బ్రాహ్మణుని కామధేనువును అపహరించగా, ఆ బ్రాహ్మణుని కుమారుడైన పరశురాముడొచ్చి సహస్రబాహుని సంహరించాడు.

సహస్రబాహునకు వైన్మణుడు, రాముడు అనే పేర్లుగల ఇద్దరు కొడుకులున్నాడు. వీళ్ళు పెద్దవాళ్ళు అయిన పిమ్మట, పరశురాముడితో పాటు పద్దెనిమిది లక్షల మంది బ్రాహ్మణులను చంపేశారట.

• ఆ సమయంలో దశగ్రీవుడనే రాక్షసున కొక ఆడపిల్ల పుట్టింది. ఆ బిడ్డవల్ల తనకు కీడు కలుగుతుందని జ్యోతిష్యులు చెప్పగా విని, దశగ్రీవుడా బిడ్డ నొక పేటలో పెట్టి నదిలో పారేశాడు. అదొక ఋషికి దొరికింది. అత డా బిడ్డను పెంచాడు. ఆ బిడ్డయే సీత.

• వైన్మణుడు, రాముడు, సీతను ప్రేమించి వివాహం చేసుకోవాలనే తలంపుతో ఆమెకు సకల సపర్యలూ చేస్తుండేవాడు. ఒకనాడు వారిరువురూ లేనిసమయంలో దశగ్రీవుడు సీతను జూచి, ఆమె తన కుమార్తె యే నని ఎరుగక ఆమె నెత్తుకుపోయాడట.

వైన్మణుడూ, రాముడూ సీతను వెదుకుతూ వానర రాజ్యం చేరారు. సుగ్రీవుణ్ణి సంహరించి, నందుడికి రాజ్యం కట్టబెట్టి, వానరుల సహాయంతో, దశగ్రీవు నోడించి, కప్పం కట్టించుకొని సీతను తీసుకొచ్చారట.

• వైన్మణుడే బుద్ధుడుగా అవతరించాడట. రాముడు మైత్రేయుడుగా పుట్టాడట. ఇది మాలొక జాతక కథ.

• అసురస్త్రీలు మహా పతివ్రతలైనందున త్రిపురాసుర సంహారం త్రిమూర్తులకు కూడా సాధ్యంకాలేదట. కాబట్టి షణ్ముమూర్తి బుద్ధావతార మెత్తి చల్లగా అసురస్త్రీల శీలాన్ని పాడుచేయగా త్రిపురాసుర సంహారం సాధ్యమైందట. ఇది వైదికులు చెప్పిన కథ.

రకరకాల రామ కథలు

లావోస్‌లో ప్రచారమైన రామ జాతక కథ ప్రకారం, రామ, రావణులు అన్నదమ్ముల బిడ్డలు. రాముని చెల్లెలైన శాంతాదేవిని రావణుడు ఎత్తుకుపోయాడు. కాని, రామునకు భయపడి చివర కామెను పెళ్లి చేసుకున్నాడట.

శ్రీలంకలో ప్రచారమైన ఒక రామ కథ ప్రకారం, లంకను తగల బెట్టినవాడు వాలి హనుమంతుడు గాదు. సీతాన్వేషణకై వాలి లంకలో ప్రవేశించినప్పుడు, రావణుడు అశోకవనంలో సీతాదేవి దగ్గరున్నాడట. జ్ఞానవానాన్ని వాలి పాడుచేస్తోందే రావణుడు మందిపడ్డాడు. అయినా, కోతిని చంపడంగాని, హింసించడంగాని ధర్మం కాదనుకున్నాడు. "ఏమి చేస్తే బాగుంటుంది?" అని సీతను సలహా అడిగాడట.

"ఈ కోతిని చంపనూవద్దు. కాళ్ళతో బిందించనూవద్దు. చల్లగా పట్టుకొని, తోకకు రెండు గుడ్డలు చుట్టి మంట పెడితే భయపడి పారిపోతుంది. మళ్లీ తిరిగి ఇక్కడకు రాదు" అని సీతాదేవి సలహా ఇచ్చిందట.

సీతాదేవి సలహాను రావణుడు పాటించాడు. వాలి తోకకు గుడ్డలు చుట్టి, విప్పు ముట్టించి విడిచిపెట్టాడు. వెంటనే ఒక ఇంటిమీదనుండి మరో ఇంటిమీదికి వాలి దూకుతోంటే లంకా పట్టణంలో అనేకచోట్ల మంటలు రేగాయట. వాటి నార్పేందుకు రావణుడు అటూ ఇటూ పరుగులు పెడుతోంటే వాలికి సందు దొరికింది. అమాంతంగా సీతాదేవిని తన భుజాలపై కెత్తుకుని రాముని దగ్గర వాలాడట.

ఒక రామకథ ప్రకారం సీత, రామ లక్ష్మణుల చెల్లెలు. మరొక రామ కథ ప్రకారం సీత, రావణుని కుమార్తె. మరొక కథ ప్రకారం వాలితో కాపురం చేస్తుండగా గర్భవతియైన మందోదరి, రావణునీ వివాహం చేసుకున్న పిమ్మట సీత పుట్టింది. వేరొక కథ ప్రకారం దశరథునకు-మందోదరికి సీత పుట్టింది.

ఒక రామ కథనుబట్టి చూస్తే, హనుమంతుడు చాలా చెడ్డవాడు. ఒక కథ ప్రకారం హనుమంతుడు రాముని కొడుకు. మరొక కథ ప్రకారం

ఈశ్వరుని కొడుకు. వేరొక కథలో, ఈశ్వరుని వీర్యం, వాయుదేవుని ద్వారా, అంజనీదేవి గర్భంలోకి పోగా, హనుమంతుడు పుట్టినట్లుగా వుంది.

సుగ్రీవుని సంహరించి శ్రీరాముడు వాలికి పట్టం కట్టినట్లుగా ఒక రామ కథలో వుంది.

కొంతకాలంపాటు అడవులలో వుంది, తిరిగివచ్చిన రామ లక్ష్మణులలో కన్యను చూచి మోహించి, ఎవరికి వారే తనను పెండ్లాడవలసినదిగా అమెను కోరినట్లూ, చివరకు అమె తమ చెల్లెలైన సీతయేనని తెలుసుకొని, పశ్చాత్తాపపడి, ముండనం చేయించుకొని, కాము వర్జితులై, జైన సన్యాసుల్లో కలిసిపోయినట్లూ, ఒక జైనగాథలో వున్నది.

• బౌద్ధుల జాతక కథల్లో, "దశరథ జాతకం" అనే కథ ఉంది. ఆ కథను, ఒక గృహస్థునకు స్వయంగా బుద్ధుడే చెప్పాడట.

దశరథునకు పదహారువేలమంది భార్యలు. వారిలో పట్టపురాణికి రామ పండితుడు, లక్ష్మణ పండితుడు, సీతాదేవి పుట్టారు కొంత కాలానికి పట్టపురాణి చనిపోగా, మరొక భార్య పట్టపురాణి కాగలిగింది. • ఆమెకు భరతుడు పుట్టాడు. ఈ రెండో పట్టపురాణి రామ పండితుని కేదైనా హాని తలపెట్టవచ్చునన్న భయంతో, పన్నెండేళ్ళపాటు ఎక్కడైనా వుండి రమ్మని రామపండితునితో దశరథుడు చెప్పాడు. రామ పండితునితోపాటు, లక్ష్మణ పండితుడు, సీతాదేవికూడా హిమాలయాలకు వెళ్లారు. దశరథుడు చనిపోయిన పిమ్మట వారణాసికి తిరిగి వచ్చారు. అటు పిమ్మట సీతాదేవి రాణిగా, శ్రీరాముడు రాజుగా పట్టాభిషిక్తులైనారట.

"ఆ దశరథుడే బుద్ధోధనుడు. సీతాదేవి యశోధర. రామ పండితుడను నేనే" అని బుద్ధుడు స్వయంగా ఒక గృహస్థుకు చెప్పినట్లుగా ఒక జాతక కథ వ్రాశారు.

హిందూ-బౌద్ధ మతాల మధ్య పోటీ కథలకు, ప్రచారాలకు, మాత్రమే పరిమితం కాలేదు. బౌద్ధులు స్తూపాలు నిర్మిస్తోంటే, హిందువులు దేవాలయాలు నిర్మించారు. బుద్ధగయ, సాంచీ, వైశాలివంటివి బౌద్ధ పుణ్యక్షేత్రాలైతే, కాశీ, రామేశ్వరంలాంటివి హిందువుల పుణ్య

క్షేత్రాలయ్యాయి. స్థల పురాణాలు వెలిశాయి. తీర్థయాత్రలు పెరిగాయి వీటిని గురించిన కథలు కూడా భారతంలో చేరాయి.

బుద్ధుడు అనేక జన్మలెత్తిన పిమ్మట సిద్ధార్థుడుగా జన్మించాడని బౌద్ధులు చెపితే, మహావీరునకు ముందు ఇరవై ముగ్గురు తీర్థంకరులు అవతరించారని జైనులు చెప్పారు. వైష్ణవ ధర్మాన్ని నారాయణుడే స్వయంగా ప్రజాపతికి చెప్పాడని అది బృహస్పతి ద్వారా ఉపరిచర వసువుకు లభించిందని వైష్ణవులు చెప్పారు.

బౌద్ధ, జైన మతస్థులపైననే గాక, హేతువాదులపైన కూడా, హిందూమత పెద్దలు కత్తిగట్టారు.

సాంఖ్య, యోగ, వైశేషిక, న్యాయ దర్శనాలలో మార్పులు కూర్పులు చేసి, వాటిని అధ్యాత్మిక వాదానికి అనుగుణంగా మార్చారు. కపిల మహర్షి చెప్పిన "పురుష"ను పురుష పరమాత్మగాను, ప్రకృతిని పరమాత్మ శక్తిగాను, మాయగాను వర్ణించారు.

సాంఖ్య, యోగ, బ్రహ్మ సూత్రాలను చేర్చి, భగవద్గీతను రచించి భారతంలో చొప్పించారు.

పరిణామవాదులు చెప్పిన దశలకు, అవతారాలు జోడించి పురాణాలు వ్రాశారు.

చార్వాక సిద్ధాంతాలకు సంబంధించిన రచనల నన్నింటినీ తగలబెట్టారు.

వివిధ నక్షత్రాలకు, మండలాలకు ఖగోళ శాస్త్రజ్ఞులు పెట్టిన పేర్లను, వాటి స్థానాలను ఉపయోగించుకొని పురాణాలు వ్రాశారు.

బౌద్ధం వెనకడుగు వేసింది. హిందూమత ప్రాబల్యం పెరిగింది. అప్పటినుండీ భారతదేశంలో బౌద్ధమతం అంతకంతకూ బలహీనమై పోయింది.

శైవ- వైష్ణవ మతాల మధ్య పోటీ

భారత ఉప ఖండంలో బౌద్ధ, జైన మతాల ప్రాబల్యం తగ్గగానే, శైవ- వైష్ణవ మతాల మధ్య పోటీ పెరిగింది. పురాణాలసంఖ్య పెరిగింది. శైవ, లైంగ, స్కాంద పురాణాలు శివుని కీర్తించగా, వైష్ణవ, భాగవత, నారదీయ, పురాణాలు విష్ణు దేవుని కీర్తించాయి. ఇవిగాక సౌర, శాక్త, గాణాపత్యాది మతములకు సంబంధించిన పురాణాలు కూడా వున్నాయి.

ఒక పురాణానికి పోటీగా మరొక పురాణం, ఒక దానిని విస్తరిస్తూ మరొకటి వ్రాశారు. నారదీయ, బృహన్నారదీయ, మండీశ్వర, బృహన్మం దీశ్వర, ధర్మ, బృహద్ధర్మ, శివధర్మ, విష్ణుధర్మ, విష్ణు ధర్మో త్తర, భవిష్యోత్తర వంటి పురాణాలు, ఉప పురాణాలు లెక్కలేనన్ని పుట్టుకొచ్చాయి వీటిలో అనేకం ప్రాత ప్రతులుగానే వుండి పోయాయి. మొత్తం ఉప పురాణాల సంఖ్య ఒక లక్ష అని స్కాంద పురాణంలో ఉంది.

వైష్ణవులు భాగవతం వ్రాస్తే, శైవులు దేవీ భాగవతం వ్రాశారు. ఒకరు భాగవతం గొప్పదంటే, మరొకరు దేవీ భాగవతం గొప్పనన్నారు. ఒకరి వాదనను మరొకరు ఖండిస్తూ "దుర్జన ముఖచ పేటిక" "దుర్జన ముఖ పద్మ పాదుక" వంటి గ్రంథాలను వ్రాసుకున్నారు.

హనుమంతుడు రామభక్తుడని వైష్ణవులు పొగడితే, ఆయన శివుని కుమారుడని శైవులు వ్రాశారు. రాముని కొడుకని వైష్ణవులు వ్రాశారు.

శివ ధనుస్సును శ్రీరాముడు అవలీలగా విరిచాడని వైష్ణవులు ప్రచారం చేయగా, శివుని పూజించడం వల్లనే శ్రీరామునకు సముద్ర తరణం, రావణ సంహారం సాధ్య మయ్యాయని శైవులు ప్రచారంచేశారు.

అటు పైన శ్రీరాముని మహిమను, స్వయంగా పరమ శివుడే పార్వతికి వర్ణించి చెప్పినట్లుగా వైష్ణవులు అధ్యాత్మ రామాయణ కీర్తనలు వ్రాశారు.

నర, నారాయణులైన అర్జునుడు, కృష్ణుడు శివుని పూజించి, పాశుపతాస్త్రాన్ని సంపాదించి, యుద్ధంలో విజయ మందారవి శైవులు చెపితే, బాణాసురుని రక్షించుటకు పూనుకున్న శివుడు కృష్ణుని చేతిలో ఓడిపోయాడని వైష్ణవులు వ్రాశారు.

దేవీ నవరాత్రులకు పోటీగా, తొమ్మిది రోజులపాటు సీతాకళ్యాణ మహోత్సవాలు జరప నారంభించారు.

శివుడు గొప్ప వాడని వారు, కృష్ణుడు గొప్ప వాడని వీరు కథలు వ్రాసి భారతంలో చేర్చారు.

శివ లీలలు, విష్ణు లీలలు, కృష్ణ లీలలు పెరిగి పోయాయి.

కృష్ణ వాసుదేవునకు, గోపాల కృష్ణునకు ముడిబెట్టి, కృష్ణ భక్తులు కృష్ణ లీలలు వ్రాశారు.

గోపాలకృష్ణుడు

గోపాలకృష్ణుని లీలలు గాని, రేపల్లెలో జరిగినట్లుగా చెప్పబడిన ఘటనలు గాని భారతంలో లేవు. నారాయణీయంలోను లేవు. పతంజలి కూడా వీటిని ప్రస్తావించ లేదు. కాని, హరివంశ, భాగవతాములలో కృష్ణ లీలలను వర్ణించారు. పూతనాది రాక్షసులను కృష్ణుడు సంహరించిన మేరకు శిశుపాలుడు నిందించినట్లుగా మాత్రం భారతంలో వుంది కాని అది ప్రక్షిప్తమని డాక్టర్ భండార్కర్ రుజువు చేశారు.

అయితే ఎవరీ గోపాలకృష్ణుడు? ఈయనను పూజించిన వారెవరు?

క్రీస్తు శకారంభానికి ముందు నుండీ; క్రీస్తు శకం రెండో శతాబ్ది వరకూ, మధ్యధరా సముద్ర ప్రాంతం నుండి తంతోపతండాలుగా భారత దేశానికి వచ్చిన అభీరులు (ఈనాడు అహీరులని పిలువబడుతున్న వారు పూజించిన దేవుడే గోపాలకృష్ణుడు.

అభీరులు సంచార జాతి వారు. వీరు మొదట మధుర నుండి, ద్వారక వరకు గల ప్రాంతాలలో పశువుల మందలను మేపుకుంటూ

ప్రతికారు. ఆ దశలో వీరు యాదవులకు పుల్లరి చెల్లిస్తూ, కప్పం కడుతూ వుండేవారు. ఆ తదవాత వీరు ద్వారకను స్వాధీనం చేసుకోవడమే గాక, మహారాష్ట్ర, కొంకణ ప్రాంతాలలో రాజ్యా లేలారు. కాబట్టి, ఆభీరులు పూజించిన గోపాలకృష్ణుడు, యాదవుల వాసుదేవ కృష్ణుడు ఒకరేనని చెప్పేందుకు. దేవకీ వసుదేవులకు జన్మించిన కృష్ణుడు, రేపల్లెలో నుంద, యశోదల ఇంట పెరిగాడని కథ లల్లారు. ఈ కథలతో వాసుదేవ కృష్ణునకు, ఏసుక్రీస్తునకు చక్కని పోలిక లేర్పడ్డాయి.

కృష్ణుడు– క్రీస్తు

కృష్ణుడు కారాగారంలో జన్మించాడు. క్రీస్తు సత్రవలో జన్మించాడు. కృష్ణుడు జన్మించగానే తీసుకుపోయి గోకులంలో వుంచారు. క్రీస్తు పుట్టగానే గోశాలలో వుంచారు. కృష్ణుని రేపల్లెకు తీసుకుపోతుండగా, యమునా నది దారిచ్చింది. క్రీస్తు సముద్రం మీద నడిచి శిష్యుల వద్దకు వెళ్లాడు.

కృష్ణుడెక్కడున్నదీ కనగొనజాలక అనేక మంది బాల, బాలిక లను కంసుడు వధించాడు. క్రీస్తు ఎక్కడున్నదీ తెలియక, అనేక మంది బాలలను హేరోద్ చంపాడు.

ఈయన తండ్రి పేరు వసుదేవ్. ఆయన తండ్రి పేరు యోసేఫ్. ఈయన పేరు వాసు. ఆయన పేరు ఏసు. ఈ వాసుదేవుడే కృష్ణుడు. ఆ ఏసుప్రభువే క్రీస్తు. ఈయన భగవద్గీతను బోధించాడు. ఆయన క్రైస్తవ ధర్మాన్ని బోధించాడు.

రాధాకృష్ణ పూజలు

శాక్తేయులు శక్తి పూజలు చేస్తే, కృష్ణ భక్తులు పురుష పరమాత్మగా శ్రీకృష్ణుని, ప్రకృతి మాతగా రాధను వర్ణిస్తూ, రాధాకృష్ణ పూజలు చేశారు. మగవాళ్ళు కూడా ఆడవేషాలు వేసుకుని, కృష్ణుని ప్రేమిస్తున్నట్లుగా నటించే వారట.

ప్రారంభంలో పురుష పరమాత్మగా కృష్ణునిదే పైచేయి. కాని, కొంత కాలానికి ప్రకృతి మాతగా రాధకు పైచేయి లభించింది. వామాచారం ప్రబలింది.

భోగలాలసలైన రాజులు, జమీందారలు లౌకిక, మాంత్రిక పద్ధతులను ప్రోత్సహించారు. మతపెద్దలు, పండితలు, వాటికి కిను గుణంగా రచనలు చేస్తూ, రాజుల అండదండలతో హాయిగా జీవించారు. అందువల్ల ఆపిసీతి హెచ్చింది. మద్య, మత్స్యం, మాంసం, మృష్టాన్నం, మైథునం మోక్ష సాధనాలనే భావం ప్రబలింది.

కడువు కటకాల బారిపడన ప్రజలు "అన్నమోరామచంద్రా" అని అలమటించిన పాలకులు,మత పెద్దలు పట్టించుకోలేదు "సర్వం మిథ్య, జగన్మిథ్య" పొమ్మన్నారు. ఈ కష్టాలన్ని పూర్వజన్మ పాపఫలితమే నన్నారు. కొక్కరు వనకండా కష్టా లనభవిస్తే, వర్ణాశ్రమధర్మం ప్రకారం ఎవరి ధర్మాన్నివారు నిర్వర్తిస్తే, ఎవరు చేయవలసిన కర్మను (పని) వారు చేస్తే, ముక్తి లభిస్తుందని ప్రజలకు శ్రీరంగనీతులు బోధించారు. కర్మసిద్ధాంతాన్ని ప్రచారంచేస్తూ, ప్రజలను దోచుకతిన్నారు.

ఈ దశలో రామానుజాచార్యుని భక్తిమార్గం ప్రజల చైతన్యానికి జీవం పోసింది.

ఏ వ్యక్తిలో నన్నవా రైనాసరే,ఏ కులంలో, ఏ మతంలో పుట్టిన వారైనా సరే, నిర్మల హృదయంతో భగవంతుని ప్రార్థిస్తూ, పరిశుద్ధంగా జీవించిన వారికి మోక్షం సిద్ధిస్తుందని, భక్తి మార్గావలంబకులు విశ్వసించారు. అస్పృశ్యతను వ్యతిరేకించడానికీ, ఎవరికైనా సరే విద్య నేర్పడానికీ పూనుకున్నారు. కర్మసిద్ధాంతాన్ని బోధించుతూ అంతులేని అవినీతికి పాల్పడినవారి నెదిరించడానికి! సామాన్య ప్రజలు భక్తి మార్గమనే ఆయుధాన్ని చేపట్టారు.

రామరాజ్య వివాదం

హరిజనుడైన తిరుప్పనాళ్వార్, వైష్ణవుల పంచమ వేద మనదగిన "తిరువైమోలి" గ్రంధాన్ని రచించారు.

నూనెగానుగను తివ్వుకుంటూ జీవించిన ఎజుదాచన్, మళయాళంలో భారత రామాయణాన్ని రచించి నూతన ధర్మాలను ప్రతిపాదించారు.

గుడ్డలు కుట్టుకుంటూ జీవించిన నామదేవ్ మహారాష్ట్రలో కుల భేదాన్ని, విగ్రహారాధనను వ్యతిరేకించారు.

కుల భేదాన్ని వ్యతిరేకిస్తూ, భక్తి మార్గాన్ని బోధిస్తూ రామానందుడు దేశమంతటా సంచరించాడు. రామానందుని శిష్యులలో చెప్పులు కుట్టుకుంటూ జీవించిన రాయ్‌దాస్, జాట్ హరిజనుడైన ధార్నా, క్షౌరవృత్తితో జీవించిన సేనా, బట్టలు నేస్తూ బ్రతికిన కబీర్, నూలువడుకుతూ జీవించిన దాదూలాంటి వారున్నారు. వీరంతా రామనామం జపిస్తూ, సంస్కరణోద్యమాన్ని బలపరుస్తూ, ప్రజల కర్థమయే భాషల్లో కీర్తనలు రచించారు.

"శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. పితృవాక్య పాలనకై రాజభోగాలను త్యజించి, అరణ్యవాసం చేసినవాడు. సోదరుల ప్రేమను చూరగొన్నవాడు. ఒక సామాన్య రజకుని మాటకు కూడా విలువనిచ్చినవాడు. సీత మహాపతివ్రత. అష్టకష్టాలు పడిన మహాసాధ్వి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకు అవతరించినవారు. వారిని కీర్తించండి, వారి ఆదర్శాలను అనుసరించండి" అంటూ రామానందుడు, ఆయన శిష్యులూ ప్రచారం జేశారు.

తాంత్రిక మాంత్రిక పద్ధతులను నామాచారాలను వ్యతిరేకిస్తూ, బౌద్ధ రామాలను లజిక్కిబ్బందిగా వర్ణిస్తూ, ఏవగించుకుంటున్న ప్రజలకు రామనామం తారకమంత్రమైంది

గ్రామ గ్రామాన రామ భజనలు ప్రారంభమయ్యాయి. రామాలయాలు వెలశాయి. రామమంత్ర లేర్పడి పల్లె ప్రాంతాలలో ప్రచారం చేశాయి. కొయలు, గంగిరెద్దు వాళ్ళుకూడా రామభక్తులయ్యారు.

అంతవరకూ శ్రీరాముడు. భగవంతుని అవతారమని ప్రజలు భావించలేదు. దశావతారాలలో రామావతారమున్నప్పటికీ. రామావతార ప్రస్తక్తి పాణినీయంలో లేదు. అమరంలోనూ లేదు. ఈనాటికీ శుభాశుభ కర్మలన్నింటా, "మాధవాయనమః. గోవిందాయనమః, హరే శ్రీకృష్ణాయనమః" అంటూ విష్ణుపూజ చేస్తున్నారేగాని "రామాయమః" అని పూజించడంలేదు. కాబట్టి రాముడు దేవుడనే నమ్మకం, జమిందారీ (ఫ్యూడల్) వర్గాల దోపిడికి అవినీతికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమ సమయంలోనే

ప్రజలకు కలిగిందని చెప్పవచ్చు. ఉత్తర భారత్‌లో రామలీలలు, దక్షిణ భారత్‌లో రామాలయాలు ప్రారంభమైనదీ దశలోనే.

ఈ దశలోనే మహారాష్ట్రలో కృష్ణుని సరసనుండి రాధను తొలగించి రుక్మిణిని చేర్చారు.

పేద కుటుంబంలో జన్మించిన చైతన్యుడు, వంగ దేశంలో కృష్ణ నామం జపిస్తూ కుల, మత, ఏభేదాలను వ్యతిరేకించారు. వైతు కుటుంబంలో పుట్టిన వేమన, వేమన శతకాన్ని రచించారు.

జన్మనక్షత్రం మంచిది గాదనే మూఢ నమ్మకంతో ఒక బ్రాహ్మణుడు తనకు పుట్టిన బిడ్డను ఒక చెత్తకుప్పలో పారేయగా, ఆ బిడ్డను ఒక సాధువు రక్షించాడు. ఆబిడ్డడే తులసీదాస్. శ్రీరాముని మహిమను వర్ణిస్తూ స్వర్గతుల్యమైన రామరాజ్యాన్ని చిత్రిస్తూ రామచరితను వ్రాశారు. అదే తులసీ రామాయణం.

శృంగార రసాన్ని త్రోసిపుచ్చి, భక్తి రసాన్ని చొప్పించి త్యాగయ్య కృతులు రచించాడు.

హిందవుల భక్తి మార్గానికి, ముస్లిముల సూఫీ మార్గం తోడైంది. ఖ్వాజామొయినుద్దీన్ ఖిష్తి, షేక్ నిజాముద్దీన్ అవులియా వంటి మహనుభావులు ఇస్లాంమత పెద్దల, సుల్తానుల విలాసాలను, దోపిడీలను వ్యతిరేకించారు. హిందువులు, ముస్లిములు ఒకే భగవంతుని బిడ్డలని చాటిచెప్పారు.

క్రమంగా భక్తి మార్గం బలమైన సంస్కరణోద్యమంగా మారింది. మరి కొంతకాలానికి జమిందారీ వర్గాల దోపిడిని వ్యతిరేకించగల ప్రజా ఉద్యమంగా రూపొందింది.

ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ, వంటి దేశాలలో ప్రొటెస్టాంట్లు ప్రజలను సమీకరించి పాలక వర్గాల, మత పెద్దల దోపిడిని వ్యతిరేకించినట్లే భారత దేశంలో భక్తిమార్గ, సూఫీమార్గావలంబికులు కూడా వ్యతిరేకించారు.

మత ధర్మాల పేరుతో, ఆచార సంప్రదాయాలమాటున సాగుతున్న పూర్వపు వర్గాల దోపిడిని, అత్యాచారాలను వ్యతిరేకించడానికి, ఆరోజుల్లో ఏదో ఒక మత ధర్మాన్ని తమ ఆయుధంగా చేపట్టడం ప్రజలకు అవసరమైంది.

ఒక చిన్న వర్తకుని కొడుకైన గురునానక్ సిక్కు మతధర్మాన్ని బోధించాడు. అటుపిమ్మట సిక్కులు ఢిల్లీ పాదుషాలపై తిరుగుబాటు చేశారు.

మహారాష్ట్రలో తుకారామ్, రామదాసులు విప్లవాగ్నిని రగిల్చారు. తుకారామ్ వెనుకబడిన కులంలో పుట్టి, చిన్న వర్తకం చేస్తూ కొంతకాలం జీవించి సన్యసించారు. రామదాసు సాహసాన్ని కుటుంబంలో జన్మించారు. వీరిద్దరూ రగిల్చిన విప్లవాగ్ని శివాజీ విజయాలకు తోడ్పడింది.

ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్య భారత్, దక్షిణ భారత్‌లలో కూడా పెద్ద ఎత్తున పోరాటాలు చెలరేగాయి. ఈ పోరాటాలను చేతివృత్తులవాళ్ళు, వ్యాపారులు గట్టిగా బలపరిచారు.

• ఈ ఉద్యమంలో దేశమంతటా, ముఖ్యంగా దక్షిణ భారతమంతటా రామనామం, రామరాజ్యం కావాలనే వినాదం ప్రతిధ్వనించాయి.

ఇలా ఎన్ని ఉద్యమాలు చెలరేగినా, పశ్చిమయూరప్‌లో మాదిరిగా జమీందారీవర్గాల పెత్తనాన్ని తొలగించలేక పోయారు. భారత దేశంలో
• ఈస్టిండియా కంపెనీ దిష్టవేయడంతో పరిస్థితి మరో విధంగా మారి
• పోయింది.

అయినా, రామరాజ్యం కావాలనే కోర్కెమాత్రం సడలలేదు. అవతారమూర్తిగా భావించి, సామాన్య ప్రజలు రాముని కీర్తించడం, పూజించడం తగ్గలేదు. కాగా కృష్ణునికంటే రాముడే గొప్పవాడని చెప్పేందుకు కొన్ని ప్రయత్నాలు కూడా జరిగాయి.

భారత — రామాయణాల మధ్య పోటీ

భారతంలోని భగవద్గీతకు పోటీగా రామగీతలు వ్రాశారు. ఒక
• రామగీతను శ్రీరాముడు లక్ష్మణునకు చెప్పినట్లుగా వ్రాస్తే, మరొక రామ గీతను శ్రీరాముడు హనుమంతునకు చెప్పినట్లుగా వ్రాశాడు.

ఇవి రెండూగాక హనుమంతునకు సీతాదేవి చెప్పినట్లుగా వ్రాసిన రామ హృదయం కూడా వుంది. దీనిలో సీతాదేవి "మూలప్రకృతిని నేనే. రామాయణంలోని ఘటనలన్నీ నా ఇష్టప్రకారమే జరిగాయి. రాముడు

కేవలం నిమిత్తమాత్రుడే" అని హనుమంతునకు చెప్పినట్లుగా వర్ణించి, రాధకు పోటీగా సీతను నిలబెట్టారు.

ధర్మరాజు చాతుర్యాన్ని చంపినట్లుగా భారతంలో వ్రాయగా, శ్రీరాముడు గౌతమబుద్ధుని నిదించినట్లుగాను, శంబుకుని వధించినట్లుగానూ రామాయణంలో వ్రాశారు. భారతంలో వివరింపబడిన రాజనీతి రామాయణంలో లేకపోవుట మొక కొరతగా భావించి, భరతునకు శ్రీరాముడు రాజధర్మం బోధించినట్లుగా వ్రాసిపెట్టారు.

శివధనుస్సును విరిచి శ్రీరాముడు సీతాదేవిని పరిణయమాడినట్లుగా రామాయణంలో నున్నందున, మత్స్యయంత్రాన్ని భేదించి అర్జునుడు ద్రౌపదిని పొందినట్లుగా భారతంలో వ్రాశారు. సీతాపహరణకు ప్రతిగా ద్రౌపదిని సైంధవుడు ఎత్తుకు పోయినట్లుగా చిత్రించారు.

బ్రాహ్మణుడైన వ్యత్రాసురుని చంపినందువల్ల ఇంద్రునకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకోగా, ఆయన పలుబాధలు పడినట్లుగా వేదాల్లో ఒక కథ వుంది

కాబట్టి రావణబ్రహ్మను సంహరి చినందువల్ల శ్రీరామునకు కూడా బ్రహ్మహత్యాపాతకం చుట్టుకున్నదనీ, దానినుండి నిముక్తి పొందేందుకు శ్రీరాముడు అశ్వమేధ యాగంచేసి భూదేవులకు భూదాన గోదాన హిరణ్య దానములు చేశాడనీ రామాయణంలో వ్రాశారు.

గురువు, బ్రాహ్మణుడైన ద్రోణుని వధించడమేగాక సకల బంధు మిత్ర పరివారమును సంహరించినందున చుట్టుకున్న పాతకంనుండి బయట పడేందుకు ధర్మరాజు అశ్వమేధయాగం చేశాడని, భూదేవులకు తన రాజ్యంతోసహా దానం చేశాడనీ భారతంలో రాశారు.

రామాయణ కథానాయకుడు శ్రీరాముని కాబట్టి భారత కథా ప్రవర్తకుడు శ్రీకృష్ణు డైనట్లుగా చిత్రించారు.

రావణ, కుంభకర్ణులను శ్రీరాముడు సంహరిస్తే శిశుపాల దంత వక్త్రులను శ్రీకృష్ణుడు సంహరించా డన్నారు.

ఆయన త్రేతాయుగంలో షట్టి దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించగా, ఈయన దుష్టశిక్షణ శిష్టరక్షణ కొరకు ద్వాపరయుగంలో పుట్టా డన్నారు.

ఋష్యశృంగ, వశిష్ఠ, విశ్వామిత్ర, పరశురాముని వంటి ఋషుల కథలను రెంటిలోను చేర్చాడు. యజ్ఞయాగాది క్రతువుల సత్ఫలితాలను గురించి. భూ దేవుల గొప్పదనాన్ని గురించి రెంటిలోను వ్రాసిపెట్టారు. ఇలా వ్రాయడంవల్లనే, భారత రామాయణ గాథలు వేదకాలం నాటివని కొందరు పండితులు వాదించడానికి అవకాశం కలిగింది.

చిలవలు, పలవలతో నిమిత్తం లేకుండా రామోపాఖ్యానం భారతంలో చేరిపోయింది. పురాణాలలోనూ చేరింది.

కొందరు పండితులు రకరకాల రామాయణాలు వ్రాయగా, మరి కొందరు ఊర్మిళాదేవి నిద్ర, కుశలవ కథ లాంటివి వ్రాశారు.

శ్లో॥ "పూర్వం రామ తపోవనానుగమనం, హత్వామృగం కాంచనం
వైదేహీ హరణం, జటాయు మరణం, సుగ్రీవ సంభాషణం
వాలీ నిగ్రహణం, సముద్ర తరణం, లంకాపురీ దాహనం
పశ్చా ద్రావణ కుంభకర్ణ మధనం, చేతద్ధి రామాయణం."

అని, పండితులు ఒకే శ్లోకంలో రామాయణమంతా ఇమిడ్చిచెపితే, పామరులు "కట్టె, కొట్టె తెచ్చె" అంటూ మూడు ముక్కల్లో చెప్పారు. "కట్టింది వారధిని, కొట్టింది రావణుని, తెచ్చింది సీతను" అని వివరించారు.

భారతం చాలావరకు ఒకే విధంగా ఉన్నప్పటికీ, రామాయణం అలాలేదు. ఇరాన్‌నుండి వియత్నాం, చైనాలవరకూ రకరకాల రామకథలున్నాయి.అయినా వీటిలో వాల్మీకి రామాయణానికి సాటిరాగల దేదీలేదు.

వాల్మీకి రామాయణం రక్త సంబంధానికి విలువ విచ్చింది. రాజ్యం కొరకు, సంపద కొరకు కుటుంబ కలహాలు, కుట్రలు కొనసాగితే, అవి పరుల హస్తగత మవుతాయని చాటి చెప్పింది. పితృవాక్యపాలన, భ్రాతృ వాత్సల్యత, రాజ్య పరిత్యాగం లాంటి వాటిని మేటి సుగుణాలుగా వర్ణించింది. పాతివ్రత్యంతోపాటు, ఏకపత్నీవ్రతం లేకపోతే ఫలిత ముండదనీ, దశరథుడు స్త్రీలోలుడు కావడం వల్లనే, కుటుంబ సభ్యులందరూ బాధపడవలసి వచ్చిందనీ, ఇతరుల భార్యలను అపహరించడం వల్లనే వాలి, రావణుడు సర్వనాశన మయ్యారనీ వివరించింది.

అంతేగాని, శ్రీరాముడొక అవతారమూర్తి అని, వాల్మీకి మహర్షి చెప్పలేదు. అనాటి ఆచార సంప్రదాయాలను కప్పిపెట్టనూలేదు. సురాపానం నుండి, గోమాంస భక్షణం వరకూ వాల్మీకి రామాయణంలో కనిపిస్తూనే వున్నాయి.

కనుకనే వాల్మీకి రామాయణం ప్రజల హృదయాలలో చోటు చేసుకున్నది.

పైగా అదొక మహా కావ్యం. ఆది కావ్యం. మొట్టమొదటిదాన్ని సృష్టించి, దానికి పుట్టిని చేకూర్చిన కావ్యం. లౌకిక వాఙ్మయానికి శ్రీకారం చుట్టిన కావ్యం. కాబట్టి పండితులు మెచ్చుకుంటున్నారు.

విమర్శకుల మాట ఎలా వున్నా, సామాన్య ప్రజలు వాల్మీకి రామాయణాన్ని, అందలి పాత్రలను ఎలా అర్థం చేసుకున్నారో? అన్న ప్రశ్నకు ఈక్రింది పాటను పరిశీలిస్తే సమాధానం లభిస్తుంది.

"శ్రీరాముడొక త్యాగి, రావణుడొక భోగి
లక్ష్మణుడొక యోగి, భరతుడొక బైరాగి ॥
కైకమ్మ వరమంట, శూర్పణఖ వలపంట
సీతమ్మ చెరలంట, లంకకే చేటంట ॥"

అంటూ ప్రజలు పాడుకుంటున్నారంటే, వాల్మీకి రామాయణ ప్రభావం వారిపైన ఎలా ప్రసరించిందో బోధపడుతుంది గదా?

రామాయణంతో భారతం ఏకీభవించదు. "కావలసింది రాజ్యం. అంతేగాని రాజ్య పరిత్యాగం కాదు. రాజ్యం వీరభోజ్యం కాబట్టి ఏవిధంగానయినాసరే దానిని సాధించడమే రాజనీతి. ఈ పీఠి ననుసరించి రాజ్యాన్ని సాధించు హాయిగా జీవించు. ఇంచుకు అవరోధంగావున్న కులధర్మాన్ని త్రోసివేయి. వర్ణాశ్రమ ధర్మాన్ని పాటించి, స్వధర్మాన్ని నిర్వర్తించు. క్షత్రియునకు కావలసింది విజయమో? వీరస్వర్గమో? అంతేగాని మరొకటి కాదు అని చాటి చెప్పినది భారతం.

అయినా, ఆనాడు ఉపఖండంలో నివసిస్తున్న పలుతెగల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, నీతులు, ధర్మాలు, భౌతిక ఆధ్యాత్మిక వాదాలు, తర్క, మీమాంస, సాంఖ్యయోగ, వైశేషిక న్యాయసూత్రాలు భారతంలో వున్నాయి. నియతి, స్వభావ, యాదృచ్ఛ, పరిణామవాద

సిద్ధాంతాలున్నాయి. అనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల వివరాలున్నాయి. ఈ నాటికీ పాటించదగిన విదురనీతులు, భీష్ముడు బోధించిన ధర్మాలు వున్నాయి. మన ప్రాచీన చరిత్రను తెలుసుకోడానికి ఉపయోగపడేవి చాలా వున్నాయి.

ఈనాడు కూడా ప్రపంచ మంతటా దేవర న్యాయం, బహుభర్తృత్వం, బహు భార్యాత్వం వున్నాయి, ఆటవిక తెగలు, అనాగరిక తెగలున్నాయి. స్వేచ్ఛా సంగమాలున్నాయి. రహస్య కామకలాపాలు మన దేశంలోనేకాక అనేక దేశాలలో అంతకంతకు పెరుగుతున్నాయి. హిప్పీల సంఖ్య పెరుగుతోంది. అవినీతి, ఆధర్మం, కాంట్రాక్టు, కుటిల రాజనీతి, కుటిల బుద్ధులు విస్తారంగా కనిపిస్తున్నాయి. బాగా బ్రతుకున్న వారు చివరకు డాక్టర్లు కూడా మేనకోడళ్ళను పెళ్ళిచేసుకుంటున్నారు. అన్నచెల్లెళ్ళ బిడ్డల మధ్య, సోదరీ సోదరుల బిడ్డలమధ్య వివాహాలు జరుగుతున్నాయి. సపిండ, సగోత్ర వివాహాలు మంచివిగావని మూడేలు సంవత్సరాల నాడు మన పూర్వులు నిషేధించినా మనం వాటిని మానలేదు. అయినా భారత, రామాయణ గాథలలోని పాత్రలు పచ్చిగానూ, అసభ్యంగానూ వున్నాయని చెపుతూ, వాటిని భూస్థాపితం చేయాలని ప్రయత్నించడం శోచనీయం.

కాబట్టి రామాయణ భారత గాథలు రెండూ శతావతారాలు ఎత్తివప్పటికీ, వాటిని చారిత్రక దృష్టితో పరిశీలించాలి. అంతేగాని, వాటిని భగవంతుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, వేదవ్యాసునకు చెప్పాడనో, లేక వారిరువురూ దివ్యదృష్టితో తెలుసుకుని వాటిని రచించారనో, భావించకూడదు. అలాగే అవి రెండూ ఎందుకూ పనికిరాని గ్రంథాలనో, ప్రజల మనసులపై మత్తుమందుచల్లి, మూఢ నమ్మకాలను పెంచే గ్రంథాలనో, వాటిని ద్వేషించి పుచ్చనూ కూడదు.

కృతజ్ఞతలు

భారతం, రామాయణం, పురాణాలు, పాత నిబంధన గ్రంథాలతోపాటు, వీయుతులు

జాకోబి
మారిస్ విక్టర్నిడ్జ్
ఏంగెల్స్
మోర్గన్
డా॥ భండార్కర్
మల్లాది సూర్యనారాయణశాస్త్రి
దాష్‌బర్ఫ్ హాపిక్స్
యస్. ఎ. డాంగే
డా॥ రోమిలా థాపర్
డా॥ మజుందార్
డా॥ పుసాల్కర్
డా॥ శంకాలియా
యన్ బి.రాయ్
జగత్పతి జోషి
డా॥ సుబ్బారావు
డా॥ మిరాషి
ప్రొ॥ బి. బి. లాల్
సి. ఎ. వైద్య
కె. దామోదరన్
డా॥ సుక్తాన్కర్
ఏటుకూరి బలరామమూర్తి
నార్ల వెంకటేశ్వరరావు
శ్రీమతి ఐరావతీ కార్వే.

రచించిన గ్రంథాలు, గ్రహించిన వ్యాసాలు నా రచనకు తోడ్పడినాయి. కనుక వీరందరికీ నా కృతజ్ఞతలు

—రచయిత

nb

SATAAVATAARAALU
by M. NAGABHUSHANAM

శతావతారాలు

★

కొందరంటున్నట్లు రామాయణం రంకూ కాదు; భారతం బొరికూ కాదు.

వీటిని వాల్మీకి మహర్షికో, వేదవ్యాసునకో, బ్రహ్మ దేవుడు చెప్పనూలేదు. ఇవి దివి నుండి భువికి దిగనూ లేదు; ఈ రెంటి వెనుకా పెద్దగాథ వుంది. చారిత్రక దృక్పథంతో పరిశీలించినప్పుడు గానీ వీటిలో సత్యా సత్యాలు ఏమిటో తేలవు.

ఇతి హాస పురాణగాథలను చారిత్రక పరిణామక్రమ దృష్టితో పరిశీలించి శ్రీ ముక్కామల నాగభూషణంగారు చేసిన కృషి ఫలితమే ఈ "శతావతారాలు."

కొన్ని వాస్తవాలతో అనేక కల్పనలతో కాలక్రమాన మహాకావ్యాలుగా విస్తరించిన రామాయణ, మహా భారత గాథలను గురించి శాస్త్రీయ అవగాహన పాఠ కులకు కలిగించడానికి ఈ పుస్తకం దోహదం చేస్తుంది.

Printed at Swatantra Art Printers, Vijayawada - 4.

96

Check List

Book Number	mRBIBJ346	Date	23-12-2021
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	C.1, iv, 94, 95		
Missing Pages	no		
Prepared By	mahisha	Cutting By	mahisha
Scanned By	Ch. Ramya	Pages	103